సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 207

బుధవారం 12-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



**రజతం నెగ్గిన నిషా**

ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు - 12లో



**భారత్‌లో యాపిల్ స్టోర్‌లు**


ముంబై, ఢిల్లీలో సీఈవో టిమ్ కుక్ ప్రారంభించనున్నట్లు సమాచారం -13లో



**నన్నెవరూ ఆపలేరు**

ఎంపీ పదవి నుంచి తొలగించినప్పటికీ వయనాడ్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించకుండా తనను అడ్డుకోలేరని రాహుల్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



**300కుపైగా సీట్లు మావే**

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 300పైగా సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని అస్సాం పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు.

వివరాలు 6లో ▸



**సాధారణ వర్షపాతమే..**

'ఎల్‌నినో'కు అవకాశమున్నా కూడా ఈ ఏడాది నైరుతి వర్షపాతం సాధారణ స్థాయిలో కొనసాగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.

వివరాలు 6లో ▸



**పెనుసవాల్‌గా 'డ్రోన్ ఆయుధాలు'**

పాక్ నుంచి డ్రోన్లతో ఆయుధ సరఫరా వల్ల పెనుసవాళ్లను ఎదుర్కొంటున్నామని భద్రతా మండలిలో భారత ప్రతినిధి పేర్కొన్నారు.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### ఏపీ ఈఏపీసెట్‌కు 2,80,779 దరఖాస్తులు



ఏపీ ఈఏపీసెట్–2023కు ఇప్పటివరకు 2,80,779 దరఖాస్తులు వచ్చాయని సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వివరాలు 3 ▸

### స్టీల్‌ప్లాంట్‌పై కేసీఆర్‌ది కపట ప్రేమ



తెలంగాణ సీఎం కేసీఆర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కపటప్రేమ ఒలకబోస్తున్నారని బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ విమర్శించారు. గతంలో ఆంధ్ర ప్రజలపై విషం కక్కిన కేసీఆర్ ఇప్పుడు ఏపీని ఉద్ధరిస్తామని చెప్పడం.. కేవలం రాజకీయ లబ్ధి కోసమేనన్నారు.

వివరాలు 3 ▸

### విదేశాల్లో చంద్రబాబు నల్లధనం రూ.5 లక్షల కోట్లు



చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్జన చేసి దుబాయ్, స్విట్జర్లాండ్‌లో దాచిన రూ.5 లక్షల కోట్ల నల్లధనాన్ని స్వదేశానికి రప్పించాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ స్పందించి ఈడీ, సీబీఐతో విచారణ చేయించాలని కోరారు.

వివరాలు 10 ▸

# బాబే.. 'ప్రైవేటు' మాస్టర్

## ఉమ్మడి ఏపీలో 54 ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసిన.. మూసేసిన చంద్రబాబు

## సింగరేణిని ప్రైవేటీకరించేందుకు వీఆర్ఎస్ పేరుతో వేల ఉద్యోగుల తొలగింపు

- అప్పుడు 'ఈనాడు'కు అంతా పచ్చగానే కనిపించింది... ఒక్క ముక్క రాస్తే ఒట్టు
- ఇప్పుడేమో తెలంగాణ సర్కారు ప్రకటనతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషపు చుక్కలు
- ప్రభుత్వాలు గానీ, ప్రభుత్వ సంస్థలు గానీ బిడ్డింగ్‌లో పాల్గొనకూడదని 'ఈనాడు'కు తెలీదా?
- 51 శాతం దాటి ప్రభుత్వ వాటా ఉంటే... పీఎస్‌యూలు కూడా పాల్గొనకూడదు
- ఈ మేరకు ఏడాది కిందటే ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- దీని ప్రకారం ఏపీ, తెలంగాణ, సింగరేణి... ఇవేవీ బిడ్డింగ్‌లో పాల్గొనకూడదు
- ఈ సంగతి రామోజీరావుకు తెలియదనుకోవాలా? ఎందుకీ దుర్మార్గపు రాతలు?
- తెలంగాణకు ఉన్న శ్రద్ధయినా ఏపీకి లేదంటూ మెదళ్లలో విషం నింపే యత్నాలు
- ఒక్క లేఖ రాయలేదని... అభ్యర్థన కూడా చేయలేదని పచ్చి అబద్ధాలకు దిగిన రామోజీ
- నిజానికి ప్రైవేటీకరణ వద్దని ప్రధానిని కోరుతూ రెండుసార్లు లేఖలు రాసిన సీఎం జగన్
- 2021 ఫిబ్రవరి 6న, 2022 మార్చి 9న ప్రత్యామ్నాయాలు సూచిస్తూ రెండు లేఖలు
- పైపెచ్చు ప్రధానిని కలిసినప్పుడల్లా విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దని అభ్యర్థనలు
- సొంత గనుల్లేకే విశాఖ స్టీల్‌కు ఇబ్బందులు గనుక గనులు కేటాయించాలని కోరిన జగన్
- విభజన చట్టంలోని కడప స్టీల్ ప్లాంటును సాధించడంపై బాబును ఎన్నడూ అడగని రామోజీ
- ఐదేళ్లు బాబు పట్టించుకోకపోయినా కనీసం ప్రస్తావన కూడా చేయని 'ఈనాడు'
- కేంద్రం నిరాసక్తతతో.. చివరకు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌ను ఒప్పించి శంకుస్థాపన చేయించిన జగన్
- రామోజీది విశాఖ ఉక్కుపై ప్రేమ కాదు... జగన్ సర్కారుపై కక్ష, అసూయ, అక్కసు

**ఏది నిజం ?**



ఒకటీరెండూ కాదు! 54 ప్రభుత్వ సంస్థలు. కొన్నిటిని కావాల్సిన వారికి అమ్మేశారు. మరికొన్నింటి ఆస్తుల్ని నచ్చినవారికి ఇచ్చేసి.. వాటిని మూసేశారు. అక్కడితో ఆగలేదు. ''ఆంధ్రప్రదేశ్‌లో ప్రయివేటీకరణ... ఓ విజయగాథ'' అంటూ పుస్తకం వేసుకున్నారు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. తన ఘనతకు జబ్బలు చరుచుకుంటూ... ''మారకపోతే ముందుకెళ్లటం అసాధ్యం. ప్రభుత్వ రంగ సంస్థలు ఇలాగే ఉంటే కష్టం'' అని ముందుమాట కూడా రాశారు. ఇక నాటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడైతే... ఇలాంటి పుస్తకం తెచ్చినందుకు తన జన్మ ధన్యమైందంటూ ఉప్పొంగిపోయారు. ప్రయివేటీకరణ అనే పదానికి పేటెంట్ తీసుకుని, దానికోసం ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేసి మరీ ప్రభుత్వ సంస్థల్ని ఊచకోత కోసిన చంద్రబాబు ఇప్పుడేమంటున్నారో తెలుసా? విశాఖ స్టీల్ ప్రయివేటీకరణను

మిగతా 4వ పేజీలో ▶

# బీసీ కుల గణనకు జై

## ఏపీలో నిర్వహించేందుకు సీఎం జగన్ కీలక నిర్ణయం

- బీసీ సంఘాల ఆశల అమలు దిశగా ప్రభుత్వం అడుగులు
- కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఏపీ అసెంబ్లీ తీర్మానం
- త్వరలో బీసీ కుల గణన అధ్యయనానికి కమిటీ
- బీహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో అధ్యయనం.. కమిటీ నివేదికతో మార్గదర్శకాల రూపకల్పన




సీఎం వైఎస్ జగన్ నిర్ణయంపై బీసీ సంఘాల హర్షం

2 లో

# అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే!

- ఆర్బీఐ వారించినా రామోజీరావు బుద్ధి వంకరే
- నాడు కేసు విచారణ కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' మూసివేత
- ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' ముసుగులో మళ్లీ అక్రమ డిపాజిట్ల దందా.. చట్ట ప్రకారమే చర్యలకు ఉపక్రమించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ బాధ్యత నిర్వర్తించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని నాడే తేల్చేసిన ఆర్బీఐ

2 లో





- డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు



# 10వేల గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

- పలు జిల్లాల్లో తుదిదశకు.. జూన్ నాటికి అన్ని జిల్లాల్లో పూర్తిచేసేందుకు ప్రయత్నాలు
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక ప్రణాళికతో డీజీపీఎస్ సర్వే

3 లో

# ఆ పేదల ఇంట పెద్ద పండుగ


## నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం సాయం

- వివరాలు 10లో

- ఓసీ సామాజికవర్గాల్లోని 4,39,068 మందికి రూ.658.60 కోట్లు పంపిణీ
- ప్రకాశం జిల్లా మార్కాపురం వేదికగా బటన్‌నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# దిగుబడులు ఘనంగా..

- 2021-22లో 368.83 లక్షల టన్నుల దిగుబడులు
- అదే 2020-21లో అయితే 314.78 లక్షల టన్నులు
- ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి
- 2022-23లో 400 లక్షల టన్నులు దాటే అవకాశముందని అంచనా
- నాలుగేళ్లలో 20 శాతం మేర పెరుగుదల
- ఏటా విస్తరిస్తున్న ఉద్యాన పంటల సాగు..





సాక్షి, అమరావతి: ఉద్యాన పంటల సాగు.. దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్ రికార్డులు తిరగరాస్తోంది. పండ్ల దిగుబడుల్లో అయితే రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. లాభసాటి కాని వ్యవసాయ పంటల స్థానంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 44 నెలలుగా తీసుకున్న చర్యలు, ఇస్తున్న ప్రోత్సాహకాల ఫలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న తోటబడుల ద్వారా ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించేలా చేయడంతో దిగుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి.

**రికార్డు స్థాయిలో 17 శాతం వృద్ధి**

2021–22లో ఉద్యాన పంటల తుది దిగుబడి అంచనాలను ప్రభుత్వం విడుదల చేసింది. 2020–21లో 44.90 లక్షల ఎకరాల్లో సాగవగా, 314.78 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. • అదే 2021–22లో 45.60 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవగా ఏకంగా 368.83 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి. • 2020–21తో పోలిస్తే సాగు విస్తీర్ణం 70వేల ఎకరాల్లో పెరిగితే దిగుబడులు ఏకంగా 54 లక్షల టన్నుల మేర పెరిగాయి. • ఇలా ఏకంగా 17% వృద్ధి రేటుతో ఆల్‌టైం రికార్డు నమోదైంది. • ఏడాదిలో దిగుబడులు ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. • 2022–23లో 400 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

**పంట పండిన పండ్లు.. గుబాళించిన పూలు..**

ఇక పండ్ల దిగుబడుల్లో ఏపీ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. 2020–21లో 178.86 లక్షల టన్నుల దిగుబడులు నమోదైతే.. 2021–22లో ఏకంగా 203.35 లక్షల టన్నులు దిగుబడులొచ్చాయి. ఇది కూడా ఓ రికార్డు అని చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేనివిధంగా పూలు కూడా గుబాళించాయి. పండ్లతో పోటీపడేలా వీటి దిగుబడులొచ్చాయి. 2020–21లో 44వేల ఎకరాల్లో పూల మొక్కలు సాగవగా, 2.80 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. అదే 2021–22లో సాగు విస్తీర్ణం 1.04 లక్షల ఎకరాలకు పెరగగా, దిగుబడులు ఏకంగా 8.67 లక్షల టన్నులు నమోదయ్యాయి. ఇక ఆయిల్‌పామ్, కొబ్బరి, జీడిమామిడి, కోకో వంటి ప్లాంటేషన్ పంటల దిగుబడులు 2020–21లో 43.52 లక్షల టన్నులు నమోదైతే 2021–22లో ఏకంగా 57.56 లక్షల టన్నులు నమోదయ్యాయి. ఇక కూరగాయల విషయానికొస్తే 2020–21లో 72.92 లక్షల టన్నుల దిగుబడులొస్తే 2021–22లో 77 లక్షల టన్నులు నమోదయ్యాయి.

**దిగుబడులు పెరగడానికే కారణాలు..**

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాల్లో మార్పులు తీసుకురావడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో సాగులో మెళకువలు నేర్పేందుకు పెద్దఎత్తున తోటబడులు నిర్వహించింది. పంటలకు అదనపు విలువ జోడించేందుకు గ్రామస్థాయిలో మౌలిక వసతులు కల్పించడం, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చడం వంటి చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ఈ కారణంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా 4 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. మరోవైపు.. స్ట్రాబెర్రీ, నట్‌మెగ్, సిన్నామన్, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, జామూన్, కరండ, చెర్రీ వంటి విదేశీ పండ్ల సాగు కూడా విస్తరిస్తోంది.

**గడిచిన నాలుగేళ్లలో పెరిగిన ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులిలా..**

| సంవత్సరం | హెక్టార్లు (లక్షల్లో) | దిగుబడులు (లక్షల టన్నుల్లో) |
|---|---|---|
| 2018-19 | 41.4 | 305.20 |
| 2019-20 | 44.6 | 312.34 |
| 2020-21 | 44.87 | 314.79 |
| 2021-22 | 45.60 | 368.83 |

**పెరిగిన పండ్ల సాగు విస్తీర్ణం.. దిగుబడుల వివరాలు..**

| సంవత్సరం | హెక్టార్లు (లక్షల్లో) | దిగుబడులు (లక్షల టన్నుల్లో) |
|---|---|---|
| 2018-19 | 7.05 | 176.44 |
| 2019-20 | 7.40 | 182.06 |
| 2020-21 | 7.39 | 178.86 |
| 2021-22 | 7.91 | 203.35 |

# మంచిని పొగిడితే నొప్పేందుకు?

- సోషల్ మీడియా పోస్టులు చూసి వార్తలు రాస్తారా?
- అంత దిగజారిపోయిందా ఈనాడు దినపత్రిక
- సీటీ సర్జన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కర్నూలు (హాస్పిటల్): 'నేనేమైనా డ్యూటీ సమయంలో ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నానా? ఆస్పత్రికి వచ్చే నిధులను కొల్లగొడుతున్నానా? ఎవరినైనా తీవ్ర పదజాలంతో విమర్శిస్తున్నానా? ఒక ప్రభుత్వ అధికారిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఓ రెండు కవితలు రాశాను. ఇదే నేను చేసిన తప్పా. ఎక్కడైనా ఏ పత్రికలైనా ఇలాంటి విషయాలపైన కూడా వార్తలు రాస్తాయా.. విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగిస్తున్నామని చెప్పుకొనే ఈనాడు దినపత్రిక చేసేపని ఇదా.. ఇంతకంటే దౌర్భాగ్యమేమైనా ఉందా..' అని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ (సీటీ) సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈనాడు దినపత్రిక పనిగట్టుకుని తనపై ప్రతిరోజూ విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడైనా ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ సమాచారాన్ని బయటికి చెబితేనో, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితేనో, కార్యక్రమాలు చేపడితేనో సీసీఏ రూల్స్ ప్రకారం నేరమని చెప్పారు. ప్రభుత్వం మంచిచేస్తే దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయడం తప్పు అని ఆ పత్రిక ఎలా చెబుతుందని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఓ ఉద్యోగ సంఘం నాయకుడు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళనలు చేసిరాలేదా, టీడీపీకి మద్దతు ఇస్తూ కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదా, ఆయనపై అప్పుడు ఏమైనా వార్తలు రాశారా అని నిలదీశారు. తాను కేవలం ప్రభుత్వం చేసే మంచి గురించే కాకుండా సామాజిక, ఆరోగ్యం, మూఢనమ్మకాలు, ఇతర అంశాలపైన కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటానని చెప్పారు. తనకు సోషల్ మీడియాలో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారని, తన అభిప్రాయాలను వారితో పంచుకునే హక్కు తనకు ఉందని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి వస్తే ఒక్కోసారి రాత్రి 8 గంటల వరకు ఇక్కడే ఉండి పనిచేయాల్సి ఉంటుందన్నారు. తాను నిజాయితీనే నమ్ముకున్నానని, కష్టపడి పనిచేయడమే తెలుసని చెప్పారు. పదిమందికి సహాయం చేయటం తన నైజమని, దేశభక్తి, స్వామిభక్తి తన బలహీనత అని పేర్కొన్నారు. తానిలాగే ఉంటానని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతి హత్య కేసును సీబీఐకి ఎలా బదలాయిస్తాం?

- సుబ్రహ్మణ్యం హత్య కేసులో సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇవ్వం
- తేల్చిచెప్పిన హైకోర్టు సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చే ప్రసక్తే లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. దర్యాప్తును సీబీఐకి బదలాయించాలన్న అప్పిలెంట్ల అభ్యర్థనను ఆక్షేపించింది. ప్రతి హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఎలా బదలాయిస్తామని ప్రశ్నించింది. అది ఎంత మాత్రం సాధ్యం కాదని స్పష్టంచేసింది. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే కోరుతూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఆ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే ఏం చేయాలో నిర్ణయిస్తామని తెలిపింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సుబ్రహ్మణ్యం హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరుతూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ గత ఏడాది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి కొట్టేశారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరించారు. మూడు నెలల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.



**ఇదం జగత్**



## జ్యోతిరావు పూలేకు సీఎం జగన్ నివాళి



సాక్షి,అమరావతి: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, గుడివాడ అమర్నాథ్, జోగి రమేష్, విడదల రజిని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పోర్టు నిర్మాణం చరిత్రాత్మకం

- సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు పోర్టు రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ నెల 19న జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లపై ఆయన శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్, జేసీతోపాటు జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాకు పోర్టు రావడంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరిందన్నారు. విశ్వ సముద్ర ప్రాజెక్టు అధికారులకు సమస్య ఉంటే కలెక్టర్‌తో చర్చించవచ్చని తెలిపారు. అధికారులకు అప్పగించిన పనులను బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. అధికారులంతా ఒక టీమ్‌గా కలిసి పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 19న భావనపాడు పోర్టు, గొట్టా బ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్‌తో కలిపి సుమారు రూ.4వేల కోట్ల విలువైన పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని వివరించారు.

## 'ఫైన్' ప్రదర్శనలో ఏపీకి 3 జాతీయ అవార్డులు

సాక్షి, అమరావతి: ఇన్‌స్పైర్–మనాక్ 2020–21 పోటీల్లో భాగంగా నిర్వహించిన 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–2023'(ఫైన్) ప్రదర్శనలో ఏపీకి 3 జాతీయ పురస్కారాలు వచ్చినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో 4 రోజుల పాటు నిర్వహిస్తోన్న ఫైన్ ప్రదర్శనలో ఏపీ విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. కాగా, ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇందులో చిత్తూరు జిల్లా జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ తేజ (బ్యాక్ రెస్ట్ ఫర్ సైడ్ సీటెడ్ ఉమెన్), కె.ప్రణయ (గార్లిక్ బ్యాగ్), కాకినాడ నుంచి దుర్గా ప్రసాద్ (మెషిన్ ఫర్ మేసన్) ప్రాజెక్టులకు బహుమతి లభించింది. ఇందులో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్, డీఎస్‌టీ కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖర్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డైరెక్టర్ అరవింద్ సి.రానడె పాల్గొన్నారు. విద్యార్థులను, వారితో పాటు చిత్తూరు జిల్లా సైన్స్ అధికారి ఆర్‌పీ రమణ, కాకినాడ గైడ్ టీచర్ భవానీలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర స్థాయి సైన్స్ ఆఫీసర్ భాగ్యశ్రీ అభినందించారు.

## ఏపీలో 4 మండలాలకు రెడ్ అలెర్ట్

### తీవ్ర వడ గాలులు, వేడి ఉండే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బుధవారం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రధానంగా 4 మండలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. కాకినాడ జిల్లా కోటనందూరు, అనకాపల్లి జిల్లా గొలుగొండ, నాతవరం, మండలాల్లో 42 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండడంతోపాటు తీవ్ర వడగాల్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించినట్లు తెలిపారు. 126 మండలాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటతాయని, వడగాలుల ప్రభావం ఉంటుందన్నారు. కాగా, మంగళవారం అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో అత్యధికంగా 42.9 డిగ్రీలు, అనకాపల్లి మండల కేంద్రం, కోటవురట్లలో 42.4 డిగ్రీలు, మాకవరపాలెంలో 42.5, కాకినాడ జిల్లా తొండంగిలో 41.8, తునిలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## 'పుడమి సాక్షిగా' క్యాంపెయిన్‌కు ప్రతిష్టాత్మక ఏఎఫ్ఏఏ అవార్డు

- సాక్షి మీడియా గ్రూపు ఉద్యమానికి అంతర్జాతీయ గౌరవం
- పర్యావరణ పరిరక్షణలో తెలుగు సంకల్పానికి గుర్తింపు



ముంబైలో AAFA చైర్మన్ శ్రీనివాసన్ స్వామి, IAA ప్రెసిడెంట్ అవినాష్ పాండే, ఆలివ్ క్రౌన్ చైర్మన్ జనక్ సర్దా చేతుల మీదుగా అవార్డు అందుకుంటోన్న సాక్షి డైరెక్టర్ రాణి రెడ్డి.



సాక్షి ప్రధాన కార్యాలయంలో నటుడు అలీతో గ్రూపు డైరెక్టర్లు, సీఈవో, ఎడిటోరియల్ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: పుడమి సంరక్షణ కోసం సాక్షి మీడియా గ్రూప్ చేస్తోన్న 'పుడమి సాక్షిగా'క్యాంపెయిన్‌కు అంతర్జాతీయ గౌరవం దక్కింది. అడ్వర్టైజింగ్ ఇండస్ట్రీ ఆఫ్ ఏషియా (ఏఐఏ) ఆధ్వర్యంలోని ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్టైజింగ్ అసోసియేషన్ (ఏఎఫ్ఏఏ).. పుడమి సాక్షిగా కార్యక్రమాన్ని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 'కార్పొరేట్ సోషల్ క్రూసేడర్ ఆఫ్ ది ఇయర్‌సిల్వర్ అవార్డు'తో సత్కరించింది. ముంబై వేదికగా జరిగిన ఈ అవార్డుల కార్యక్రమంలో సాక్షి కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాణి రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఏఎఫ్ఏఏ చైర్మన్ శ్రీనివాసన్ స్వామి, ఏఐఏ ప్రెసిడెంట్ అవినాష్ పాండే, ఆలివ్ క్రౌన్ చైర్మన్ జనక్ సర్దా ఈ అవార్డును అందజేశారు.

**పుడమి'సాక్షి'గా లక్ష్యాలివే..**

ప్రతీ ఏటా జనవరి 26న మెగా టాకథాన్‌గా వస్తోన్న పుడమి సాక్షిగా కార్యక్రమం 2020–21లో ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడు ఎడిషన్లు పూర్తి చేసుకుంది. పర్యావరణాన్ని కాపాడడం, కాలుష్యం తగ్గించడం, స్వచ్ఛమైన పుడమిని భవిష్యత్ తరాలకు అందించడం.. పుడమి సాక్షిగా లక్ష్యాలు. ప్రాణకోటికి జీవనాధారమైన ధరిత్రి ప్రమాదంలో పడడానికి మనుషులే ప్రధాన కారణం. ఈ భూమి మళ్లీ పునర్వైభవాన్ని దక్కించుకోవాలంటే.. ప్రతి ఒక్కరూ చేయాల్సిన కృషిని పుడమి సాక్షిగా గుర్తు చేస్తోంది. ప్రతి నెలా ఏదో ఒక రూపంలో పుడమి కార్యక్రమాలు చేపడుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యావరణంపై అవగాహన కల్పించడంతో పాటు ఇందులో ప్రజలను భాగస్వామ్యులను చేస్తోంది. దీంతోపాటు గణతంత్ర దినోత్సవం రోజున సాక్షి టీవీలో దాదాపు 10 గంటలపాటు మెగా టాకథాన్ రూపంలో ప్రసారం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్న పెద్దలు, సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు ఇందులో పాల్గొంటున్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ సమాజానికి స్ఫూర్తి కలిగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమస్త సమాచారం, స్టోరీలు, వీడియోలు https://www.pudamisakshiga.com/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# బీసీ కుల గణనకు జై

- ఏపీలో నిర్వహించేందుకు సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం
- సీఎం వైఎస్ జగన్ నిర్ణయంపై బీసీ సంఘాల హర్షం



సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలన్న బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జైకొట్టింది. వెనుకబడిన వర్గాల ఆశల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. వీరి న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా సీఎం వారికి నైతిక మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ తాజా నిర్ణయంపట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్త జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసింది. పైగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలో కుల గణనకు సన్నద్ధమైంది. దీనిపై అధ్యయనానికి రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం వెల్లడించారు. త్వరలో మంత్రి వేణు నేతృత్వంలో కమిటీని కూడా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బీహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం రాష్ట్రంలో బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

### కుల జనగణనతో ఎంతో మేలు..

నిజానికి.. దేశ జనాభాలో 52శాతం కంటే అధికంగా ఉన్న ఓబీసీల లెక్కలు తేలాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. ప్రస్తుతం కొన్ని బీజేపీ మిత్రపక్షాలతో సహా అనేక రాజకీయ పార్టీలు ఓబీసీ జనాభా గణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రధాని మోదీని సైతం ప్రధాన ప్రతిపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీల నేతలు కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విధానం ప్రకారం కులాల వారీగా జనాభా గణనను చేపట్టలేమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల పలుమార్లు ప్రకటించింది. కులాల వారీ లెక్కలు తేలితే జనాభా ప్రాతిపదికన (దామాషా ప్రకారం) వారికి నిధులు, విద్య, ఉద్యోగం, పదవులు రిజర్వేషన్ ప్రకారం దక్కుతాయని, తద్వారా ఆయా కులాలకు ఎంతో మేలు జరుగుతుందని బీసీ సంఘాలు చెబుతున్నాయి. నామినేటెడ్ పదవులు, బడ్జెట్ కేటాయింపులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సైతం జనాభా వారీగా అందించి సామాజిక న్యాయం చేయవచ్చన్నది వాటి వాదన.

### 20 ఏళ్లుగా ఉద్యమాలు.. సీఎంకు కృతజ్ఞతలు



కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనాభా లెక్కలు–2022లో కులం కాలమ్ ఏర్పాటుచేసి బీసీ జనాభా లెక్కలు తేల్చాలని ఇటీవల జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాం. కోవిడ్‌తో ఇప్పటికే ఆలస్యమైన జనాభా లెక్కల సేకరణ ఈ ఏడాది చేపట్టేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. దీంతో 'హలో బీసీ.. చలో ఢిల్లీ' అంటూ అనేక సంఘాలతో కలిసి ఢిల్లీలో ధర్నాలు చేశాం. 20 ఏళ్లుగా చేస్తున్న ఈ డిమాండ్‌ను ఏ జాతీయ పార్టీ పట్టించుకోలేదు. కానీ, ఏపీలో చేపట్టేందుకు నిర్ణయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు

### ఇది చరిత్రాత్మకం అవుతుంది



కులాల వారీ జనాభా గణన చరిత్రాత్మకం అవుతుంది. అది ఓబీసీల్లోని పేదలకు వరంగా మారుతుంది. ఓబీసీ జనాభాను లెక్కించడంవల్ల ప్రభుత్వ పథకాలను ఇంకా సమర్థంగా అమలు చేయవచ్చు. మన దేశంలో కేంద్ర ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో బీసీ బాధలను అర్థం చేసుకుని రాష్ట్రంలో కుల గణనకు సీఎం వైఎస్ జగన్ ముందుకురావడం అభినందనీయం. దీని ద్వారా తాను బీసీల పక్షపాతినని ఆయన మరోసారి నిరూపించుకున్నారు.

– కేశన శంకరరావు, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం

# అధ్యయనం కోసం కమిటీ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- విజయవాడలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

సాక్షి, అమరావతి: బీసీల కుల గణనపై కార్యాచరణకు కమిటీని నియమించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించినట్లు బీసీ సంక్షేమ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. 139 బీసీ కులాలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ఏపీలో బీసీల గణన చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. దేశ సామాజిక విప్లవోద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణు మాట్లాడుతూ బీసీ సంఘాల అభ్యర్థన మేరకు బీసీల కుల గణన కార్యాచరణ బాధ్యతను సీఎం జగన్ తనకు అప్పగించారని తెలిపారు. దీనిపై కమిటీని నియమించి ఇతర రాష్ట్రాల్లో కూడా అధ్యయం చేస్తామన్నారు. చదువు అనే ఆయుధంతో సమాజంలో గుర్తింపు, గౌరవం సాధించడంలో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే ఆదర్శంగా నిలవగా సీఎం జగన్ వారి ఆశయాలను ఆచరిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బీసీలకు తీవ్ర ద్రోహం చేసిన చంద్రబాబు వారికి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

### సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

దేశంలో పూలే ఆశయాలను సంపూర్ణంగా అమలు చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్ అని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 మంది మంత్రులుంటే 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారేనని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో సామాజిక న్యాయం చేయలేదన్నారు. సామాజిక న్యాయంపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్ విసిరారు. విద్య అనే ఆయుధాన్ని కలిగి ఉంటే సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చని, ఈ దిశగా విద్యా రంగంలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారని ఎంపీ మార్గాని భరత్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, పోతుల సునీత, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, అగ్రికల్చరల్ మార్కెటింగ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎన్టీయార్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ సిటీ పార్టీ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎంపీ మార్గాని భరత్ తదితరులు

# అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే!

## ఆర్బీఐ వారించినా రామోజీ బుద్ధి వంకరే


సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడటంలో తనకు సాటిలేదని చెరుకూరి రామోజీరావు మళ్లీ మళ్లీ నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించడమే కాకుండా తన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకునేందుకు బరితెగించడం ఆయనకే చెల్లింది. తటస్థుల ముసుగులో టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడిస్తూ మరో నాటకానికి తెర తీశారు. డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని ఆర్బీఐ కొరడా ఝుళిపించడం, అడ్డంగా దొరికిపోవడంతో కేసు విచారణ ఇంకా కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో నాడు 'మార్గదర్శి ఫైనాన్సియర్స్'ను రామోజీ మూసివేశారు. ఇక ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట రశీదుల రూపంలో అక్రమ డిపాజిట్ల సేకరణకు బరితెగించారు. చందాదారుల సొమ్ముతో అక్రమ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాలతో ఈ అక్రమాల బాగోతం మరోసారి బట్టబయలైంది. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట సాగించిన దందా విషయంలో ఆనాడు ఆర్బీఐ ఏం చెప్పిందో గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

### మార్గదర్శివి అక్రమ డిపాజిట్లే...

'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరిట చెరుకూరి రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరించారని ఆర్బీఐ తేల్చింది. ఈమేరకు 2006 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖకు లిఖితపూర్వకంగా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ ద్వారా వెల్లడించింది. డిపాజిట్ల సేకరణను సమర్థించుకుంటూ రామోజీరావు చేసిన వాదన పూర్తిగా అహేతుకం, చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆదాయపన్ను చట్టం ప్రకారం తమ వ్యాపార సంస్థలన్నీ హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కిందకు వస్తాయి కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చని, ఆర్బీఐ చట్టంలోని '45 ఎస్' నిబంధన తమకు వర్తించదని రామోజీ అడ్డగోలుగా వాదించారు. దీన్ని ఆర్బీఐ పూర్తిగా తిరస్కరించింది. 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరిట వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది.

### కొత్తగా సేకరించొద్దు.. రెన్యూవల్ చేయొద్దు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు రూ.2,204.42 కోట్లు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారని ఆర్బీఐ వెల్లడించింది. 2.50 లక్షల మంది డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ తక్షణం డిపాజిట్ల సేకరణను నిలిపివేయాలని ఆదేశించింది. కొత్తగా డిపాజిట్లు సేకరించడం, కాలపరిమితి ముగిసిన పాత డిపాజిట్లు రెన్యూవల్ చేసేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రామోజీరావు డిపాజిట్ల సేకరణను నిలిపివేశారు. అప్పటికే సేకరించిన రూ.2,204.42 కోట్లను డిపాజిట్‌దారులకు వెనక్కి ఇచ్చేస్తామని ఆర్బీఐకి లిఖితపూర్వకంగా తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో తమ మార్గదర్శి ఫైనాన్సియర్స్ సంస్థను మూసివేశారు. నాడు దివంగత వైఎస్సార్ సకాలంలో స్పందించి 2.50 లక్షల మంది డిపాజిట్‌దారుల హక్కులను పరిరక్షించారు.



RESERVE BANK OF INDIA

To Govt. Of Andhra Pradesh, 29.12.2006

Chief General Manager in Charge
D.O.DNBS CO/01.02.007/2006-07 November 30, 2006

Dear Shri Amitabh Verma

Representation of Sri Vundavalli Arun Kumar, M.P. received through Dr. Y.S. Rajasekhara Reddy, Chief Minister, Andhra Pradesh regarding alleged irregularities being committed by Margadarsi Financiers, Hyderabad based HUF.

Please refer to Government's letter F.No 5/94/2006-BO.II dated November 10, 2006 on the captioned subject A Status paper indicating the background in respect of Margadarsi Financiers is given in Annex.

2. In view of the letter under reference received from the Ministry, the Bank had called the representative of the unincorporated body (UIB) of discussion on November 13, 2006 and they were asked to a) Substantiate their stance that they are not covered under Section 45S of the RBI Act, 1934 and b) detail their plans for protection of the interest of the depositors. Pending submission of the replies, the UIB was advised neither to accept any fresh deposit nor renew the maturing deposits forthwith.

మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల సేకరణ అక్రమం అని చెబుతూ ఆర్ బీ ఐ కేంద్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖ... డిపాజిట్ల సేకరణ నిలిపివేయాలి, డిపాజిట్‌దారులకు డిపాజిట్ మొత్తానికి తిరిగి చెల్లించాలని ఆదేశించినట్టు పేర్కొన్న ఆర్ బీ ఐ

### 2006లో ఆర్బీఐ ఏం చెప్పిందంటే..?

- 'మార్గదర్శి ఫైనాన్సియర్స్'వి కచ్చితంగా అక్రమ డిపాజిట్లే
- నిబంధనలకు విరుద్ధంగా రూ.2,205 కోట్ల డిపాజిట్ల సేకరణ
- డిపాజిట్‌దారులకు తక్షణం డిపాజిట్ మొత్తాన్ని మొత్తం చెల్లించాలి
- కొత్తగా డిపాజిట్ల స్వీకరణ, పాతవి రెన్యూవల్ చేయకూడదు
- ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే

### మళ్లీ అక్రమ డిపాజిట్ల సేకరణ

ఆర్బీఐ ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్సియర్స్ దుకాణాన్ని మూసివేసిన రామోజీ ఈసారి మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమ డిపాజిట్లకు తెరతీశారు. చందాదారులు పాడిన చిట్టీ మొత్తాన్ని వారికి పూర్తిగా చెల్లించకుండా రశీదుల రూపంలో డిపాజిట్లుగా వసూలు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు వసూలు చేయడం చిట్‌ఫండ్ చట్టం–1982కు విరుద్ధం. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల నుంచి అక్రమ డిపాజిట్లను సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి తమ అనుబంధ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)–చెన్నై, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)–బెంగళూరులలో అక్రమ పెట్టుబడులు పెట్టారు. ముంబైలోని మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు, షేర్ మార్కెట్లో కూడా అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. తన చేతి సొమ్ము రూపాయి పెట్టకుండా చందాదారుల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి భారీగా ఆస్తులు కూడగట్టారని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైంది.



A LETTER FROM
RBI (Centeral Office) MUMBAI
to A.P Government

Copy of of letter No. DNBS.CO. 4230/01.02.06-2007 dated 29th December, 2006 of from Sri P. Krishnamurthy, Chief General Manager-in-Charge, Reserve Bank of India, Central Office, Mumbai addressed to Sri Paul Bhayan, IAS, Special Chief Secretary to Government, Home Department, Government of Andhra Pradesh, A-Block, 3rd Floor, Secretariat, Hyderabad.

Dear Sir,

Please refer to your letter No. 37008/General.B/A2/2006-1 dated December 19, 2006 requesting certain information / documents etc. on Margadarsi Financiers, Hyderabad.

2. As you may be aware, the Reserve Bank of India draws its powers for regulation and supervision over the non-banking financial companies (NBFCs) from the provisions of Chapter III B of the Reserve Bank of India Act, 1934/ These powers include registration of NBFCs, inspecting their business, calling for information, calling for returns/statements on deposits and issuing directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions or exercise other regulatory and supervisory powers as regards unincorporated bodies (UIBs) such as Margadarsi Finan- which is stated to belong to a Hindu Undivided Family (I 31 Since HUFs are not falling within the definition of a NBFC non-banking Institution under Chapet III B of the RBI Act, 1934.

రాష్ట్రంలో డిపాజిట్ దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ ద్వారా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలి అని స్పష్టం చేస్తూ ఆర్ బీ ఐ రాసిన లేఖ

### చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనన్న ఆర్బీఐ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్బీఐ 2006లోనే స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ పెట్టుబడుల అంశంపై నాడు ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తేవడంతో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అక్రమ డిపాజిట్లు వసూలు చేసే ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం ఆర్బీఐకి ప్రత్యేకంగా లేదని పేర్కొంది. ఆ తరహా ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సీఐడీ విభాగం ప్రత్యేకంగా ఉందని ఆర్బీఐ ప్రస్తావించడం గమనార్హం. ఆమేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 1999 రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు ఆర్బీఐ ఆదేశాలతోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చర్యలు చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై అదే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటోంది. సోదాలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

## టీడీపీ ప్రధాన కార్యాలయానికి సీఐడీ నోటీసులు

- 'చైతన్యరథం' పత్రిక పేరిట దుష్ప్రచారం
- మంత్రి బుగ్గన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి సీఐడీ అధికారులు మంగళవారం నోటీసులిచ్చారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వెలువడుతున్న 'చైతన్య రథం' పత్రిక ద్వారా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చేసిన ఫిర్యాదు మేరకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరిట ఈ నోటీసులిచ్చారు. 'చైతన్య రథం' పత్రికలో గత ఏడాది నవంబరు 23వ తేదీ ఎడిషన్‌లో 'అపరిచితుడు', 'బుగ్గనగారి బాగోతం' శీర్షికలతో అవాస్తవ కథనాలు ప్రచురించి తనపై దుష్ప్రచారం చేశారని మంత్రి బుగ్గన... సీఐడీకి ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో తాను సమర్పించిన నామినేషన్ పత్రాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసి అందులో పేర్కొన్న ఆస్తుల వివరాలను ఫోర్జరీ చేశారని బుగ్గన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ విధంగా తన భూముల విస్తీర్ణం, వాటి విలువను అమాంతంగా పెంచేసి దుష్ప్రచారం చేశారన్నారు. సీఐడీ అధికారులు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారించి ఈ నోటీసులిచ్చారు. సెక్షన్ 92 సీఆర్‌పీసీ కింద టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరిట నోటీసులు ఇచ్చారు. 2022, నవంబరు 23 నాటి చైతన్య రథం పత్రిక కాపీ, ఆ పత్రిక ఎడిటర్, ఆ వార్తలు రాసిన విలేకరి వివరాలు తెలపాలని నోటీసులో పేర్కొన్నారు.

## ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగినులకు శుభవార్త

- రెగ్యులర్ వారితో సమానంగా అదనంగా 5 ప్రత్యేక సాధారణ సెలవులు
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ
- సీఎం జగన్‌కు ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి ఐదు ప్రత్యేక సాధారణ సెలవులను కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. రెగ్యులర్ మహిళా ఉద్యోగులకు ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా అదనంగా ఐదు ప్రత్యేక సాధారణ సెలవులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సౌకర్యాన్ని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగినులకు కూడా కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తికి సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపారు. దీంతో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగినులకు కూడా ఐదు ప్రత్యేక సాధారణ సెలవులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ జీవో నంబర్ 39 జారీచేసింది. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు ఐదు ప్రత్యేక సాధారణ సెలవులు మంజూరుచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం తరఫున సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వలంటీర్ల సన్మాన కార్యక్రమం వాయిదా

సాక్షి, అమరావతి : ఈ నెల 14వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగాల్సిన గ్రామ, వార్డు వలంటీర్ల సన్మాన కార్యక్రమం వాయిదా పడింది. వచ్చే నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

| కేంద్రం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రెంటచింతల | 44.2 | 25.6 |
| అనంతపురం | 41.6 | 22.6 |
| కర్నూలు | 41.4 | 24.4 |
| విజయవాడ | 41.0 | 25.0 |
| నంద్యాల | 40.5 | 24.2 |
| శ్రీకాకుళం | 40.0 | 23.0 |
| మార్కాపురం | 40.0 | 23.0 |
| తిరుపతి | 40.0 | 23.0 |
| విశాఖపట్నం | 39.6 | 24.4 |
| ఏలూరు | 39.0 | 26.0 |
| కడప | 38.2 | 20.2 |
| నెల్లూరు | 37.7 | 26.0 |
| విజయనగరం | 37.0 | 27.0 |
| మచిలీపట్నం | 35.0 | 26.0 |
| తెలంగాణలో.. | | |
| ఆదిలాబాద్ | 41.8 | 23.7 |
| రామగుండం | 40.2 | 23.2 |
| హైదరాబాద్ | 37.7 | 22.5 |

**క్లుప్తంగా...**

## సచివాలయల శాఖ డైరెక్టర్‌గా భావన వశిష్ట్

**సాక్షి, అమరావతి:** గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అడిషనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న భావన వశిష్ట్ ఆ శాఖ డైరెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతల్లో నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఇప్పటి వరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన షన్ మోహన్ ఇటీవలే బదిలీపై చిత్తూరు జిల్లాకు కలెక్టర్ గా వెళ్లారు. 2019 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి భావన వశిష్ట్ గతంలో కృష్ణా జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ గానూ, విజయనగరం జిల్లా పార్వతీపురం డివిజన్ సబ్ కలెక్టర్‌గా పని చేశారు.

## నేడు, రేపు 'డీఎస్సీ-98' అభ్యర్థులకు కౌన్సెలింగ్

**తుది జాబితాలు సిద్ధం చేసిన విద్యాశాఖ**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో 'డీఎస్సీ-98' పరీక్షల్లో అర్హత సాధించినా ఉద్యోగాలు పొందని వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మినిమమ్ టైమ్ స్కేలుపై ఎస్జీటీలుగా నియామక ఉత్తర్వులు అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అభ్యర్థుల గుర్తింపు, ఆసక్తి వ్యక్తీకరణ పత్రాల స్వీకరణ, సర్టిఫికెట్ల పరిశీలనను దశలవారీగా అధికారులు పూర్తిచేశారు. అభ్యర్థుల తుది జాబితాలను సిద్ధం చేసి ఆయా జిల్లా విద్యాధికారి కార్యాలయ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. తుది జాబితాల్లో ఉన్న అభ్యర్థులకు బుధ, గురువారాల్లో డీఈవో కార్యాలయాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అన్ని పరిశీలనల అనంతరం వీరికి మినిమమ్ టైమ్ స్కేలుపై ఎస్జీటీలుగా నియామక ఉత్తర్వులు అందిస్తారు. అయితే, అభ్యర్థులు జ్యుడిషియరీ అగ్రిమెంట్ బాండ్‌ను సమర్పించిన తర్వాతే నియామక ఉత్తర్వులు అందజేస్తారు. అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ ఫారం, ఆప్షన్ ఫారం కూడా అధికారులు తీసుకుంటారు. కాగా టీచర్ల నియామకంలో రూల్‌ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కల్లగుంట మోహన్ రావు ఓ ప్రకటనలో కోరారు.

## రాష్ట్రపతితో బీసీ నేతల భేటీ

**బీసీలకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ కృష్ణయ్య వినతి**



రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన బీసీ నేతలు

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో 56 శాతం జనాభా గల బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానవాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి హోదాలో జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి జనాభా ప్రకారం అన్ని రంగాల్లో వాటా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ 75 ఏళ్లుగా వాటా ఇవ్వట్లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల జనాభాను కులాల వారీగా సేకరిస్తున్నప్పటికీ, బీసీల జనాభా సేకరించడానికి అభ్యంతరాలు ఏమిటో చెప్పాలని కేంద్రాన్ని కోరాలని రాష్ట్రపతిని కోరారు. జాతీయ బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ, భూపేష్‌సాగర్, రాము, నీల వెంకటేష్, జర్రిపోతుల పరశురాం పాల్గొన్నారు.

## ఈర్ష్యతోనే ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు

**ఏపీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**



**సాక్షి, న్యూఢిల్లీ:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఈర్ష్య, ద్వేషంతోనే చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. చిట్‌ఫండ్ పేరుతో డిపాజిట్లు సేకరించబోమని చెప్పి తిరిగి రూ.కోట్లలో డిపాజిట్లు సేకరిస్తున్న రామోజీరావును ఇంద్రుడు, చంద్రుడు, రాష్ట్రానికి ఏదో చేసేసినట్టుగా వారు మాట్లాడుతున్నారని విమర్శించారు. అక్రమ చర్యలకు పాల్పడినందుకే రామోజీరావును ఏ1గా, శైలజను ఏ2గా చేశారని తెలిపారు. ఆయన మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. రామోజీరావును ఏదేదో చేసేసినట్టుగా చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలు వారిని మరింతగా ఛీదరించుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. 175కు 175 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును ఏపీ ప్రభుత్వం చేజిక్కించుకోవడం లేదా ప్రైవేటీకరణ ఆపడానికి పోరాటం చేస్తామని చెప్పారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ శూన్యమని, సీఎంను చేసిన కాంగ్రెస్ కాలగర్భంలో కలిసిపోయిందని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తమ శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, రైతులకు కల్పిస్తున్న ప్రయోజనాలను వివరించారు. చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైస్ మిల్లుల వద్ద ఉన్న బియ్యాన్ని త్వరగా లిఫ్ట్ చేయాలని రైల్వే అధికారులను కోరగా వెంటనే చర్యలు తీసుకున్నారని తెలిపారు. అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలపై రైల్వేమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు.

---

- బ్యాంకుల్లో పదేళ్లకు పైగా లావాదేవీల్లేని డిపాజిట్లివి
- దేశంలో 10.24 కోట్ల ఖాతాలకు చెందిన ఈ మొత్తం ఆర్‌బీఐకి బదిలీ
- మృతి చెందిన వారి డిపాజిట్లు వారి కుటుంబాలకు అందేలా సాయం
- దరఖాస్తు చేయడంలో క్లెయిమ్‌దారులకు సహకారం

| ఏడాదికి మించి లావాదేవీల్లేని ఖాతాలను బ్యాంకులు సమీక్షించాలి | కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి |
|---|---|

క్లెయిమ్ చేయని డిపాజిట్ల వారసులను కనుగొనేందుకు ప్రత్యేక డ్రైవ్




**రూ.35 వేల కోట్ల డిపాజిట్లు..**

# వారసులకు అందేదెలా?

కోటీ, రెండు కోట్లు కాదు.. ఏకంగా రూ.35 వేల కోట్లు. బ్యాంకుల్లో పదేళ్లుగా ఎటువంటి లావాదేవీలు జరగని, క్లెయిమ్ చేయని డిపాజిట్ల మొత్తమిది. డిపాజిట్‌దారులు మరణించిన తర్వాత వారి కుటుంబ సభ్యుల(వారసులు)కు కూడా తెలియని డిపాజిట్లు కొన్నయితే, వారసులు ఎవరో తేలక బ్యాంకులోనే ఉండిపోయినవి కొన్ని.



**సాక్షి, అమరావతి:** దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం ఎవరూ క్లెయిమ్ చేయని ఈ డిపాజిట్ల మొత్తం రూ. 35,012 కోట్లుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 10,24,00,599 ఖాతాలకు చెందిన ఈ మొత్తాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు నిబంధనల మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి బదిలీ చేసినట్లు పేర్కొంది. ఈ సొమ్ము మృతుల వారసులకు చెందాల్సి ఉందని తెలిపింది. ఈ క్లెయిమ్‌లను పరిష్కరించడంలో కుటుంబ సభ్యులకు సహకరించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని తెలిపింది. మృతుల ఖాతాలకు సంబంధించి చట్టపరమైన ప్రాతినిధ్యం లేకుండా క్లెయిమ్‌లు పరిష్కరించరు. ఇందు కోసం నిర్దిష్టమైన దరఖాస్తు, నిబంధనలు ఉంటాయి. వీటిని మృతుల కుటుంబ సభ్యులు సులభంగా అర్థం చేసుకునేలా రూపొందించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. క్లెయిమ్ దరఖాస్తులు సరైన వివరాలు లేకుండా, అసంపూర్తిగా ఉంటే వాటిని బ్యాంకులు తిరస్కరిస్తాయని, అయితే వాటిని తిరస్కరించడానికి కారణాలను క్లెయిమ్‌దారులకు బ్యాంకులు తెలియజేయాలని, సక్రమంగా నమోదు చేయడానికి సహకరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ ఖాతాల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆదేశించినట్లు చెప్పింది. ఎవరూ క్లెయిమ్ చేయకపోతే, చట్టబద్ధమైన వారసులను కనుగొనేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కూడా ఆదేశించినట్లు తెలిపింది. ఒక సంవత్సరానికంటే ఎక్కువ కాలం కార్యకలాపాలు లేని ఖాతాలను ప్రతి ఏడాదీ సమీక్షించాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించిందని తెలిపింది. ఆ ఖాతాదారులను సంప్రదించి కారణాలను తెలుసుకోవడంతో పాటు ఎటువంటి లావాదేవీలు జరగలేదని లిఖిత పూర్వకంగా నిర్ధారించుకోవాలని సూచించినట్లు చెప్పింది.

**ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి ఆర్‌బీఐకి బదిలీ చేసిన డిపాజిట్లు..**

| బ్యాంకు పేరు | క్లెయిమ్ చేయని మొత్తం (రూ. కోట్లలో) | ఖాతాల సంఖ్య |
|---|---|---|
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 3,904 | 89,30,915 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 2,557 | 92,56,380 |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 838 | 18,63,192 |
| కెనరా బ్యాంక్ | 4,558 | 1,56,22,262 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 1,240 | 30,84,349 |
| ఇండియన్ బ్యాంక్ | 2,445 | 85,21,423 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ | 1,790 | 46,17,573 |
| పంజాబ్ సింధ్ బ్యాంక్ | 494 | 12,56,602 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 5,340 | 1,50,48,156 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 8,086 | 2,17,80,757 |
| యూకో బ్యాంక్ | 583 | 14,78,743 |
| యూనియన్ బ్యాంక్ | 3,177 | 1,09,40,247 |
| మొత్తం | 35,012 | 10,24,00,599 |

## ఈఏపీసెట్, నీట్ విద్యార్థులకు మాక్ టెస్ట్‌లు

- మే 2, 3, 4 తేదీల్లో పరీక్షలు
- రిజిస్ట్రేషన్ ఫీజు రూ.350
- రిజిస్ట్రేషన్‌లకు గడువు ఈ నెల 25

**సాక్షి, అమరావతి/సాక్షి ఎడ్యుకేషన్ :** వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నీట్, ఈఏపీసెట్ మాక్ టెస్ట్‌లను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు టెక్నాలజీ పార్ట్నర్‌గా మై ర్యాంక్ వ్యవహరించనుంది. దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నీట్, తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈఏపీసెట్ పరీక్షలను నిర్వహిస్తారు. అయితే ఈ పరీక్షలకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ సన్నద్ధత స్థాయిని అంచనా వేసుకుని మరింత మెరుగవ్వడానికి అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://www. arenaone. in/ mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.350 చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్‌లకు ఈ నెల 25వ తేదీ చివరి గడువు. రిజిస్టర్ చేసుకున్న ఈ మెయిల్‌కు పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ నంబర్ వస్తుంది. ఒక్కో స్ట్రీమ్‌కు(ఇంజినీరింగ్, అగ్రికల్చర్, నీట్) మూడు టెస్ట్‌లుంటాయి. ఈ పరీక్షలను మే 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్(యూజర్ నేమ్), ఫోన్ నంబర్(పాస్‌వర్డ్)తో మూడు రోజుల్లో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్‌ను తెలుసుకోవచ్చు. http:// sakshimocktest. myrank. co. in వెబ్‌సైట్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. టెస్ట్‌కు సంబంధించిన కీని మే 5వ తేదీన ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు 9666697219, 9912671555, 7075709205 నంబర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

## ఏపీ ఈఏపీసెట్‌కు 2,80,779 దరఖాస్తులు

- 15 వరకు తుది గడువు
- మే 15 నుంచి 18 వరకు ఇంజనీరింగ్ ప్రవేశపరీక్ష
- మే 22, 23 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి..
- ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగ జనార్దన



**అనంతపురం:** ఏపీ ఈఏపీసెట్-2023కు ఇప్పటి దాకా 2,80,779 దరఖాస్తులు వచ్చాయని సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన తెలిపారు. ఇందులో 1,99,588 మంది ఇంజనీరింగ్‌కు, 80,462 మంది అగ్రికల్చర్- ఫార్మసీ విభాగానికి, రెండు విభాగాలకు కలిపి 729 మంది దరఖాస్తు చేశారని వెల్లడించారు. ఇంజనీరింగ్‌కు 84,064 మంది అమ్మాయిలు, 1,15,524 మంది అబ్బాయిలు దరఖాస్తు చేశారన్నారు. ఇక అగ్రికల్చర్- ఫార్మసీకి 57,561 మంది అమ్మాయిలు, 22,901 మంది అబ్బాయిలు దరఖాస్తు చేశారని వివరించారు. జేఎన్‌టీయూ అనంతపురంలో మంగళవారం రంగ జనార్దన సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందుతో కలసి మాట్లాడారు. మే 15 నుంచి 18 వరకు ఇంజనీరింగ్, 22, 23 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ప్రవేశపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏపీ ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 వరకు గడువు ఉందని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో మే 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 4 నుంచి 6 వరకు విద్యార్థుల డేటాలో మార్పులుచేర్పులకు అవకాశం కల్పిస్తామని వివరించారు.

**ఈఏపీసెట్ ద్వారానే బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లు**

ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీ ఈఏపీసెట్ ఆధారంగానే బీఎస్సీ (నర్సింగ్)లో ప్రవేశాలు ఉంటాయని రంగజనార్దన తెలిపారు. ఈ ఏడాది ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇచ్చి ర్యాంకులు ప్రకటిస్తామన్నారు. కాగా సెట్‌కు ఇంటర్ సెకండియర్‌లో 100 శాతం, ఫస్టియర్‌లో 70శాతం సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకం

- ఈ అంశంపై తొలుత స్పందించింది సీఎం జగనే : సజ్జల
- లాభాల బాటలో నడిపేలా ప్రత్యామ్నాయాలు సూచించారు
- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చించారు



**సాక్షి, అమరావతి:** విశాఖ ఉక్కు పరిశ్రమలో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించి ప్రైవేటీకరించడాన్ని వైఎస్సార్‌సీపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పునరుద్ఘాటించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలపై అందరి కంటే ముందు సీఎం వైఎస్ జగన్ స్పందించారని గుర్తుచేశారు. 'విశాఖ ఉక్కు పరిశ్రమకు క్యాప్టివ్ మైన్స్‌ను కేటాయిస్తే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. రుణాలను పునర్‌వ్యవస్థీకరించి ఈక్విటీ కింద మార్చితే వడ్డీ భారం తగ్గుతుంది. వినియోగించుకోని భూములను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తే ఆర్థికంగా బలోపేతమై విశాఖ ఉక్కును లాభాల బాటలో నడిపించవచ్చని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులకు ఆదిలోనే సీఎం జగన్ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు' అని సజ్జల తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సీఎం జగన్ సూచిస్తూనే ఉన్నారని వివరించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మంగళవారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పాలనకు లభిస్తున్న ప్రజాస్పందన చూసి ఓర్వలేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అక్కసుతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడి సరుకులను సరఫరా చేసి ప్రతిగా ఉత్పత్తులు తీసుకోవడం.. పెట్టుబడి వ్యయంలో భాగాన్ని సమకూర్చి ప్రతిగా ఉత్పత్తులను తీసుకోవడం కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్‌ను రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ జారీ చేస్తే అందులో నిబంధనలు ఏమున్నాయో కనీసం తెలుసుకోకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్లుగా సీఎం జగన్‌పై బురదజల్లుతూ 'ఈనాడు'లో రామోజీరావు విషం చిమ్మారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒలంపిక్స్‌లో ప్రైవేటీకరణ పోటీలు నిర్వహిస్తే చాంపియన్‌గా నిలిచే చంద్రబాబుకు బాకాలూదే వామపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

**కార్మికుల శ్రేయస్సు కోరుకునే వారైతే..**

విశాఖ ఉక్కుపై ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లలో పాల్గొనడంపై తెలంగాణా ప్రభుత్వం నుంచి స్పందన అధికారికంగా వచ్చినట్లు లేదు. కేటీఆర్ కూడా సీఎం జగన్ చెప్పినట్లుగానే క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలనే సూచించారు. ఇవేవీ పట్టని రామోజీ పత్రిక, ఎల్లో మీడియా చౌకబారు విమర్శలు చేయడం సరైందేనా? కార్మికుల శ్రేయస్సు కోరుకునే వారైతే సీపీఐ, సీపీఎం నాయకులైనా వివరాలు తెలుసుకోరా? ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సంస్కరణల ముసుగులో 22 సంస్థలను మూసివేయడంతోపాటు 11 సంస్థలని విక్రయించారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే.. చంద్రబాబు మూసేయాలని నిర్ణయించిన సంస్థలను నిలబెట్టాలనే ప్రయత్నం చేశారు. చంద్రబాబు ఆర్టీసీని ప్రైవేటీకరించి ఉద్యోగులను నడిరోడ్డుపై నిలబెట్టే కుట్ర చేస్తే.. సీఎం జగన్ మాట మేరకు ప్రభుత్వంలో విలీనం చేశారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే నడిపించాలని ఎవరు అడిగినా మంచిదే.

## నేడు ఎస్సెస్సీ సైన్స్ పరీక్ష

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి బుధవారం కీలకమైన సైన్స్ పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో ఫిజికల్, బయోలాజికల్ సైన్సులకు ఒకే ప్రశ్నపత్రం ఉంటుంది. అయితే సమాధానాలను మాత్రం వేర్వేరుగా 12 పేజీల బుక్‌లెట్లలో రాయాల్సి ఉంటుందని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రెండు సబ్జెక్టులకు సమాధానాలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఫిజికల్ సైన్స్ జవాబు పత్రంలో అంటే పేపర్ కోడ్ -19 (సైన్స్ పి-1) లో ఫిజికల్ సైన్స్ సమాధానాలను మాత్రమే రాయాలి. అలాగే బయోలాజికల్ సైన్స్ జవాబు పత్రంలో పేపర్ కోడ్ 20 (సైన్స్ పి-2)లో బయోలాజికల్ సైన్స్ సమాధానాలను మాత్రమే రాయాల్సి ఉంటుంది. ఇన్విజిలేటర్లు పరీక్ష ప్రారంభానికి ముందు విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని దేవానందరెడ్డి సూచించారు.

## 10వేల గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

**పలు జిల్లాల్లో తుది దశకు..**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో భూముల సమస్యలన్నింటికీ చరమగీతం పాడేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో ముఖ్య ఘట్టమైన డ్రోన్ సర్వే 10,206 గ్రామాల్లో పూర్తయింది. మొత్తం 13,500 గ్రామాల్లో డ్రోన్లు ఎగరాల్సి వుండగా 75 శాతం గ్రామాల్లో ఎగురవేసి భూముల కొలతను పూర్తిచేశారు. నంద్యాల, శ్రీ సత్యసాయి, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కృష్ణా, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఈ సర్వే చివరి దశకు వచ్చింది. నంద్యాల జిల్లాలో 441 గ్రామాలకు గాను 400 గ్రామాల్లో పూర్తయింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 461 గ్రామాలకు 416, విజయనగరం జిల్లాలో 983కి 906, అనకాపల్లి జిల్లాలో 715కి 661, కాకినాడ 417కి 340, తూర్పుగోదావరిలో 272కి 236, కృష్ణాజిల్లాలో 502కి 460 గ్రామాల్లో సర్వే పూర్తిచేశారు. మిగిలిన జిల్లాల్లోనూ 50-60 శాతానికి పైగా సర్వే పూర్తయింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏరియల్ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్లతోపాటు దేశంలో ఎక్కడాలేని విధంగా విమానాలు కూడా వినియోగిస్తోంది. సర్వే ఆఫ్ ఇండియాతోపాటు ప్రైవేటు డ్రోన్ ఏజెన్సీలతోనూ సర్వే చేయిస్తోంది. చివరికి ప్రభుత్వం సైతం సొంతంగా 30 డ్రోన్లు కొనుగోలు చేసి సర్వేయర్లకు పైలట్లుగా శిక్షణ ఇచ్చి మరీ సర్వే చేస్తోంది. దీంతో ఈ సర్వే దాదాపు తుదిదశకు వచ్చింది. ఈ ఏడాది జూన్ నాటికి అన్ని జిల్లాల్లో పూర్తిచేయడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ పని చేస్తోంది. ఏ జిల్లాల్లో డ్రోన్ సర్వే ఇంకా ఎన్ని గ్రామాల్లో చేయాలో దృష్టిపెట్టి సర్వేను పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నారు.

**అల్లూరి జిల్లాలో ఐదుగురికి ప్రత్యేక బాధ్యతలు**

మరోవైపు.. కొండలు, అటవీ ప్రాంతాలతో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ సర్వేకు అవకాశం లేకపోడంతో డీజీపీఎస్ సర్వేను ప్రత్యేక ప్రణాళికతో చేపట్టింది. కొండల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందకపోవడంతో భూమిపై నుంచే సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఈ జిల్లాలో 2,980 గ్రామాలు ఉండడం, అక్కడ డ్రోన్ సర్వేకు అవకాశం లేకపోవడం రెవెన్యూ యంత్రాంగానికి సవాలుగా మారింది. రాష్ట్రమంతా రీ సర్వే ఒక ఎత్తయితే ఈ జిల్లాలో మాత్రం మరోలా ఉంది. ఈ జిల్లాలోని గ్రామాలను ఐదు గ్రూపులుగా విభజించి పాడేరు సబ్‌కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీఓ, రంపచోడవరం సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ, అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్లకు వాటిని అప్పగించారు. వీరితో ప్రత్యేకంగా అక్కడ రీ సర్వే చేయిస్తున్నారు. దీంతో అల్లూరి జిల్లాలో డీజీపీఎస్ సర్వే శరవేగంగా జరుగుతోంది.

## అమ్మకూడదన్నది మా ప్రభుత్వం విధానం

- కొంటాం .. అమ్ముతాం.. అన్నది వారి విధానం
- కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తే తీవ్ర ప్రజాగ్రహం తప్పదు
- ప్రైవేటీకరణపై బీఆర్ఎస్ వైఖరిని స్పష్టంచేయాలి
- 54 పరిశ్రమలను బాబు అమ్మేసినప్పుడు ఈనాడు రామోజీ ఒక్క ముక్క రాశారా?
- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



**సాక్షి, అమరావతి:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుందని, ప్లాంట్‌ను అమ్మకూడదన్నది తమ విధానమని చెప్పారు. కొంటాం.. అమ్ముతాం .. అన్నది వారి విధానాలు అని అన్నా రు. మంత్రి మంగళవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. 'స్టీల్ ప్లాంట్ రాష్ట్ర ప్రజల సెంటిమెంట్. 32 మంది బలిదానంతో వచ్చిన సంస్థను కాపాడుకోవడానికి ఉన్న అన్ని మార్గాలూ చివరి వరకు ఉపయోగించుకుంటాం. ప్రజల సెంటిమెంటును గౌరవించాల్సిన బాధ్యత కేంద్రం పైన ఉంది. అయినా అమ్మేస్తే తీవ్ర ప్రజాగ్రహానికి గురి కాక తప్పదు' అని హెచ్చరించారు. 54 పరిశ్రమలను చంద్రబాబు నిస్సిగ్గుగా అమ్మేసినప్పుడు ఈనాడు రామోజీ ఒక్క ముక్క రాయకుండా ఎందుకు మిన్నకున్నారని నిలదీశారు.

**ప్రైవేటుపరం చేయొద్దని అసెంబ్లీలో తీర్మానం**

'స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు మార్లు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. ప్రైవేటీకరణ వద్దని అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం. విశాఖలో 4 లక్షల మందితో బహిరంగసభ నిర్వహించి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాం. ప్రైవేటీకరణ వద్దని మొన్న తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. మరి ఈరోజు బిడ్‌లో పాల్గొంటున్నారంటే.. ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉన్నట్లే కదా? ప్రైవేటీకరణకు అనుకూలమా? వ్యతిరేకమా? ముందుగా వారి వైఖరి చెప్పాలి.

**అలా పాల్గొనే వీలు లేదు**

51 శాతం, అంతకంటే ఎక్కువ వాటా కలిగి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు లేదా సంయుక్త భాగస్వామ్య సంస్థ మరే ఇతర ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూల) ప్రైవేటీకరణ బిడ్లలో పాల్గొనరాదని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జారీచేసిన నియమావళిలో పేర్కొంది. అందుకే తెలంగాణకు స్టీల్ ప్లాంట్ బిడ్‌లో పాల్గొనడం సాధ్యం కాదు. మేము ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం. అలాంటప్పుడు కొనడమనే మాటే ఉత్పన్నం కాదు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, చంద్రబాబు, ఎల్లో మీడియా అదే పనిగా బురద చల్లుతున్నారు.' అని అన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌పై కేసీఆర్‌ది కపట ప్రేమ

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్**

**ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు):** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్టీల్‌ప్లాంట్‌పై కపటప్రేమ ఒలకబోస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రాధాన్యం కోసమే ప్లాంట్‌ను పరిరక్షిస్తామంటూ గొప్పలు చెబుతున్నారని అన్నారు. మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామంటున్న బీఆర్ఎస్ నాయకుల ప్రకటనలను తప్పుబట్టారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో మూతబడ్డ పరిశ్రమలను, ప్రభుత్వ సంస్థలను ముందు తెరిపించాలన్నారు. కేసీఆర్ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఏపీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని చెప్పారు. కుటుంబ పాలనతో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల హక్కులను కాలరాస్తోందని, ఆ దుష్టపాలనకు బీజేపీ చరమగీతం పాడుతుందన్నారు.రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర ప్రజలపై విషం కక్కిన కేసీఆర్ ఇప్పుడు ఏపీని ఉద్ధరిస్తామంటూ ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటన్నారు. 2013 సకల జనుల సమ్మెలో కేసీఆర్ ఆంధ్ర ప్రజలపై నోరుపారేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పోలవరంతో పాటు ఏపీకి చెందిన పలు నీటి పారుదల ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడమేంటని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లో నడిపించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందన్నారు. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో సింగరేణి అధికారుల భేటీ

**ఈవోఐ విధివిధానాలపై చర్చ!**



సింగరేణి అధికారులతో పోరాట కమిటీ నేతలు

**ఉక్కునగరం:** తెలంగాణకు చెందిన సింగరేణి అధికారుల బృందం మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముడి సరుకులు, నగదు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈవోఐకు ఈ నెల 15న గడువుగా నిర్ణయించారు. ఈవోఐలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తున్నదన్న వార్తల నేపథ్యంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, బలరాంతోపాటు మరో ఇద్దరు జీఎంలు ఉక్కు పరిపాలన భవనంకు వచ్చారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాలరావు, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏకే బాగ్చి, మార్కెటింగ్ అధికారులతో సమావేశమై ఈవోఐ విధి విధానాల గురించి చర్చించినట్లు సమాచారం. చర్చల వివరాలు అధికారికంగా వెల్లడి కాలేదు. ఈ బృందాన్ని ఉక్కుపోరాట కమిటీ నేతలు ఆదినారాయణ, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, మస్తానప్ప, సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు కలిశారు.

## ఏపీ విభజన కేసు వాయిదా

**మంగళవారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన కేసు విచారణను సుప్రీంకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, తెలంగాణ వికాస కేంద్ర తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్న ధర్మాసనం ముందుకొచ్చింది. మధ్యాహ్న భోజన విరామ సమయానికి ముందు ఏపీ తరఫు అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ మెహఫూజ్ నజ్కీ ఈ పిటిషన్లు విచారించాలని న్యాయమూర్తుల్ని కోరారు. ఇటీవలే రాజధాని కేసు విచారణ వాయిదా అంశాన్ని గుర్తుచేసిన జస్టిస్ కె.ఎం.జోసెఫ్.. ఈ పిటిషన్లు కూడా అవేనా అని ఆరా తీశారు. రెండు అంశాలకు సంబంధం లేదని వేర్వేరు పిటిషన్లుగా ఇప్పటికే వేరుచేసి జాబితా చేశారని నజ్కీ వివరించారు. భోజన విరామ అనంతరం విచారిస్తామని న్యాయమూర్తులు తెలిపారు. సాయంత్రం కోర్టు సమయం ముగుస్తున్నా పిటిషన్లు బెంచ్ మీదకు రాకపోవడంతో ఉండవల్లి అరుణ్‌కుమార్ మరోసారి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ పిటిషన్లు మంగళవారం విచారిస్తామని, ఆ మేరకు విచారణ జాబితా చేర్చాలని జస్టిస్ కె.ఎం.జోసెఫ్ రిజిస్ట్రీని ఆదేశించారు.





సాక్షి

బుధవారం, ఏప్రిల్, 12

# పులుల ప్రోగ్రెస్ రిపోర్ట్!

జీవవైవిధ్యాన్ని పరిరక్షించటంలో, పర్యావరణాన్ని కాపాడటంలో, ప్రకృతి సమతుల్యత కొనసాగటంలో పులుల ప్రాధాన్యం తెలిసినవారికి దేశంలో పులుల సంఖ్య పెరిగిందన్న వార్త ఉపశమనం ఇస్తుంది. ప్రధాని ఆదివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,167 పులులున్నాయి. అయిదేళ్లక్రితం 2,226గా ఉన్న సంఖ్య ఇంతగా పెరిగిందంటే పులుల సంరక్షణకు తీసుకుంటున్న పటిష్ఠ చర్యలే కారణమనడంలో సందేహం లేదు. ఒక్క పులులన్న మాటేమిటి... వన్యమృగాల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల వల్ల సింహాలు, చిరుతపులుల సంఖ్య కూడా గణనీయంగా హెచ్చింది. ఆసియా జాతి సింహాల సంఖ్య 523 నుంచి 674కు, చిరుతల పులుల సంఖ్య దాదాపు 8,000 నుంచి 12,852కు పెరిగాయి. పులుల సంఖ్య పెంచటంతోపాటు దేశంలో కనుమరుగైన చీతాలను నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి తెప్పించి ఇక్కడి అడవుల్లో వదిలిపెట్టారు. ప్రపంచంలో ఉన్న పులుల్లో 70 శాతం మన దేశంలోనే ఉన్నాయంటే అది ప్రాజెక్టు టైగర్ పథకం చలవే. సరిగ్గా యాభైయేళ్ల క్రితం భారత్‌లో పులుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్న సంకల్పంతో డాక్టర్ కరణ్‌సింగ్ నేతృత్వంలో పద్మజానాయుడు, కైలాస్ సంకాల వంటివారితో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. తర్వాతే ప్రాజెక్ట్ టైగర్ కింద పులుల తొలి సంరక్షణ కేంద్రం జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ మొదలైంది. పులుల సంరక్షణ కేంద్రాల సంఖ్య ప్రస్తుతం 55కు చేరుకుంది. ప్రాజెక్టు టైగర్ ప్రారంభించేనాటికి పులులు, సింహాల వేట సంపన్నవర్గాలకు వినోదంగా ఉండేది. వారిని అడవుల జోలికి రాకుండా చేయటానికి కఠిన చర్యలు తీసుకోవటం ప్రారంభించాక క్రమేపీ ఆ ధోరణి తగ్గింది.

అభివృద్ధి పేరిట ప్రకృతి వనరులను అతిగా వినియోగించుకోవటం వల్ల వన్యప్రాణుల్లోని ఎన్నో జాతులకు ప్రాణం మీదికొస్తోంది. ప్రపంచ వన్యప్రాణుల సమాఖ్య లెక్క ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు 27 రకాల జాతులు అంతరిస్తున్నాయి. పులుల సంఖ్య పెరిగిందని తాజా గణాంకాలు చెబుతున్నా దేశంలో ఇంకా శ్రద్ధ పెట్టాల్సిన ప్రాంతాలు చాలానే ఉన్నాయి. ప్రపంచంలోనే జీవవైవిధ్యతకు పెట్టింది పేరైన పడమటి కనుమల ప్రాంతంలో పులుల సంఖ్య తగ్గిందని గణాంకాలు సూచిస్తున్నాయి. 1,600 కిలోమీటర్ల పొడవునా 1,40,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం పరిధిలో పడమటి కనుమలు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో పులుల సంరక్షణ కేంద్రాలు 12 ఉండగా, ఇతరేతర వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు 68 వరకూ ఉన్నాయి. అయితే అయిదేళ్లక్రితం ఈ ప్రాంతంలో 981గా ఉన్న పులుల సంఖ్య ఇప్పుడు 824 మాత్రమే. పడమటి కనుమలను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించి చాన్నాళ్లయింది. అక్కడి మూడోవంతు ప్రాంతం జీవావరణపరంగా సున్నితమైనదని 2010లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రకటించింది కూడా. కానీ తదుపరి చర్యలు అందుకు తగ్గట్టుగా లేవు. ఇలా ప్రకటించటాన్ని కర్ణాటక, కేరళ, గోవా తప్పుబట్టాయి. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత తీరిందన్నట్టు చేతులు దులుపుకొంది. ఫలితంగా అడవులు తరిగి, పర్యావరణం దెబ్బతిని, వన్యప్రాణులకు ప్రాణాంతకమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాని పర్యవసానంగానే దేశమంతా పులుల సంఖ్య పెరిగితే అక్కడ తగ్గింది. దీన్ని తగ్గటంగా పరిగణించనవసరం లేదు...పులుల సంఖ్య స్థిరంగా ఉండిపోయినట్టు భావించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నవారు లేకపోలేదు. కానీ అడవులు అంతరిస్తూ వాటి స్థానంలో రోడ్లు విస్తరిస్తుంటే...పర్యాటకం పేరిట మనుషుల తాకిడి పెరుగుతుంటే, ఖనిజాల కోసం అడవులు నరకడానికి పూనుకుంటే వన్యప్రాణులు ప్రశాంతంగా మనుగడ సాగించలేవు. పులులు, అవి వేటాడే జంతువులు సంచరించే ప్రాంతాలు కుంచించుకుపోతే పులులపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. వేట కోసం వెదుక్కుంటూ జనావాసాలపై కూడా పడతాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అడవుల వినాశనానికి కారణమవుతున్న ప్రభుత్వాలు ఆ తర్వాత జరిగే పర్యవసానాలు ఎదుర్కొనటానికి మరిన్ని అవకతవకలకు పాల్పడుతున్నాయి. ఏనుగులు, పులులు, చిరుతల బారినపడి గత పదినెలల్లో 41మంది పౌరులు మరణించారని మొన్న ఫిబ్రవరిలో కర్ణాటక ప్రభుత్వం అసెంబ్లీకి తెలిపింది. స్వేచ్ఛగా సంచరించటానికి, ఆహారం వెదుక్కొనటానికి అనువైన పరిస్థితులు లేనప్పుడు పులుల్లో ఒకరకమైన అభద్రతాభావం ఏర్పడి వాటి పునరుత్పత్తి సామర్థ్యం క్షీణిస్తుందని నాలుగేళ్లక్రితం సీసీఎంబీ నివేదిక హెచ్చరించింది.

వన్యమృగాల సంరక్షణ పేరుతో ఆదివాసీలను అడవులకు దూరం చేద్దామని ప్రయత్నించే ప్రభుత్వాలు తీరా ఆ అడవులను ఖనిజాల వెలికితీత కోసం బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడానికి, విశాలమైన రోడ్లు నిర్మించటానికి వెనకాడటం లేదు. దాంతో భారీ యంత్రాలు అక్కడికి తరలివస్తున్నాయి. వన్యప్రాణులను హడలెత్తిస్తున్నాయి. నిజానికి శతాబ్దాలుగా ఆదివాసీలు వన్యప్రాణులతో సురక్షితంగా సహజీవనం సాగిస్తున్నారు. వాటి కదలికలకు అనువుగా జీవనం సాగించటం, వాటికి హాని కలగనిరీతిలో అవసరమైన ఆత్మరక్షణ చర్యలు తీసుకోవటం పరంపరాగతంగా వారికి అలవడిన విద్య. ఏదేమైనా అడవుల సంరక్షణకూ, వన్యమృగాలను కాపాడటానికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోనట్టయితే జీవవైవిధ్యం నాశనమవుతుంది. మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుంది. ఇప్పుడు వెలువడిన నివేదికలోని గణాంకాలు ఆశావహంగానే ఉన్నా చేయాల్సింది ఇంకెంతో ఉన్నదని నివేదిక తెలియజేస్తోంది. ఆ దిశగా అడుగులేయటమే ప్రభుత్వాల కర్తవ్యం.

# నిమ్మకూరు మౌనంగా ప్రశ్నిస్తోంది!

'మా ఊరు మనిషి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడానికి మనసెలా వచ్చింది' అని నిమ్మకూరు ప్రజలు మౌనంగా అడిగే ప్రశ్నకు చంద్రబాబు దగ్గర సమాధానం ఉందా? ఎన్టీఆర్ తరపున వారంతా ఇప్పుడు నిలదీయలేకపోవచ్చు. కానీ ఎన్టీఆర్‌కు జరిగిన అవమానం, వెన్నుపోటుతో ఆయన విలవిలలాడి ప్రాణాలు వదిలిన తీరు ఇంకా వారి మస్తిష్కాల్లో సజీవంగా ఉంటుంది. వారి బాధను మౌనంగా కళ్లతో అయినా వ్యక్తం చేస్తారు. నిమ్మకూరులో బస చేస్తున్న చంద్రబాబు... ఎన్టీఆర్ మరణానికి ఎందుకు కారణం కావాల్సి వచ్చిందో కనీసం చిన్న వివరణ అయినా ఇవ్వడం నైతికంగా ఆయన బాధ్యత కదా!


'క్యాంపు' రాజకీయాలంటే దేశంలో చాలా మంది నాయకుల పేర్లు గుర్తుకొస్తాయి. కానీ, క్యాంపు రాజకీయానికి 'వెన్నుపోటు' కూడా కలిపితే మాత్రం చంద్రబాబు పేరొక్కటి మాత్రమే ప్రజలకు ఠక్కున గుర్తుకొస్తుంది. తెలుగుదేశం వ్యవస్థాపకుడు, తన సొంత రెక్కల కష్టంతో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఎన్టీఆర్‌కు చంద్రబాబు క్యాంపు పెట్టి వెన్నుపోటు పొడిచిన విషయాన్ని ప్రజలు మరిచిపోరు. ఎన్టీఆర్ సొంతూరు కృష్ణాజిల్లా నిమ్మకూరు. నేడు (ఏప్రిల్ 12) చంద్రబాబు కృష్ణాజిల్లా పర్యటనలో భాగంగా నిమ్మకూరులో బసచేస్తున్నారు. ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో బస చేయడం ద్వారా ప్రజలకు చంద్రబాబే మరోసారి వెన్నుపోటు, క్యాంపు రాజకీయాలు గుర్తు చేస్తుండటం గమనార్హం.

తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు నేతృత్వంలో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి, ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబుకు అండదండగా నిలిచింది 'ఈనాడు' పత్రిక. ఆనాడు చంద్రబాబు నేతృత్వంలో వెన్నుపోటు ఎమ్మెల్యేల క్యాంపు వేదిక 'వైస్రాయ్' హోటల్‌లో ఎంతమంది ఉన్నారనే విషయం పూర్తిగా ఊహాగానమే. భారీ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా... పార్టీ ఫిరాయింపుల చట్టానికి దొరకకుండా పార్టీని చీల్చడానికి, అసెంబ్లీలో మెజారిటీ సంపాదించడానికి కావాల్సినంత మంది ఎమ్మెల్యేలు చంద్రబాబు క్యాంపులో లేరనే విషయం కుట్ర ముగిసిన తర్వాతే అందరికీ తెలిసింది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సినంతమంది ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని కూడగట్టే సామర్థ్యం చంద్రబాబుకు ఉందనీ, అప్పటికే భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు క్యాంపుకు చేరుకున్నారనీ 'ఈనాడు' పత్రిక, దాని అనుబంధ టెలివిజన్ 'ఈ టీవీ' ఊదరగొట్టాయి. ఇప్పటి మాదిరిగా అప్పట్లో కమ్యూనికేషన్ వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. సోషల్ మీడియా ఊసే లేదు. ఇటు ప్రజలకు, అటు ఎమ్మెల్యేలకు సమాచారం అందించే ప్రధాన సాధనం అప్పట్లో 'ఈనాడు'. చంద్రబాబుకు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య విషయంలో అసత్య ప్రచారం చేసి, భారీ సంఖ్యలో ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు చంద్రబాబు నేతృత్వంలో జతకట్టారని అప్పట్లో 'ఈనాడు' నమ్మించింది. రాజకీయాల్లో మేరునగధీరుడయిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబుకు 'ఈనాడు' తోడు లేకుంటే, వెన్నుపోటు కుట్ర విజయవంతం కాదనేది పరిశీలకుల భావన.

తిరుగుబాటు, వెన్నుపోటు ఒకటి కాదు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు పొడిచింది వెన్నుపోటు. నమ్మించి నట్టేట ముంచడం. అసత్యాల పునాదుల మీద క్యాంపు నిర్మించి, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చి, అధికారాన్ని హస్తగతం చేసుకోవడం చంద్రబాబు చేసిన పని. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, తీరని మనోవ్యథ కలిగించి, ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు మూడు దశాబ్దాల తర్వాత ఎన్టీఆర్ సొంత గ్రామం నిమ్మకూరులో బస చేయనున్న నేపథ్యంలో... ఎన్టీఆర్ ఆత్మ అడిగే ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు?

'పిల్లనిచ్చి, కాంగ్రెస్‌లో ఓడిపోయి మూలన కూర్చుని ఉన్న వ్యక్తికి అధికారం ఇచ్చిన మా ఊరి మనిషి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడానికి మనసు ఎలా వచ్చింద'ంటూ నిమ్మకూరు ప్రజలు మౌనంగా అడిగే ప్రశ్నలకు చంద్రబాబు వద్ద సమాధానం ఉందా?

– ఎం. విశ్వనాథరెడ్డి, ఇన్‌ఛార్జ్, స్టేట్‌బ్యూరో, సాక్షి




నారా వారి విజన్
'ప్రయివేటీకరణలో ఆంధ్రప్రదేశ్ విజయ గాథ' అంటూ ఏకంగా చంద్రబాబు ప్రభుత్వం వేసుకున్న పుస్తకం.

**Chief Minister's Message**

The Government of Andhra Pradesh is committed to improving the quality of life for all the people of the State. Better health care, building schools, constructing roads, improving public services, making Government more accountable and responsive, maintaining law and order. All these require substantial financial and human resources. It is imperative that we do not waste the scarce resources available to us and get best value from every Rupee of tax payers' money we spend.



అందమైన అబద్ధాలు..
రాష్ట్రంలో ప్రభుత్వ వ్యాపార సంస్థల వనరులు ఆవిరయిపోతున్నాయని, ఓ గొప్ప ప్రయివేటు రంగం పుట్టుకొస్తోంది కనక వారికి వీటిని అప్పగించేస్తే వాణిజ్యపరంగా మనగలుగుతాయని బాబు ఇచ్చిన సందేశం.

**Finance Minister's Message**

I am happy to extend my best wishes to the Implementation Secretariat on producing a brochure, "Privatisation: A Success Story in Andhra Pradesh". It is a matter of great pride for all of us that the credible and transparent process of disinvestment and restructuring public enterprises which the Government of Andhra Pradesh is applying puts the State at the forefront of state level reforms in India.



నమ్మిన బంటు
ప్రయివేటీకరణ విజయవంతమై... దానిపై పుస్తకం కూడా వేసినందుకు సంతోషం పట్టలేకపోతున్నానని, ప్రభుత్వ సంస్థల్ని ప్రయివేటుగా మార్చే ప్రక్రియను చాలా సమర్థమంతంగా చేస్తున్నామని నాటి ఆర్థిక మంత్రి యనమల ఇచ్చిన సందేశం.

# బాబే..ప్రైవేట్ మాస్టర్

▶ మొదటి పేజీ తరువాయి
అడ్డుకోవటంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి లేదట!!. ఇక చంద్రబాబు ఏ కంపెనీని అమ్మేసినా... మూసేసినా శెబాషంటూ కితాబిచ్చిన 'ఈనాడు' ఇప్పుడేమంటోందో తెలుసా? తెలంగాణకు ఉన్నపాటి శ్రద్ధయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేదట!!. ముఖ్యమంత్రి జగన్‌కు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించటం చేతగాదని, ప్రయివేటీకరణను గట్టిగా వ్యతిరేకించడానికి కూడా భయపడుతున్నారని.. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు మాత్రం సత్తా చాటారని రంగస్థల పద్యాలు రాసేశారు రామోజీ!!. ఈ దుర్మార్గపు కుట్రల వెనక నిజానిజాలివిగో...



## ఏది నిజం?

విశాఖ స్టీల్ ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలన్నది తమ విధానమని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదటి నుంచీ చెబుతోంది. దీనికోసం ఉద్యమిస్తున్న అక్కడి కార్మిక సోదరులకు వివిధ సందర్భాల్లో మద్దతు కూడా తెలుపుతోంది. అంతేకాదు! మొదటి నుంచీ దీన్ని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని చెబుతూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... దీనికోసం 2021 ఫిబ్రవరి 6న, 2022 మార్చి 9న నేరుగా ప్రధానిని అభ్యర్థిస్తూ కేంద్రానికి లేఖలు కూడా రాశారు. ఏదో అడిగినట్లు కాకుండా... స్టీల్ ప్లాంటుకు ఉన్న సమస్యలేంటి? దాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించడానికి ఉన్న ప్రత్యామ్నాయాలేంటి? అనేవి లేఖలో సూచించారు. ప్లాంటుకు ఉన్న విలువైన భూముల్ని ప్లాంటు గనక విక్రయించుకోగలిగితే రుణం సమస్య తీరుతుందని, సొంత ముడి ఇనుము గనులు కేటాయిస్తే మిగిలిన ప్లాంట్ల మాదిరిగానే లాభదాయకత సమస్య ఉండదని వివరంగా తన లేఖలో పేర్కొన్నారు. అంతే కాదు! ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసినపుడల్లా విశాఖ ఉక్కును ప్రస్తావిస్తూనే వస్తున్నారు. అది ఒకసంస్థ మాత్రమే కాదని... తెలుగువారి భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశమని కూడా కేంద్రానికి చెబుతూ వస్తున్నారు.

మరోవంక చంద్రబాబు నాయుడు మాత్రం తను అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎన్నడూ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకించే ప్రయత్నమే చేయలేదు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఒక్క ప్రకటనా చేయలేదు. పైపెచ్చు ఇపుడు బిడ్డింగ్‌లో పాల్గొంటామంటూ తెలంగాణ సర్కారు తన ఆలోచనను బయటపెట్టడంతో... ఇదే సాకుగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌పై విషం చిమ్మటం మొదలెట్టారు. ఆయనకు జతకలిశాడు ఆయన ఆప్తమిత్రుడు రామోజీరావు. ''ఉక్కు సంకల్పం మనకేదీ?'' అంటూ ఓ కథనాన్ని వండేశారు. అసలు ఇలాంటి కథనాలు వండే ముందు అందులో సాధ్యాసాధ్యాలు... బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు ఉన్న అవకాశాలు ఇవన్నీ చూడాలి కదా? అదేమీ లేకుండా తెలంగాణ సర్కారు తన ఆలోచన బయటపెట్టగానే... ఆంధ్రకేదీ ఉక్కు సంకల్పం? అంటూ విషపు చుక్కలు విసిరేయటమేనా? అసలు వైఎస్ జగన్ ప్రభుత్వమంటే ఎందుకంత కక్ష రామోజీరావు గారూ? ఎందుకంత అక్కసు.. అసూయ?


## ఏపీ, తెలంగాణ, సింగరేణిలకు బిడ్డింగ్‌లో నో చాన్స్!

వాస్తవానికి గతేడాది ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ ప్రభుత్వ రంగ సంస్థలకూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, 51 శాతానికన్నా ఎక్కువ ప్రభుత్వ వాటా ఉన్న సంస్థలు గానీ... డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా విక్రయించే సంస్థల బిడ్డింగ్‌లో పాల్గొనకూడదని నిషేధం విధించింది. అలా పాల్గొనే అర్హత వీటికి లేదని స్పష్టం చేసింది. ఈ నిబంధనల ప్రకారం చూస్తే... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు బిడ్డింగ్‌లో పాల్గొనే అర్హత లేదు. ప్రభుత్వ వాటా 51 శాతానికన్నా ఎక్కువ ఉన్న సింగరేణి సంస్థకు కూడా ఈ అర్హత లేదు. ఈ నిబంధనలను సడలిస్తూ ఎవరికైనా కేంద్ర ప్రభుత్వం గనక ప్రత్యేకంగా అనుమతి ఇస్తే... వారికి బిడ్డింగ్‌లో పాల్గొనే అర్హత వస్తుంది. బహుశా... తాము ప్రయత్నించినా కేంద్రం తమను అనుమతించలేదని చెప్పుకోవటం తెలంగాణ ప్రభుత్వ ఎత్తుగడ అయి ఉండొచ్చు. కాకపోతే ఈ అర్హత గురించి 'ఈనాడు'కు తెలియదనుకోవాలా? తెలిసి కూడా... వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని తెలంగాణతో పోల్చి.. రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచడానికి కుట్ర చేశారనుకోవాలా? రెండోదే నిజం. ఏదో ఒకరకంగా వైఎస్ జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారమే ధ్యేయంగా సాగుతున్న రామోజీరావు... ఇలాగైనా తన చంద్రబాబుకు సాయపడాలనుకున్నారు. అందుకే ఈ దుర్మార్గపు రాతకలు దిగారు.

## కడప స్టీల్ ప్లాంటును పట్టించుకోలేదేం?

### నాడు- నేడు ప్రైవేటీకరణను వ్యతిరేకించింది జగన్ ఒక్కరే...


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో... కడపలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం పేర్కొన్నప్పటికీ ఐదేళ్లు అధికారంలో ఉన్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దిశగా ఒక్క అడుగూ వేయలేదు. కనీసం కేంద్రాన్ని గట్టిగా అడగలేదు. ఎందుకు అడగటం లేదంటూ చంద్రబాబును 'ఈనాడు' ప్రశ్నించలేదు కూడా!!. ఐదేళ్లలో కడప స్టీల్ ప్లాంటు దిశగా ఒక్క అడుగూ పడకపోయినా... 'ఈనాడు' ఏనాడూ ఒక్క అక్షరం కూడా రాయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పలుమార్లు కేంద్రాన్ని అభ్యర్థించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్... కేంద్ర నిరాసక్తతను గమనించి ప్రయివేటు సంస్థలను రప్పించే ప్రయత్నాలు మొదలెట్టారు. ప్రభుత్వ రంగంలో కుదరనపుడు ప్రయివేటు రంగంలోనైనా భారీ ఉద్యోగాలు కల్పించాలన్న సీఎం ప్రయత్నాలు ఫలించి... దేశంలో అగ్రగామి సంస్థగా ఉన్న జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ముందుకొచ్చింది. ఇటీవలే జేఎస్‌డబ్ల్యూ అధిపతి సజ్జన్ జిందాల్ ఈ ప్లాంటుకు సీఎం సమక్షంలో శంకుస్థాపన చేశారు. అదీ చిత్తశుద్ధి అంటే. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రధానికి ముఖ్యమంత్రి లేఖలు రాయటం... అభ్యర్థించటం ఒకవైపు జరుగుతుండగానే... మరోవైపు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సైతం గళమెత్తుతూ వస్తున్నారు. మరి ఇన్ని ప్రయత్నాలు చేస్తున్నా ప్రతిపక్షంలో బీరాలు పలికారని, అధికారంలోకి వచ్చాక చేష్టలుడిగారని 'ఈనాడు' విషం కక్కడమే ఈ రాష్ట్ర దౌర్భాగ్యం.



F.No.3/21/2016-DIPAM-II-B(E)
Government of India
Ministry of Finance
Department of Investment and Public Asset Management Disinvestment

Block No. 14, CGO Complex,
Lodhi Road, New Delhi-110003
19th April, 2022

OFFICE MEMORANDUM



per Companies Act, 2013 it is decided that:

"As a general policy, Public Sector Enterprises (PSEs) [Central/State/ Joint] / State Governments/ Cooperative Societies controlled by the Governments (i.e. where 51% or more ownership is by the Central Government/ State Governments/Jointly by Central and/ or State Governments) are not permitted to participate in the strategic disinvestment/ privatization of other PSUs as bidders unless otherwise specifically approved by the Central Government in public interest."

8. The Ministries/Departments are requested to communicate the above decision of the Government to all the PSEs and the Cooperative Societies under their administrative control.

9. This issues with the approval of Finance Minister.


(Aseem K Jha)
Under Secretary to the Government of India
Phone no. 24368767

To


ఈ నిబంధనలు తెలీవా?
రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, ప్రభుత్వాల వాటా 51 శాతంకన్నా ఎక్కువ ఉన్న పీఎస్‌యూలు గానీ డిజిన్వెస్ట్‌మెంట్ బిడ్డింగ్‌లో పాల్గొనకూడదంటూ 2022 ఏప్రిల్ 19న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు.

## ఇదీ... బాబు గారి ప్రయివేటీకరణ లోగుట్టు



విలువైన ప్రభుత్వ సంస్థల్ని, వాటి ఆస్తుల్ని తన వారికి కట్టబెట్టేయాలని ముందే పథకం వేసిన చంద్రబాబు... 1996లో తాను సీఎం అయ్యాక పద్ధతి ప్రకారం దాన్ని అమల్లోకి తెచ్చారు. అందుకు రామోజీరావు శక్తి వంచన లేకుండా సహకరించారు. మూసేయాలనుకున్న సంస్థలకు ముందుగా... నష్టాల ఊబిలో కూరుకుపోయాయంటూ ముద్ర వేసేవారు. 'ఈనాడు'లో ఆయా సంస్థలు విపరీతమైన నష్టాల్లో ఉన్నాయని, వాటిని పోషించటం వృథా అంటూ వరసగా కథనాలు రాయించేశారు. ఒక కుక్కను చంపాలంటే ముందు దానికి పిచ్చి కుక్క అనే ముద్ర వేయాలన్న సూత్రాన్ని రామోజీ–బాబు పక్కాగా అమలు చేశారు. అందులో భాగంగానే నిజాం షుగర్స్‌కు చెందిన 8 యూనిట్ల ఆస్తులను కారుచౌకగా ప్రయివేటు పరం చేసేశారు. డెల్టా షుగర్ మిల్‌తో పాటు ఇతర సహకార చక్కెర కర్మాగారాలను మూసేశారు. ఆదిలాబాద్ స్పిన్నింగ్ మిల్‌ను ప్రైవేట్ పరం చేశారు, ఆల్విన్ వాచీలు, స్పిన్నింగ్ మిల్లులు, పేపర్ మిల్లులు వంటి 54 సంస్థలను అందిన కాడికి అమ్మేశారు. ఇందులో కొన్నిటిని ప్రైవేటీకరించగా 22 సంస్థలను మూసేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్ని 'వీఆర్‌ఎస్' పేరిట ఇంటికి పంపేయటం ద్వారా రూ.1282 కోట్లను ఆదా చేసినట్లు గుడ్ గవర్నెన్స్ పుస్తకంలో చంద్రబాబు రాసుకున్నారంటే పరిస్థితిని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. సింగరేణిని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించి... వీఆర్‌ఎస్ పేరిట 89,000 మంది సింగరేణి ఉద్యోగులను ఇంటికి పంపేసినా 'ఈనాడు' దాన్ని వ్యతిరేకించలేదు. సరికదా పొగిడింది. 2004 నుంచి రెండోదశ ప్రయివేటీకరణలో మరో 68 సంస్థల్ని తమ వారికి అప్పగించేందుకు చంద్రబాబు పథకం వేసి ఈ మేరకు ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం కూడా చేసుకున్నారు. రెండో దశలో ఆర్టీసీతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థల వంటివి ప్రయివేటీకరణ జాబితాలో ఉన్నాయి. అయితే 2004 ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవటంతో అవన్నీ బతికిపోయాయి. ఆ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రిగా వైఎస్. రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో బాబు ప్రయివేటీకరణ ఘట్టానికి ఫుల్‌స్టాప్ పడింది.



Under Phase-II Action Plan, 68 enterprises are slated for PE Reforms and in view of the momentum gathered and the success achieved in the first two years of the second phase, it is expected to achieve the target much earlier than the year 2006.

నారా వారి విజన్
అదే బుక్‌లో తొలిదశ ప్రైవేటీకరణ పూర్తి అయిందని, రెండో దశలో ఏమేమి ప్రైవేటీకరణ చేయాలన్న చంద్రబాబు టార్గెట్‌కు సాక్ష్యం ఇదీ...

## 07-02-2021న ప్రధానమంత్రి మోదీకి సీఎం జగన్ లేఖ

**ప్రత్యామ్నాయం చూడండి-ప్రైవేట్‌కు వద్దు**

**విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ప్రధాని మోదీకి సీఎం జగన్ లేఖ**

రాష్ట్రానికే విశాఖ స్టీల్ ప్లాంట్ ఆభరణం, దాన్ని కాపాడుకుంటాం, సంస్థ పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి. కేంద్రంతో కలిసి పనిచేయడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది.దీర్ఘకాలం పోరాడి సాధించుకున్న ప్లాంట్ ఇది. 2002 నుంచి 2015 వరకు సంస్థ లాభాల్లోనే ఉంది. సొంత గనులు లేకపోవడం..వ్యయం పెరగడంతో లాభాలు తగ్గాయి. పెట్టుబడులు ఉపసంహరణ కన్నా అండగా ఉండి చేయూతనివ్వండి. ప్లాంట్ తప్పనిసరిగా లాభాల బాట పడుతుంది. సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. రుణాలను ఈక్విటీలుగా మారిస్తే వడ్డీల భారం ఉండదు..

**09-03-2021న ప్రధానమంత్రి మోదీకి సీఎం జగన్ మరో లేఖ**
**మీ నిర్ణయం మార్చుకోండి-విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు**
**ప్రధాని మోదీకి సీఎం జగన్ మరో లేఖ**

గత నెలలో నేను మీకు (ప్రధానమంత్రి) రాసిన లేఖలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలన్నింటినీ వివరించాను. ఆర్థిక మంత్రి ప్రకటనతో ప్లాంట్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రజల్లో ఆందోళన నెలకొంది. మా ఆకాంక్షలు, సెంటిమెంట్..ప్లాంట్‌ను ప్రవేటీకరించకుండా ఉన్న మార్గాల గురించి మీకు మరో సారి వివరించడానికి అఖిలపక్షం, కార్మిక సంఘాల నేతలను వెంట తీసుకుని వస్తాను. త్వరగా అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ మరో మారు మీకు లేఖ రాస్తున్నాను.విశాఖ స్టీల్ ప్లాంట్ రివైవల్‌కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుందని నేను హామీ ఇస్తున్నాను.

**గ్రహం అనుగ్రహం**
శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.సప్తమి రా.2.40 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: మూల ఉ.11.14 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.9.44 నుండి 11.14 వరకు, తిరిగి రా.8.16 నుండి 9.46 వరకు, దుర్ముహూర్తం: ప.11.33 నుండి 12.25 వరకు, అమృతఘడియలు: తె.5.20 నుండి 6.48 వరకు (తెల్లవారితే గురువారం); రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.11.

## క్లుప్తంగా...

### శ్రీవారి సర్వ దర్శనానికి 20 గంటలు

**తిరుమల:** తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 69,791 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.5.16 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు ఉన్నవారికి సకాలంలో, లేని వారికి 20 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

### ఇండిగో విమానానికి సాంకేతిక లోపం

**గోపాలపట్నం (విశాఖ పశ్చిమ):** విశాఖ నుంచి చెన్నై వెళ్లాల్సిన విమానం సాంకేతిక లోపంతో విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయింది. మంగళవారం ఉదయం 8.15కి చెన్నై నుంచి విశాఖ చేరుకున్న ఇండిగో విమానం 8.40 గంటలకు తిరిగి ప్రయాణం కావాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. విమానంలో ఉన్న 150 మంది ప్రయాణికులను టెర్మినల్‌లోకి తీసుకువచ్చారు. ఇండిగో విమానాల్లో హైదరాబాద్ మీదుగా చెన్నైకి రీబోర్డింగ్ చేసి పంపించారు. మరికొంత మందిని రీషెడ్యూల్ చేసి మరో విమానంలో చెన్నైకి పంపారు. ఈ ప్రక్రియతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిలిచిపోయిన విమానానికి మరమ్మతులు చేపడుతున్నారు.

### శ్రీశైలంలో సంప్రదాయబద్ధంగా జగన్మాత కుంభోత్సవం



సింహమండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా పోసిన దృశ్యం

**శ్రీశైలం టెంపుల్:** లోకకల్యాణార్థం శ్రీశైలంలో జగన్మాత శ్రీ భ్రమరాంబాదేవికి మంగళవారం వార్షిక కుంభోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అర్చకస్వాములు ఉత్సవ సంకల్పం పఠించి ప్రాతఃకాల పూజల అనంతరం అమ్మవారికి నవావరణపూజ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర కుంకుమ పూజ, జపపారాయణలను ఏకాంతంగా నిర్వహించారు. తొలి విడత సాత్వికబలిగా అమ్మవారికి గుమ్మడి, కొబ్బరి, నిమ్మకాయలను సమర్పించారు. హరిహరరాయగోపుర ద్వారం వద్ద మహిషాసురమర్దిని అమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు జరిపి, సాత్వికబలి సమర్పించారు. సాయంత్రం మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజలు చేసి అన్నాభిషేకం జరిపించారు. అమ్మవారికి ఎదురుగా ఉండేలా సింహమండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా సమర్పించారు. సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి ఇచ్చారు. రెండో విడత సాత్విక బలిగా గుమ్మడి, కొబ్బరికాయలను సమర్పించి అమ్మవారి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయ ఈవో లవన్న, తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీకి ఏజెన్సీ జీడిపప్పు సరఫరా చేస్తాం

- డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ వీసీ జానకీరామ్



రైతులకు అమృతపాణి అరటి మొక్కల పంపిణీ చేస్తున్న అధికారులు

**రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా):** ఏజెన్సీలో సేంద్రియ పద్ధతిలో పండించిన జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసి తిరుపతి తిరుమల దేవస్థానం(టీటీడీ)కు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ (వెంకటరామన్నగూడెం) వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరామ్ తెలిపారు. పెదపాడు గ్రామంలో మంగళవారం ఉద్యాన పంటలను ఆశించే నులి పురుగులపై అవగాహన, అమృతపాణి అరటి రకం పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గిరిజన రైతులు జీడి మామిడి సాగులో ఎరువులను చాలా తక్కువగా వాడతారని, వారిని గ్రూపులుగా ఏర్పరచి, పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో జీడి మామిడి పిక్కలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తామన్నారు. తిరుపతి ప్రసాదం తయారీలో ఈ ఆర్గానిక్ జీడిపప్పును వినియోగించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. రైతులకు ఉపయోగపడేలా యూనివర్సిటీ అనేక పరిశోధనలు చేస్తోందన్నారు. అంతరించిపోతున్న అమృతపాణి అరటి పునరుద్ధరణకు కొవ్వూరు హెచ్‌ఆర్ఎస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర జీవవైవిధ్య కమిటీ చైర్మన్ బీఎంకే రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీలో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. రేల సంస్థ డైరెక్టర్ బసవరాజు, అఖిల భారత నులిపురుగుల సమన్వయ పథకం కో–ఆర్డినేటర్ కేవీవీఎస్ క్రాంతి మాట్లాడారు. రెండు వేల అమృతపాణి అరటి మొక్కలు, స్ప్రేయర్స్ పంపిణీ చేశారు. అరటిలో యాజమాన్య పద్ధతులపై కరపత్రాన్ని విడుదల చేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు నారం రాయుడు, కేవీకే కో–ఆర్డినేటర్ లలితా కామేశ్వరి, హెచ్‌ఆర్ఎస్ అధిపతి రాజేంద్రప్రసాద్, హెచ్‌ఆర్ఎస్ కొవ్వూరు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# తూర్పు తీరం ఆడపడుచులు

## పుట్టిన చోటే పురుడు పోసుకుంటున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు

- వీటి మేధస్సు అమోఘం
- సంతానోత్పత్తి కేంద్రంగా కాకినాడ తీరం
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో తాబేళ్ల రాక



సంతానోత్పత్తికి వచ్చిన ఆలివ్ రిడ్లే ఆడ తాబేలు

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** పుట్టింటిపై మమకారం మగ పిల్లలతో పోలిస్తే ఆడ పిల్లలకు మరింత ఎక్కువే. పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయినా.. పుట్టింటిపై మమకారం వారిలో చెక్కు చెదరదు. నోరులేని మూగజీవాలకు కూడా జన్మస్థలంపై అంతటి మమకారం ఉంటుందంటే ఆశ్చర్యమే. సైబీరియా పక్షుల మాదిరిగా కేవలం సంతానోత్పత్తి కోసమే ఎన్ని వేల కిలోమీటర్ల దూరమైనా ప్రయాణించి పదేళ్ల తరువాత పుట్టింటికి వస్తాయి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. పుట్టిన కొద్ది రోజులకే సముద్రంలో ఎంతో దూరం వెళ్లిపోయే ఈ తాబేళ్లు పదేళ్ల తరువాత సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ఈదుకుంటూ.. తాము పుట్టిన ప్రాంతానికే చేరుకుంటాయి. ఇలా రాగలగటం వాటి జ్ఞాపక శక్తికి నిదర్శనమంటారు. ఆలివ్ రిడ్లే శాస్త్రీయ నామం 'లెపిడోచెలిస్ ఒలివేసియా'. గ్రీన్ టర్టిల్, లెదర్ బ్యాగ్, గ్రీన్‌సీ టర్టిల్, హాక్‌బిల్‌సీ వంటి జాతుల తాబేళ్లు ఉన్నప్పటికీ ఆలివ్ రిడ్లే రకం తాబేళ్లు తూర్పు తీరానికి ఎక్కువగా వస్తున్నాయి.

**ఆ మూల నుంచి.. ఈ మూల వరకు**

ఒడిశాలోని బీతర్కానిక తీరం నుంచి.. తమిళనాడు సరిహద్దులోని తడ వరకు విస్తరించి ఉన్న సముద్ర తీరం వరకు ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంతానోత్పత్తి కోసం వస్తుంటాయి. అందులోనూ కాకినాడ తీరానికే వీటి రాక అధికం. ఇసుక, నీరు తేటగా ఉండటం, 30 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో కూడిన వాతావరణం ఉండే ప్రాంతాలను ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఆసక్తి చూపుతాయి. వివిధ సముద్రాల్లో ఉండే ఈ తాబేళ్లు ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలోకి చేరి కలుస్తుంటాయి. ఆ తరువాత ఆడ తాబేళ్లు మాత్రమే గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తాయి. జనవరి రెండో వారం నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు ఇవి గుడ్లు పెట్టే సీజన్. ఈ తాబేళ్లు జీవితమంతా సముద్రంలోనే గడుపుతాయి. గుడ్లు పెట్టడానికి మాత్రం భూమి మీదకు వస్తాయి. నదులు సముద్రంలో కలిసే చోటు వీటి సంతానోత్పత్తికి అనువుగా ఉంటుంది. తీరంలోని ఇసుకలో బొరియలు తవ్వి ఒక్కో తాబేలు 100 నుంచి 150 వరకు గుడ్లు పెడుతున్నాయి. గుడ్లు పెట్టేశాక తల్లి సముద్రంలోకి వెళ్లిపోతుంది. ఆ గుడ్లలోంచి 45–55 రోజుల్లో పిల్లలు బయటకొస్తాయి. వీటిని అటవీ శాఖ సంరక్షించి కళ్లు తెరిచిన పిల్లలను సూర్యుడు ఉదయించే వేళ సముద్రంలోకి విడిచి పెడతున్నారు. వెలుతురు అంటే ఇష్టపడే తాబేలు పిల్లలు సూర్యుడు ఉదయించేటప్పుడు ఆ కిరణాల వైపు పరుగులు తీస్తూ సముద్రంలో కలిసిపోతాయి. ఈ ప్రక్రియ నెల రోజులుగా కాకినాడ తీరంలో అటవీ రేంజర్ ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరుగుతోంది. ఇప్పటికే సుమారు 8 వేల పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టారు.

**వీటి లెక్క.. పక్కా!**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తీరానికి వచ్చే ఆలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించేందుకు పదేళ్లుగా అటవీ శాఖ పదేళ్లుగా గట్టి ప్రయత్నమే చేస్తోంది. కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్, కోనసీమ జిల్లా పరిధిలోని గచ్చకాయల పోర, వాసాలతిప్ప, ఎస్.యానాం, కందికుప్ప నెస్టింగ్ సెంటర్ల (సంరక్షణ కేంద్రాల)లో ఏటా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లి తాబేలు గుడ్లు పెట్టాక వాటిని గుర్తించి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారు. గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చే వరకు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. దీంతో 2010 నుంచి ఏటా వీటి రాక అధికమవుతోంది. గడచిన ఈ ఏడాది రికార్డు స్థాయిలో తాబేళ్లు వచ్చాయని అటవీ శాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సీజన్‌లో 800 తాబేళ్లు రాగా.. ఈ ఏడాది సీజన్ ఇంకా కొనసాగుతుండగా.. ఇప్పటికే సుమారు 1300 తాబేళ్లు వచ్చాయని లెక్క తేల్చారు. ఒక్క కాకినాడ హోప్ ఐలాండ్‌కే 298 తాబేళ్లు రావడం గొప్ప విషయమని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

**మేధస్సులో ఆడ తాబేళ్లు దిట్ట**

తెలివితేటల్లో ఆడ తాబేళ్లు దిట్ట. ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టడానికి ముందు ఇసుక తేటగా.. చదునుగా.. అలికిడి లేని, సముద్ర అలలు తాకని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటాయి. గుడ్లు పెట్టే ప్రాంతంలో 30 సెంటీమీటర్ల మేర గొయ్యి తవ్వి గుడ్లు పెట్టి.. ఇసుకతో కప్పేస్తాయి. తవ్విన గోతిలో అడుగు భాగం (పునాది) గట్టిగా ఉండాలని శరీర బరువు (సుమారు 100 కేజీలు)తో అరగంట పాటు పైకి, కిందకు పడుతూ లేస్తూ దిమిసా (చదును) చేసి గుడ్లు పెడతాయి. గుడ్లను శత్రుజీవులు గుర్తించకుండా చుట్టుపక్కల డమ్మీ (మిమిక్‌గా పిలుస్తారు)గా నాలుగైదు గోతుల్ని తవ్వి ఇసుక తో కప్పేస్తాయి. నక్కలు, కుక్కలు, కాకులకు గుడ్లు పెట్టిన ప్రాంతం తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో ఆలివ్ రిడ్లే తెలివితేటలు అమోఘం.

**సముద్ర జలాల సమతుల్యతలో క్రియాశీలకం**



కళ్లు తెరిచిన పిల్లలు సముద్రంలోకి వెళ్లిన పదేళ్లకు కౌమార దశకు వస్తాయి. సంపర్కం తరువాత తనకు జన్మనిచ్చిన తీరాన్ని గుర్తుంచుకుని గుడ్లు పెట్టేందుకు తిరిగి అక్కడికే వస్తాయి. సముద్రం జలాల్లో వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో వీటి పాత్ర కీలకం. సముద్రంలో మత్స్య సంపదను మింగేస్తున్న జల్లీ ఫిష్‌లను ఆలివ్ రిడ్లేలు ఆహారంగా తీసుకుంటాయి. మత్స్య సంపదకు రక్షణగా ఉండటం, సముద్ర జలాలలో కాలుష్యం నివారించి శుభ్రంగా ఉంచడంలో వీటి పాత్రం అమోఘం.

– ఎస్.వరప్రసాద్, రేంజర్, కోరంగి అభయారణ్యం

**పుట్టినచోటే గుడ్లు పెడుతుండటం విశేషం**



పుట్టిన చోటే గుడ్లు పెట్టడానికి ఈ తాబేళ్లు ఎక్కువగా ఆసక్తి చూపుతాయి. గత ఏడెనిమిదేళ్లుగా వీటి రాకను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమైంది. తల్లి తాబేళ్లు గుడ్లు పెట్టే ముందు తీసుకునే జాగ్రత్తలు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. అందుకే అవి గుడ్లు పెట్టాక వాటిని పరిరక్షించడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. మా శాఖ సిబ్బంది అంతా సమన్వయంతో చంటిపిల్లల మాదిరిగా 50 రోజుల పాటు ఆ గుడ్లను జాగ్రత్తగా కాపాడుకుంటా. పిల్లలు బయటకు ఇచ్చి కళ్లు తెరిచాక వాటిని సముద్రంలోకి పంపించేస్తాం.

– కోన మహేష్, బీట్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం



### గంగా పుష్కరాలకు స్వరూపానందేంద్రకు ఆహ్వానం



స్వరూపానందేంద్ర సరస్వతికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఎంపీ జీవీఎల్

**సింహాచలం:** ఈ నెల 22 నుంచి మే 3 వరకు జరగనున్న గంగా పుష్కరాలకు కేంద్రం తరఫున విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిలను బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు ఆహ్వానించారు. విశాఖ శ్రీ శారదాపీఠాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అమ్మవారి వైశిష్ట్యం గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీకాశీ తెలుగు సమితి తరఫున గంగా పుష్కరాల నిర్వాహక కమిటీ తనను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకుని విశేషంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. 12 రోజులపాటు జరిగే గంగా పుష్కరాల్లో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారణాసి విచ్చేయాలని కోరారు. జీవీఎల్ ఆహ్వానానికి స్వరూపానందేంద్ర సానుకూలంగా స్పందించారు.

## చిన్నపిల్లల హృదయాలయం దేశానికే ఆదర్శం

**కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి కితాబు**



శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయం ఐసీయూను సందర్శిస్తున్న కేంద్రమంత్రి, టీటీడీ ఈవో

**తిరుపతి తుడా:** దేశాభివృద్ధిలో ప్రజల ఆరోగ్య సంరక్షణ, విద్యారంగం కీలకమైనవని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం, సహజ వనరుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి అన్నారు. మంగళవారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం కేంద్ర మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, బర్డ్ ఆస్పత్రులను సందర్శించారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలోని వార్డుల్లో గుండె జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ తదితర వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి వారికి అందుతోన్న వైద్య సేవలపై తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇక్కడి వైద్యసేవలు, చికిత్స విధానానికి మంత్రముగ్ధులైన కేంద్ర మంత్రి ఆస్పత్రి సేవలను కొనియాడుతూ ఈ ఆసుపత్రి దేశానికే ఆదర్శమన్నారు. లక్షలతో కూడుకున్న వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. రోగులతో పాటు సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని ప్రశంసించారు. బర్డ్ ఆస్పత్రిలో నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి, ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్సలనూ పరిశీలించారు. టీటీడీ ఆధ్వర్యంలో బర్డ్ ఆసుపత్రి కోవిడ్ కేర్ సెంటర్‌గా సేవలందించడం అభినందనీయమన్నారు. టీటీడీ ఈవో ధర్మా రెడ్డి, జేఈవో సదా భార్గవి, చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ జగనన్నే సీఎం కావాలని బస్సు యాత్ర



బస్సు యాత్ర ప్రారంభిస్తున్న సారిపిల్లి గోవింద్, సంపంగి శ్రీనివాసరావు

**సీతంపేట(విశాఖ ఉత్తర) :** మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలంటూ సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు బస్సు యాత్ర చేపట్టారు. డ్వాక్రా ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడుగుళ్ల నుంచి బస్సుయాత్ర ప్రారంభమయ్యింది. 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా అందించిన సుపరిపాలనతో 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక నాయకులు భీమవరపు శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్, భోగవిల్లి గోవింద్ పాల్గొన్నారు.

### చిన్న తిరుపతి విమానగోపురంపై.. గోవింద నామం!



ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శ్రీవారి ఆలయ విమానగోపురంపై ఆకాశంలో మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సమయంలో గోవింద నామం కనిపించింది.

– ద్వారకాతిరుమల

### విశాఖ ఉక్కు అదానీకి ఇస్తే డంపింగ్ యార్డే

- సీపీఐ నేత నారాయణ

**సాక్షి, న్యూఢిల్లీ:** విశాఖ ఉక్కు పరిశ్రమను అదానీ స్వాధీనం చేసుకున్నా నడిపించే పరిస్థితి ఉండదని సీపీఐ నాయకుడు నారాయణ చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం అదానీ ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. 30 వేల ఎకరాల భూమిని గ్రౌండ్ మాదిరిగా తయారు చేసి ఇతర దేశాల నుంచి వివిధ సరుకులను దిగుమతి చేసుకుని డంపింగ్‌కి ఉపయోగిస్తారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

### అతిథిగృహం పునఃనిర్మాణానికి రూ.25 కోట్ల విరాళం

**తిరుమల:** తిరుమలలో దాతలు టీటీడీకి విరాళంగా అతిథిగృహాలను నిర్మించి అందించేందుకు నిర్వహించిన టెండర్లలో ఒక అతిథి గృహానికి రికార్డు స్థాయిలో రూ.25,77,77,777ల భారీ విరాళాన్ని చెన్నైకి చెందిన జీ స్క్వేయర్ రియల్టర్స్ సంస్థ కోట్ చేసింది. తిరుమలలోని హెచ్‌వీడీసీలోని 493 అతిథి గృహానికి నిర్వహించిన ఈ టెండర్లో అత్యధిక మొత్తాన్ని పై కంపెనీ కోట్ చేసి దక్కించుకుంది. గతంలో హెచ్‌వీడీసీ 496 అతిథిగృహానికి టీటీడీ బోర్డు సభ్యుడు జీవన్ రెడ్డి రూ.21 కోట్ల టెండర్‌ను కోట్ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం తిరుమలలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన టెండర్‌లో అతిథిగృహం పునఃనిర్మాణానికి జీస్క్వేయర్ రియల్టర్స్ సంస్థ పై మొత్తాన్ని విరాళం అందించేందుకు ముందుకు వచ్చింది. టెండర్లో అత్యధికంగా విరాళం అందించిన దాత సదరు అతిథి గృహాన్ని తమ సొంత ఖర్చులతో నిర్మించి టీటీడీకి అందించాలి. అందులో ఒక గదిని దాతకు అందిస్తారు. వాటిని నిర్వహణను దాతలే చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం టీటీడీకి అందించిన విరాళం పూర్తిగా టీటీడీకి చెందుతుంది. కంపెనీ పేరు మీద టెండర్ పొందిన దాతలకు 20 ఏళ్లు, వ్యక్తిగతంగా టెండర్‌ను పొందిన దాతలకు జీవితాంతం ఒక గదిని టీటీడీ కేటాయిస్తుంది. వాటి తాళాలను దాతలకే అందిస్తుంది.

## విద్యార్థి చెవి మెలిపెట్టి.. చేయి విరిచి..

- చిత్రహింసలకు గురిచేసిన నారాయణ స్కూల్ పీఈటీ
- విద్యార్థిని వేరే స్కూల్‌లో చేర్పిస్తామని చెప్పడమే కారణం



గాయపడ్డ విద్యార్థి గౌతం

**తగరపువలస:** విద్యాబోధన సరిగా లేనందున స్కూల్ మాన్పించి తీసుకువెళతానన్న ఓ విద్యార్థి తల్లి మాటలకు కలవరపడిన యాజమాన్యం ఆ విద్యార్థిని చిత్రహింసలకు గురిచేసింది. భీమిలి మండలం తాళ్లవలస/పెద్దిపాలెం నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బాధిత విద్యార్థి తల్లి మీనా తెలిపిన వివరాలివి.. విజయనగరానికి చెందిన ధనుంజయనాయుడు, మీనాల కుమారుడు గౌతం నారాయణ స్కూల్ విద్యార్థి. ధనుంజయనాయుడు ఆర్మీ విధుల్లో భాగంగా ఢిల్లీలో ఉంటున్నారు. ఇక్కడ చదువు బాగాలేదని గ్రహించిన తల్లి మీనా ఈ నెల ఒకటో తేదీన స్కూల్‌కు వెళ్లి 8 పరీక్షల తర్వాత 9వ తరగతి ఢిల్లీలో చదివించేందుకు గానూ గౌతంను తీసుకువెళ్తానని చెప్పింది. ఇందుకు గానూ స్కూల్‌కు చెల్లించాల్సిన మొత్తం ఫీజు రూ.1.45లక్షలు, దోబీ చార్జీల కింద రూ.6వేలకు అదనంగా మరో రూ.3 వేలు యాజమాన్యం వసూలు చేసింది. మరుసటిరోజు విద్యార్థికి పీఈటీ స్వామినాయుడు రూపంలో నరకం చూపించారు. స్కూల్ మైదానంలో తప్పులు చూపించి చెవి మెలిపెట్టి అరగంట పాటు గ్రౌండ్ చుట్టూ తిప్పుతూ హింసించారు. దీంతో చెవి నుంచి రక్తం కారి గడ్డ కట్టింది. అనంతరం ఒళ్లు మరిచి కొట్టడంతో భుజానికి గాయంతో పాటు కుడిచేయి విరిగిపోయింది. తూతూ మంత్రంగా అదే రోజు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న మీనా 4వ తేదీన స్కూల్‌కు వెళ్లి నిలదీయడంతో పాటు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గౌతంకు విజయనగరంలో మెరుగైన చికిత్స అందించింది. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మరోమారు భీమిలి పోలీసులను ఆశ్రయించింది.

## సామాజిక రుగ్మతలపై పోరాడిన పూలే

**926వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నేతలు

**తాడికొండ:** సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు కొనియాడారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 926వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని, మహిళలకు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాన్ని కల్పించి రాజకీయంగా కూడా 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగనన్నదే అన్నారు. 1852లోనే దేశ వ్యాప్తంగా 150 కేంద్రాలలో మహిళలకు విద్యను నేర్పించేందుకు శ్రీకారం చుట్టిన మహనీయుడు పూలే అన్నారు. తన దోపిడీ కోసం రాజకీయ ముసుగులో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చిన రామోజీరావు 1983 నుంచి యథేచ్ఛగా దోచుకుని రూ.లక్షల కోట్లు ధనార్జన చేశాడని మండిపడ్డారు. మార్గదర్శిలో జరిగిన మోసాలపై జరుగుతున్న విచారణలో పాపం పండుతుందని, చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్న రామోజీని న్యాయస్థానాలు శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

# అవినాశ్, భాస్కర్‌రెడ్డిలను ఇరికించే కుట్ర

- వైఎస్ వివేకా హత్య కేసును తప్పుదారి పట్టిస్తున్నారు
- టీడీపీ నేతలు, వైఎస్ సునీత కథ నడిపిస్తున్నారు
- వారికి దర్యాప్తు అధికారి కూడా సహకరించారు
- సాక్ష్యాలు, ఆధారాలను పట్టించుకోకుండా విచారణ
- హత్యలో కీలకమైన దస్తగిరికి బెయిల్ ఇచ్చారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి న్యాయవాది వాదనలు
- విచారణ గురువారానికి వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును టీడీపీ నేతలు, వైఎస్ సునీత కలసి తప్పుదారి పట్టిస్తున్నారని, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డిలను కేసులో ఇరికించేందుకు కుట్ర సాగు తోందని భాస్కర్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు తెలిపారు. టీడీపీ నేతలు, సునీతకు సీబీఐ దర్యాప్తు అధికారి కూడా పూర్తిగా సహకరించారని చెప్పారు. దర్యాప్తు సరిగా చేయడం లేదని భావించిన సుప్రీం కోర్టు ఆ అధికారిని విచారణ నుంచి తప్పించిందని వివరించారు. ప్రత్యక్ష సాక్షులను, ఆధారాలను పట్టించుకోకుండా దస్తగిరి తప్పుడు వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు సాగిస్తున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించినా, బెయిల్ ఇచ్చినా సునీత మౌనంగా ఉండటం వెనుక కుట్ర దాగి ఉందని వెల్లడించారు. 'వివేకా హత్య కేసులో సీబీఐ చెప్పినట్లు ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, అతనికి బెయిల్ ఇస్తూ కిందికోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందిరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలంలో చెప్పిన వాటికి సాక్ష్యం లేదు. ఇలా ఎలాంటి సాక్ష్యం లేకుండా ఒకరు చెప్పారంటూ వ్యక్తులను నేరంలోకి నెట్టడం చట్టవ్యతిరేకం. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా, కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇచ్చారు. దస్తగిరిని కస్టడీలోకి తీసుకోలేదు. విచారణా జరపలేదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు దస్తగిరి హత్యలో కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. అతని వద్ద కొంత నగదు కూడా దొరికింది. ఆయుధాన్ని అతనే తెచ్చినట్లు, హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లు కూడా ఒప్పుకున్నాడు. ఇంత చేసినా అతన్ని అప్రూవర్‌గా ప్రకటించేలా కడప కోర్టులో సీబీఐ కౌంటర్ వేసింది. 2021 ఆగస్టులో అనుకూల వాంగ్మూలం ఇచ్చిన కారణంగానే అక్టోబర్‌లో బెయిల్‌కు సీబీఐ సహకరించింది. మన వెనుక అవినాశ్, భాస్కర్‌రెడ్డి లాంటి కీలక వ్యక్తులు ఉన్నారని గంగిరెడ్డి చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని సీబీఐ చెబుతోంది. అయితే అసలు ఎవరి పేర్లూ చెప్పలేదని గంగిరెడ్డి వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఈ అంశాన్ని మాత్రం సీబీఐ పరిగణనలోకి తీసుకోవడంలేదు. వారికి ఏది కావాలో దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని విచారణ సాగిస్తున్నారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను ఆధారంగా చేసుకోవడం సరికాదు' అని నిరంజన్‌రెడ్డి వాదించారు.

**టీడీపీతో సునీత మిలాఖత్**

'వైఎస్ వివేకా తన వారసుడిగా రెండో భార్య కుమారుడిని ప్రకటించారు. ఇది మొదటి భార్య, కూతురు సునీత, అల్లుడికి నచ్చలేదు. ఆస్తుల విషయంలోనూ వారి మధ్య తీవ్రమైన మనస్పర్థలు వచ్చాయి. మరోవైపు గంగిరెడ్డితో వివేకాకు నగదుకు సంబంధించిన విభేదాలు కూడా ఉన్నాయి. అలాగే తన తల్లితో వివేకా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సునీల్ యాదవ్ చెప్పాడు. ఇలాంటి వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగింది. వీటిని కూడా సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు. అవినాశ్‌తో వివేకా సన్నిహితంగా ఉండేవారు. ఎన్నికల్లో అవినాశ్ విజయం కోసం ప్రచారం కూడా చేశారు. వివేకా హత్య తర్వాత ఇదే విషయాన్ని సునీత కూడా చెప్పారు. టీడీపీతో ఆమె మిలాఖత్ అయినప్పటి నుంచి మాట మార్చారు. విభేదాలు ఉన్న వారిని వదిలిపెట్టి.. సన్నిహితులను కేసులో ఇరికించేందుకు పథకం సాగుతోంది. దస్తగిరిపై వాచ్‌మేన్ రంగన్న చెప్పిన ఆధారాలను కింది కోర్టు పట్టించుకోలేదు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం. అతనికి బెయిల్ ఇచ్చే సమయంలోనూ అన్ని అంశాలను కింది కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. బెయిల్ చట్టప్రకారం ఇవ్వలేదు కనుక కడప కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి. దర్యాప్తు అధికారులకు అవినాశ్, భాస్కర్‌రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారు. విచారణకు హాజరవుతున్నారు. భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## క్లుప్తంగా...

### ఇకపై రెండు గంటల్లోనే 'టోఫెల్'




న్యూఢిల్లీ: విదేశీ ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఉపకరించే 'టోఫెల్' పరీక్ష ఇకపై రెండు గంటలలోపే ముగియనుంది. ప్రస్తుతం ఈ పరీక్షను మూడు గంటలపాటు నిర్వహిస్తున్నారు. అధికారిక స్కోర్‌ను విడుదల చేసే తేదీని టోఫెల్ పూర్తికాగానే అభ్యర్థులు తెలుసుకోవచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఈటీఎస్) వెల్లడించింది. టోఫెల్ ఒక గంట 56 నిమిషాల పాటు ఉంటుందని పేర్కొంది. టోఫెల్‌లో చేస్తున్న మార్పులు ఈ ఏడాది జూలై 26వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. టోఫెల్ స్కోర్‌ను 160కిపైగా దేశాల్లో 11,500కిపైగా యూనివర్సిటీలు అంగీకరిస్తున్నాయి. ఇందులో అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని వర్సిటీలు ఉన్నాయి. టోఫెల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నట్లు ఈటీఎస్ సీఈవో అమిత్ సేవక్ తెలిపారు. టెస్టు ఫీజును భారతీయ రూపాయల్లో చెల్లించవచ్చని సూచించారు. టోఫెల్ ప్రక్రియలో తీసుకొస్తున్న మార్పులతో లక్షలాది మంది భారతీయ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అసోసియేషన ఆఫ్ ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ రిప్రజంటేటివ్స్ ఇన్ ఇండియా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి బొర్రా వివరించారు.

### అమెరికా రాయబారి రాక

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన ఎరిక్ గార్సెట్టి మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్‌కు అత్యంత సన్నిహితుడైన గార్సెట్టి రెండేళ్ల క్రితమే భారత రాయబారిగా నియమితులయ్యారు. సెనేట్ మాత్రం నెల క్రితమే ఆమోద ముద్ర వేసింది. ''నమస్తే ఎరిక్ గార్సెట్టి: మీకు సాదర స్వాగతం. భారత్-అమెరికా మధ్య మరింత బలమైన బంధాలను నిర్మించడానికి మీతో కలిసి పనిచేస్తాం'' అని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ట్వీట్ చేసింది. రెండేళ్లుగా అమెరికా రాయబారి పదవి ఖాళీగానే ఉంది.

### 'జేపీసీ'ని వ్యతిరేకించను: పవార్

ముంబై: గౌతం అదానీ ఉదంతంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం దర్యాప్తు కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను వ్యతిరేకించబోనని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. జేపీసీ కంటే సుప్రీంకోర్టు విచారణ కమిటీ మేలన్న ఆయన వ్యాఖ్యలు కలకలం రేపడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ''జేపీసీ కావాలన్న విపక్షాల వైఖరి ఎన్సీపీకి అంగీకారం కాదు. అయినా వాటి ఉమ్మడి వైఖరికి భిన్నంగా పోదలచుకోలేదు. విపక్షాల ఐక్యత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం'' అని మంగళవారం చెప్పారు.

# నువ్వా నేనా..!

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో నెలకొన్న త్రిముఖ పోరులో మెజార్టీ అనేది ముఖ్య భూమిక పోషిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలోనూ చిన్న పార్టీల జోరు పెరిగిపోతూ ఉండడంతో అత్యధిక స్థానాల్లో అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో గట్టెక్కడం పరిపాటిగా మారింది. దాంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఓటునూ ఒడిసిపట్టడం ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు కీలకంగా మారింది...




1985 నుంచి ఇప్పటివరకు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూస్తే అత్యధిక స్థానాల్లో బొటాబొటి మెజార్టీతోనే నేతలు గట్టెక్కారు.

25 శాతానికి పైగా స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొంది. విజేతలకు, పరాజితులకు మధ్య తేడా 5, అంతకంటే తక్కువ శాతమే ఉంది.

గత మూడు దశాబ్దాల్లో కేవలం 5 శాతం స్థానాల్లో మాత్రమే భారీ మెజార్టీ నమోదైంది.

విజేతలు, పరాజితులకు వచ్చిన ఓట్లు, వాటి మధ్య తేడాలను విశ్లేషిస్తే ఓటరు గాలివాటంగా పోకుండా ఎంతో మేధోమథనం చేసి ఓటేస్తున్నాడని తేటతెల్లమవుతుంది.

మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులిద్దరికీ ఓట్లు 5 శాతం తేడా వస్తే హోరాహోరీగా పోరు సాగిందని, 20 శాతం కంటే ఎక్కువ ఉంటే ఓటరు నిర్ణయాత్మకంగా స్పందించారని అంటారు.

అధికార వ్యతిరేకత, చిన్న పార్టీల జోరు ఈ రెండూ కర్ణాటక ఎన్నికల ఫలితాల్ని శాసిస్తున్నాయి. వరసగా రెండోసారి ఏ పార్టీకీ అధికారాన్ని కట్టబెట్టే సంప్రదాయం లేని కన్నడ నేలపై అత్యంత తక్కువ ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలవడం సాధారణంగా మారింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 16 స్థానాల్లో విజేతలు 3 వేల కంటే తక్కువ మార్జిన్‌తో గట్టెక్కారు. గత ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ 36% ఓట్లతో 104 స్థానాల్లో విజయం సాధిస్తే, 38% ఓట్లు సాధించిన కాంగ్రెస్ మాత్రం 80 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది! మన ప్రజాస్వామ్యంలోని ఈ వైచిత్రి కారణంగా అత్యధిక ఓట్ల కంటే ఎక్కువ సీట్లు సాధించడమే సవాల్‌గా మారింది. అందుకే ఈసారి పార్టీలన్నీ ఒక్క ఓటు కూడా పోకుండా క్షేత్రస్థాయిలో వ్యూహాలు రచిస్తూ బూత్ మేనేజ్‌మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి.

### మూడు ఎన్నికల ముచ్చట

గత మూడు ఎన్నికల్లోనూ అన్ని పార్టీలకు స్వల్ప మార్జిన్ పెద్ద తలనొప్పిగా మారింది. 2008 ఎన్నికల్లో 224 స్థానాలకు గాను 70 స్థానాల్లో ఎమ్మెల్యేలు 5 శాతం కంటే తక్కువ మార్జిన్‌తో గెలుపొందారు. అంటే 31% స్థానాల్లో హోరాహోరి పోరు నెలకొన్నట్టయింది. 2013 ఎన్నికల దగ్గరకి వస్తే 5 శాతం కంటే తక్కువ ఓట్లతో గెలుపొందిన స్థానాల శాతం 30గా ఉంది. గత ఎన్నికల్లో 28% స్థానాల్లో హోరాహోరి పోరు నెలకొంది. గత మూడు ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే బీజేపీ, జేడీ(ఎస్) పార్టీల సగటు గెలుపు ఆధిక్యం 12 శాతం ఉండగా, కాంగ్రెస్‌కు 11 శాతం ఉంది. 1980ల వరకు ఏ రాష్ట్రంలోనైనా గెలుపు ఆధిక్యాలు చాలా ఎక్కువగా దాదాపుగా 30% అంతకంటే ఎక్కువ ఓట్లు ఉండేవి. తర్వాత ప్రాంతీయ పార్టీలు పెరగడం, పార్టీల సామాజిక సమీకరణలు వంటివి ప్రధానంగా మారి ఓట్ల ఆధిక్యానికి అడ్డుకట్ట వేస్తున్నాయి.

### చాలాచోట్ల ఓట్ల తేడా స్వల్పమే

కర్ణాటకలో గత కొన్నేళ్లుగా ఇదే ట్రెండ్

కర్ణాటకలో 1985 నుంచి అసెంబ్లీ స్థానాలవారీగా మెజారిటీ

| | 1985 | 1989 | 1994 | 1999 | 2004 | 2008 | 2013 | 2018 |
|---|---|---|---|---|---|---|---|---|
| 0-5% | 59 | 48 | 64 | 61 | 68 | 70 | 67 | 63 |
| 5-10% | 61 | 40 | 44 | 44 | 56 | 56 | 46 | 62 |
| 10-15% | 31 | 34 | 32 | 44 | 40 | 40 | 35 | 44 |
| 15-20% | 28 | 41 | 31 | 31 | 34 | 29 | 32 | 24 |
| 20-30% | 28 | 38 | 32 | 32 | 20 | 22 | 32 | 23 |
| 30% కంటే ఎక్కువ | 17 | 23 | 21 | 12 | 6 | 7 | 12 | 8 |

### పార్టీల్లో టెన్షన్ టెన్షన్

ఈసారి ఎవరి ఓటు బ్యాంకుకి గండిపడుతుందా అని మూడు ప్రధాన పార్టీల్లో టెన్షన్ మొదలైంది. మొత్తం 224 స్థానాలకు గాను అసదుద్దీన్ ఒవైసీకి చెందిన మజ్లిస్ 25 స్థానాల్లో పోటీ చేయనుంది. సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 100 స్థానాల్లో పోటీకి సన్నాహాలు చేస్తోంది. వీటితో కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు నష్టమనే అంచనాలున్నాయి. బీజేపీని వీడిన గాలి జనార్దన రెడ్డి కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. ఆప్ అన్ని స్థానాల్లోనూ పోటీ పడుతోంది. ఈ పార్టీల ప్రభావం గత ఎన్నికల్లో 5 వేల కంటే తక్కువ మెజారిటీ నమోదైన 30 సీట్లపై ఉంటుందని భావిస్తున్నారు. ''ఏదైనా నియోజకవర్గంలో హోరాహోరి పోరు నెలకొన్నప్పుడు చిన్న పార్టీలు రెండు నుంచి మూడు వేలు ఓట్లు సంపాదించినా అది చాలా పెద్ద ప్రభావాన్ని చూపిస్తుంది. వారు ఎన్నికల్లో గెలవలేకపోయినా ఫలితాలను మార్చే సత్తా కలిగి ఉంటారు''అని బెంగుళూరుకి చెందిన రాజకీయ విశ్లేషకుడు నరేంద్రపాణి అభిప్రాయపడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

### నోటాకే ఎక్కువ ఓట్లు!



2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు వచ్చిన మెజారిటీ కంటే నోటా (నన్ ఆఫ్ ది ఎబౌ)కే ఎక్కువ ఓట్లు రావడం విశేషం. వాటిలో ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెసే నెగ్గింది. అలంద్, బాదామి, గడగ్, హిరెకెరూర్, కంగ్‌డోల్, మాస్కి, పావగడలో అభ్యర్థుల గెలుపులో ఓట్ల కంటే నోటాకే ఎక్కువ పడ్డాయి.

## కర్ణాటకలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా

న్యూఢిల్లీ: కర్ణాటకలో 189 మందితో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం విడుదల చేసింది. వీరిలో 52 మంది కొత్తవారు. 32 మంది బీసీ, 30 మంది ఎస్సీ, 16 ఎస్టీ, 8 మంది మహిళలున్నారు. సీఎం బసవరాజ బొమ్మై శిగ్గావ్, మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు విజయేంద్ర శికారిపుర, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి చిక్‌మగళూరు నుంచి పోటీచేస్తారు. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌పై కనకపురలో మంత్రి ఆర్.అశోక బరిలో దిగనున్నారు. వరుణలో కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్యపై మంత్రి వి.సోమన్న పోటీకి సిద్ధమయ్యారు.

**తప్పుకుంటున్నా:ఈశ్వరప్ప**

బెంగళూరు/హుబ్బళ్లి: క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలుగుతానని, ఎన్నికల్లో పోటీ చేయబోనని బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప (74) ప్రకటించారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించవద్దంటూ బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు లేఖ రాశారు. ఇక మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ (67)కు బీజేపీ అధిష్టానం షాకిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయొద్దని సూచించింది. ఆయన మాత్రం తాను పోటీ చేస్తానని చెప్పారు.

### సల్మాన్ ఖాన్‌కు బెదిరింపు కాల్



ముంబై: బాలీవుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్‌ను చంపుతానంటూ ఓ టీనేజీ బాలుడు(16) బెదిరింపు కాల్ చేయడం సంచలనం కలిగించింది. సోమవారం రాత్రి ముంబై పోలీస్ కంట్రోల్ రూంకు అతడు ఫోన్ చేసి ఏప్రిల్ 30వ తేదీన సల్మాన్‌ను చంపుతానంటూ హెచ్చరించాడు. ఈ విషయాన్ని సల్మాన్‌కు తెలపాలంటూ ఫోన్ పెట్టేశాడు. వెంటనే పోలీసులు తిరిగి అతడికి ఫోన్ చేయగా గోరక్షకుడినని, తనది రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ అని చెప్పుకున్నాడు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ముంబైకి 70 కిలోమీటర్ల దూరంలోని థానె జిల్లా షాహాపూర్ నుంచి కాల్ వచ్చినట్లు గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసు బృందాలను చూడగానే సదరు టీనేజర్ బైక్‌పై పారిపోయేందుకు యత్నించగా వెంబడించి పట్టుకున్నారు. ముంబై పోలీసులకు అతడిని అప్పగించారు. పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసినట్లుగా అతడి సెల్‌ఫోన్‌లో కాల్‌డేటాను గుర్తించారు. అతడిది రాజస్తాన్ అని పోలీసులు చెప్పారు. ముంబై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గత నెలలో గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లనుంచి వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్‌తో ఇప్పటికే సల్మాన్‌కున్న వై ప్లస్ కేటగిరీ బందోబస్తును పోలీసులు మరింతగా పెంచారు.

## మరింత 'అణు' దూకుడు

ఉత్తర కొరియా అధినేత కిమ్
మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు

సియోల్: అణు పాటవాన్ని మరింతగా పెంచుకుంటామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. కొరియా ద్వీపకల్పంలో నానాటికీ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ అత్యున్నత సైనికాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అమెరికా-దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు దీటుగా రక్షణ సామర్థ్యాన్ని, యుద్ధ సన్నద్ధతను పెంచుకోవడంపై భేటీలో లోతుగా చర్చ జరిగినట్టు అధికార కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. అణ్వాయుధ సామర్థ్యాన్ని భారీగా పెంచాలని ఈ సందర్భంగా అధికారులను కిమ్ ఆదేశించారు. దక్షిణ కొరియాతో మిలిటరీ హాట్‌లైన్ చర్చలకు కూడా ఐదు రోజులుగా ఉత్తర కొరియా ముందుకు రాకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. బహుశా ప్రస్తుత ఉద్రిక్తతలను బూచిగా చూపుతూ దూకుడు చర్యలకు దిగేందుకు ఉత్తర కొరియా యోచిస్తుండవచ్చని దక్షిణ కొరియా అనుమానిస్తోంది. 2023లో ఉత్తర కొరియా ఇప్పటికే 30కి పైగా క్షిపణి పరీక్షలు నిర్వహించింది. వీటిలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు కూడా ఉన్నాయి. 2022లో కూడా రికార్డు స్థాయిలో 70కి పైగా క్షిపణి పరీక్షలు జరిపింది. తమను అణ్వాయుధ దేశంగా అంగీకరించేలా, ఆర్థిక ఆంక్షలను సడలించేలా అమెరికాపై ఒత్తిడి పెంచడమే వీటి ఉద్దేశమని భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య అణు చర్చల్లో 2019 నుంచీ ప్రతిష్టంభన నెలకొంది. ఉత్తర కొరియా 2017లో తొలిసారి అణుపరీక్షలు నిర్వహించింది.

### 71 వేల నియామకపత్రాలు... పంపిణీ చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ: కొత్తగా ఉద్యోగాల్లో చేరనున్న 71 వేల మంది యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడతారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 10 లక్షల మందికి ఉద్యోగకల్పన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రోజ్‌గార్ మేళాలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందని పేర్కొంది.

## మాజీ మెకానిక్‌ను వరించిన రూ.328 కోట్ల లాటరీ




క్లైవ్(అమెరికా): ఆదివారంతో వారాంతం ముగిశాక అందరూ సోమవారం కొత్త వారాన్ని మొదలుపెడతారు. కానీ అమెరికాకు చెందిన మాజీ మెకానిక్ ఏకంగా కొత్త జీవితాన్నే మొదలుపెట్టారు. 40 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.328 కోట్ల) లాటరీ రూపంలో ఆయనను ధనలక్ష్మి వరించింది. చిరకాల మిత్రుడొచ్చి లాటరీ గెలుపు సంగతి చెబితే 'ఏప్రిల్ ఫూల్' చేస్తున్నాడని భావించాడు ఎర్ల్ లాపే. ఎందుకంటే ఏప్రిల్ ఒకటో తేదీన ఆయన ఆ టికెట్ కొన్నాడు మరి. అమెరికాలోని అయోవా రాష్ట్రంలోని డబ్యూక్ సిటీలో ఉండే 61 ఏళ్ల లాపే మెకానిక్‌గా చేసి రిటైర్ అయ్యారు. ఇటీవల ఆయన కొన్న 'లోట్టో అమెరికా' లాటరీ టికెట్‌కు జాక్‌పాట్ తగిలింది. దీంతో ఆయన ఆనందానికి అవధుల్లేవు. సోమవారం లాటరీ ప్రధాన కార్యాలయానికి వచ్చి టికెట్‌ను క్లెయిమ్ చేశాడు. విడతలవారీగా అయితే రూ.328 కోట్లను 29సంవత్సరాల కాలంలో ఇస్తారు. కానీ విడతలవారీగా కాకుండా ఒకేసారి ఏకమొత్తంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆయనకు రూ.175 కోట్ల నగదు బహుమతి దక్కనుంది.

## ఎల్‌నినో ఉన్నా మంచి వానలే!

దేశంలో నైరుతి వర్షపాతంపై భారత వాతావరణ శాఖ అంచనా



న్యూఢిల్లీ: భారత్‌లో వర్షాభావ పరిస్థితులకు కారణమయ్యే 'ఎల్ నినో' దాపురించే అవకాశాలు ఉన్నాసరే ఈ ఏడాది దేశంలో నైరుతి రుతుపవన వర్షపాతం సాధారణస్థాయిలో కొనసాగి వ్యవసాయ రంగానికి మేలుచేకూర్చనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) మంగళవారం అంచనావేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమేట్ సోమవారం ప్రకటించిన మరుసటి రోజే వాతావరణ శాఖ మరోలా అంచనాలు వెల్లడించడం గమనార్హం. భారత్‌లో వ్యవసాయం ప్రధానంగా వర్షాలపై ఆధారపడింది. మొత్తం పంట విస్తీర్ణంలో దాదాపు 52 శాతం భూభాగం వర్షాధారం. దేశ మొత్తం ఆహారోత్పత్తిలో 40 శాతం.. ఈ భూభాగంలో పండించే పంట నుంచే వస్తోంది. ఇది దేశ ఆహారభద్రతకు, ఆర్థిక సుస్థిరతకు కీలక భూమికగా మారింది. ఈ పరిస్థితుల్లో దేశంలో వర్షపాతం సాధారణంగా ఉంటుందని అంచనావేసి వ్యవసాయరంగానికి ఐఎండీ తీపికబురు మోసుకొచ్చింది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితర జలాలు వేడెక్కితే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత్‌లో రుతుపవన గాలులు బలహీనమై పొడిబారి వర్షాభావం తలెత్తుతుంది.

**సగటు వానలు**

జూన్ నుంచి సెప్టెంబర్ దాకా నైరుతి సీజన్‌లో దాదాపుగా సుదీర్ఘకాల సగటు అయిన 87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని కేంద్ర భూ శాస్త్ర శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు. సాధారణం, అంతకు ఎక్కువ వానలు పడేందుకు 67 శాతం ఆస్కారముందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర అంచనావేశారు. ''రెండో అర్ధభాగంపై ఏర్పడే ఎల్‌నినో ప్రభావం చూపొచ్చు. అంతమాత్రాన వర్షాభావం ఉంటుందని చెప్పలేం. ఎన్నోసార్లు ఎల్‌నినో వచ్చినా సాధారణ వర్షపాతం నమోదైంది'' అని ఆయన వివరించారు.

## నన్నెవరూ ఆపలేరు: రాహుల్

వయనాడ్ జిల్లాలో 'సత్యమేవ జయతే' రోడ్డు షో



వయనాడ్: భయభ్రాంతులకు గురి చేసినా, ఎంపీ పదవి నుంచి తొలగించినా వయనాడ్ లోక్‌సభ స్థానం ప్రజలకు ప్రాతినిధ్యం వహించకుండా తననెవరూ అడ్డుకోలేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. అనర్హత వేటు తర్వాత తొలిసారిగా కేరళలోని వయనాడ్ జిల్లాలో ఆయన మంగళవారం పర్యటించారు. కల్పెట్టాలో 'సత్యమేవ జయతే' పేరిట రోడ్డు షో నిర్వహించారు. తనను జైలులో పెట్టినప్పటికీ వయనాడ్ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటానన్నారు. ''నాపైకి పోలీసులను పంపిస్తే, నా ఇంటిని లాక్కుంటే భయపడే ప్రసక్తే లేదు. అదానీ గురించి, ఆయనతో ప్రధాని మోదీకి సంబంధాల గురించి నా ప్రశ్నలను తట్టుకోలేకే లోక్‌సభ నుంచి పంపించారు'' అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు రాహుల్‌పై బీజేపీ ప్రభుత్వం క్రూరంగా మాటల దాడికి పాల్పడిందని ఆయన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా ఆరోపించారు. అబద్ధాలు చెప్పేవారికి, దుష్ప్రచారం చేసేవారికి నిజాలు చేదుగానే ఉంటాయని ఎద్దేవా చేశారు.

### ఈడీ ఎదుటకు తేజస్వీ యాదవ్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసులో బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీయాదవ్ మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ కేసులో గత నెలలో తేజస్వీతోపాటు, ఆయన సోదరి, ఎంపీ మీసా భారతిని ఈడీ ప్రశ్నించడం తెలిసిందే.

### 'డ్రోన్ ఆయుధాలు' పెను సవాళ్లు

భద్రతామండలిలో భారత ప్రతినిధి రుచిరా కాంభోజ్

ఐక్యరాజ్యసమితి: సరిహద్దుల ఆవలి నుంచి డ్రోన్ల ద్వారా జరుగుతున్న అక్రమ ఆయుధ సరఫరాతో పెనుసవాళ్లను ఎదుర్కొంటున్నామని భారత్ పేర్కొంది. ప్రభుత్వాల అండదండలు లేకుండా ఇవి అసాధ్యమని పాకిస్తాన్‌నుద్దేశించి వ్యాఖ్యానించింది. 'అంతర్జాతీయ శాంతి భద్రతలకు ముప్పు: ఆయుధాలు, సైనిక పరికరాల ఎగుమతులను నియంత్రించే ఒప్పందాల ఉల్లంఘనలతో ఉత్పన్నమవుతున్న ప్రమాదాలు' అంశంపై ఐరాస భద్రతా మండలిలో సోమవారం భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ ఈ మేరకు పేర్కొన్నారు. ప్రమాదకర ఆయుధాలు, సైనిక పరికరాలను దొంగచాటుగా సరఫరా చేస్తూ దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్న దేశాలను వదిలి పెట్టరాదన్నారు.

### అధిష్టానం వద్దన్నా పైలట్ నిరశన దీక్ష

జైపూర్: రాజస్తాన్‌లో కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ పార్టీ అధిష్టానం హెచ్చరికలను బేఖాతరు చేశారు. ముందుగా ప్రకటించినట్టుగానే రాష్ట్రంలో సొంత పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం నిరశనకు దిగారు. గత బీజేపీ సర్కారు అవినీతిపై చర్యలు తీసుకుంటాన్న ఎన్నికల హామీని సీఎం అశోక్ గహ్లోత్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక్క రోజు నిరాహార దీక్ష చేశారు. అవినీతిపై తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అనంతరం ప్రకటించారు.

### మయన్మార్‌లో వైమానిక దాడి.. 100 మంది ప్రజలు మృతి

బ్యాంకాక్: మయన్మార్ సైనిక పాలకుల వైమానిక దాడిలో సుమారు 100 మంది ప్రజలు చనిపోయారు. సగయింగ్ ప్రాంతం కన్‌బాలు పట్టణ సమీపంలోని పజిగ్యి గ్రామంలో మంగళవారం ఉదయం ఈ దారుణం జరిగింది. సైనిక పాలనను వ్యతిరేకిస్తూ విపక్ష ఉద్యమకారులు ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవంపై యుద్ధవిమానం బాంబులు వేసింది. సైనిక హెలికాప్టర్ నుంచి కాల్పులు జరిపారు. దాంతో 30 మంది మహిళలు, చిన్నారులు సహా 100 మంది దాకా చనిపోయారంటున్నారు.

## పోతపోసిన పోస్టాఫీస్...!



బెంగళూరు: 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో పోతపోసిన తపాలా కార్యాలయం దేశంలో తొలిసారిగా బెంగళూరులో కొలువు తీరనుంది. దీన్ని ఎల్ అండ్ టీ సంస్థ 45 రోజుల్లో 1,000 చదరపు అడుగుల్లో నిర్మించనుంది. పూర్తిగా ఆటో మేటిక్‌గా పనిచేసే రోబోటిక్ ప్రింటర్ దీన్ని తయారు చేస్తుంది. కాంక్రీట్‌ను పొరలు పొరలుగా 3డీ మోడల్‌కు తగ్గట్లు పోస్తుంది. ఎక్కడా కాంక్రీట్ పడే వేగం తగ్గకుండా చూస్తూ వెనువెంటనే గట్టిపడేలా చేస్తుంది. పొరల మధ్య బలమైన బంధం ఉండేలా 'గ్రీన్ కాంక్రీట్'ను నింపుతుంది. ''జీ+3 నిర్మాణాలు, విల్లాలు, సైనిక బ్యారక్‌లు, ఒకే అంతస్తుండే పాఠశాలలు, పోస్టాఫీసులు, ఫ్యాక్టరీల నిర్మాణంపై దృష్టిపెట్టాం'' అని సంస్థ పూర్తికాల డైరెక్టర్, ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్ (బిల్డింగ్స్) సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంపీ సతీశ్ ఈ సందర్భంగా మీడియాకు చెప్పారు.

## 300కుపైగా సీట్లు మావే

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం
- నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా



దిబ్రూగఢ్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 300కు పైగా సీట్లు సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతున్నామని ధీమా వెలిబుచ్చారు. అస్సాంలోని దిబ్రూగఢ్‌లో అప్పర్ అస్సాం జోనల్ బీజేపీ కార్యాలయ నిర్మాణానికి అమిత్ షా మంగళవారం పునాదిరాయి వేశారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగించారు. అస్సాంలో 14 లోక్‌సభ స్థానాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో తాము 12 స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఒకప్పుడు కాంగ్రెస్ బలంగా ఉండేదని, ఇప్పుడు ఆ పార్టీ నామమాత్రంగా మారిపోయిందని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదని, ఇటీవల ఈశాన్యంలో జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. ఈశాన్యంలో తమకు అధికారం కట్టబెట్టిన తొలి రాష్ట్రం అస్సాం ప్రజలకు అమిత్ షా కృతజ్ఞతలు తెలియజేశారు.

**అస్సాంలో శాంతి సౌభాగ్యాలు**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ గడ్డపై దేశాన్ని అవమానించారని అమిత్ షా మండిపడ్డారు. ఇలాగే చేస్తే కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతోందని అన్నారు. ప్రధాని మోదీని కొందరు ఇష్టారాజ్యంగా దూషిస్తున్నా ప్రజల ఆశీస్సులు ఆయనకు లభిస్తున్నాయన్నారు. మోదీ బాగుండాలని ప్రజలంతా ప్రార్థిస్తున్నారని తెలిపారు. అస్సాం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో 70 శాతం భూభాగం నుంచి వివాదాస్పద సైనిక దళాల (ప్రత్యేక అధికారాల) చట్టం-1958ను తొలగించామని పేర్కొన్నారు. అస్సాం అనగానే ఆందోళనలు, ఉగ్రవాదం గుర్తుకొచ్చేవని, ప్రస్తుతం శాంతి సౌభాగ్యాలు పరిఢవిల్లుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

## భావసారూప్య పార్టీలతో చేతులు కలుపుతాం

రాజ్యాంగ పరిరక్షణే మా ధ్యేయం • కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, అన్ని వ్యవస్థలనూ స్వలాభం కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ ఆరోపించారు. ప్రభుత్వ నిర్వాకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని చెప్పారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షణమే తమ ధ్యేయమని, ఇందుకోసం భావసారూప్యం కలిగిన రాజకీయ పక్షాలతో చేతులు కలుపుతామని, కలిసి పని చేస్తామని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో వెల్లడించారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేస్తోందని సోనియా దుయ్యబట్టారు. ప్రభుత్వ పెద్దల చర్యలను పరికిస్తే ప్రజాస్వామ్యం కంటే తామే అధికులమన్న భావన వారిలో వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో విద్వేషం, హింసను ప్రేరేపిస్తున్నాయని, ప్రధానమంత్రి ఉద్దేశపూర్వకంగానే వాటిని విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. శాంతి, సామరస్యం కోసం ప్రధాని ఏనాడూ పిలుపునివ్వలేదని ఆక్షేపించారు. మతం, ఆహారం, కులం, భాష పేరిట ప్రజలపై వివక్ష చూపుతున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**మోదీది కేవలం మాటల గారడీ**

రాబోయే కొన్ని నెలలు దేశ ప్రజాస్వామ్యానికి అగ్ని పరీక్షలాంటివని సోనియా అన్నారు. ''ముఖ్య రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి. దేశం కీలకమైన కూడలిలో ఉంది. రాజ్యాంగ ఆశయాల పరిరక్షణకు భావసారూప్య పార్టీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రజావాణికి కాపలాదారుగా ఉంటాం. ప్రధాని మోదీ మాటల గారడీతో జనాన్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులపై లెక్కలేనన్ని కేసులు! బీజేపీలో చేరితే అవన్నీ మటుమాయం!'' అని దుయ్యబట్టారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



## ఐపీఎల్ టికెట్లు ప్లీజ్..

శాసనసభలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేల విన్నపం

సాక్షి, చెన్నై: అసెంబ్లీలో ఓ ఆసక్తికర అంశాన్ని మాజీ మంత్రి , అన్నాడీఎంకే విప్ ఎస్పీ వేలుమణి మంగళవారం తెర మీదకు తెచ్చారు. క్రీడల శాఖకు సంబంధించి చేపట్టిన చర్చలో ఆయన ఐపీఎల్ టికెట్లు ఇప్పించాలని క్రీడాశాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌ను కోరారు. పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం ఇది వరకు ఎమ్మెల్యేలు అందరికీ ఐపీఎల్ టికెట్లు కొని ఇచ్చామని వివరించారు. ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లు చూసేందుకు ప్రభుత్వం టికెట్లు కొని ఎమ్మెల్యేకు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఘాటుగా స్పందించారు. చెన్నైలో గత నాలుగేళ్లుగా ఐపీఎల్ మ్యాచ్‌లే జరగనప్పుడు, టికెట్లు కొని ఎవరికి ఇచ్చారని సూటిగా ప్రశ్నించారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులు కంగుతిన్నారు. అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## న్యూస్‌రీల్

### ఆస్పత్రిలో చేరిన మంత్రి కయల్‌వెలి సెల్వరాజ్


కయల్ వెలి సెల్వరాజ్

సాక్షి, చెన్నై: రాష్ట్ర ఆదిద్రావిడ సంక్షేమ శాఖమంత్రి కయల్ వెలి సెల్వరాజ్ తీవ్ర జ్వరం బారిన పడ్డారు. ఆమె చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంత్రి కయల్ వెలి సెల్వరాజ్ అడయార్‌లోని ఇంట్లో సోమవారం రాత్రి అస్వస్థతకు లోనయ్యారు. ఆమె హఠాత్తుగా తీవ్ర జ్వరం బారినపడడంతో కుటుంబీకులు, భద్రతా సిబ్బంది రాజీవ్‌గాంధీ జీహెచ్‌కు తరలించారు. ఆమెకు వైద్యులు పరీక్షలు చేశారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్య పరీక్షల్లో తేలింది. ఈ మేరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు.

### ఛత్రపతి శివాజీ విగ్రహం ధ్వంసం – ఇద్దరు అరెస్టు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కన్యాకుమారి జిల్లా కుళిత్తురై, మేల్‌పురం సమీపం వట్టవిలైలో తోటత్తు మఠంలో నవనీత కృష్ణన్ ఆలయం ఉంది. ఈ ఆలయం సమీపంలో ఛత్రపతి శివాజీ 9 అడుగుల విగ్రహం ఉంది. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీని గురించి సమాచారం తెలుసుకున్న ఆలయ నిర్వాహకులు, హిందూ పరిరక్షణ సంఘం సభ్యులు అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఆలయం లోపల ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను తనిఖీ చేయగా మేల్‌పురానికి చెందిన ఎడ్విన్‌రాజ్, చంద్రావిలైకి చెందిన ప్రదీప్ దాడికి పాల్పడినట్లు తేలడంతో వారిని అరెస్టు చేశారు.

### చెన్నై విమానాశ్రయం నుంచి మార్చిలో 17 లక్షల మంది ప్రయాణం

కొరుక్కుపేట: వేసవి సెలవుల నేపథ్యంలో విదేశాలకు, దేశంలోని ప్రధాన నగరాలకు వెళ్లే వారి సంఖ్య చెన్నైలో క్రమంగా పెరుగుతోంది. చెన్నై విమానాశ్రయం నుంచి గత నెల (మార్చి)లో 17 లక్షల 31 వేల 770 మంది ప్రయాణించారు. వీరిలో 12,89,995 మంది స్వదేశీ ప్రయాణికులు, 4,41,775 మంది విదేశీ ప్రయాణికులు ఉన్నారు. గత నెలలో 9,413 దేశీయ విమానాలు, 2,609 అంతర్జాతీయ విమానాలు నడిపినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు మంగళవారం ప్రకటించారు.

### వైభవంగా వసంతోత్సవాలు


విశేషాలంకరణలో అమ్మవారు

కొరుక్కుపేట: చెన్నై జార్జిటౌన్‌లోని మూడు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో మంగళవారం నుంచి శ్రీవాసవీ వసంతోత్సవాలు వైభవంగా ఆరంభం అయ్యాయి. ఈనెల 19 తేదీ ఈ వేడుకలు నిర్వహించున్నారు. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేపట్టారు. లలితా సహస్రనామ పారాయణ బృందం భక్తి అలరించింది.

### హత్యకేసులో నిందితుడికి యావజ్జీవం


విజయరామ్ (ఫైల్)

అన్నానగర్: తల్లి రెండో భర్తను హత్య చేసిన కుమారుడికి సోమవారం విల్లుపురం కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపంలోని గాంధీ నగర్‌కి చెందిన బాలుస్వామి(60) వెళ్లైయమ్మాల్‌కు రెండవ భర్త. అలాగే వెళ్లైయమ్మాల్‌కు మొదటి భర్త కుమారుడు విజయరామ్ (36). ఇతడికి వివా హమై భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా విజయరామ్‌ను విడిచి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో 2020 డిసెంబర్‌లో విజయరామ్ మద్యం తాగి ఇంటికొచ్చాడు. భార్య, బిడ్డను తనతో చేర్చాలని తల్లి వెళ్లైయమ్మాళ్, బాలుస్వామిని కోరాడు. ఈ విషయంపై బాలుస్వామి, విజయరామ్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆవేశానికి గురైన విజయరామ్ ఇంట్లోని కొడవలితో బాలుస్వామి దాడి చేశాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో వెళ్లైయమ్మాళ్ తన కుమారుడు విజయరామ్‌పై ఉలుందూరుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విజయరామ్‌పై హత్యానేరం కింద అరెస్టు చేశారు. దీనికి సంబంధించి విల్లుపురం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. సోమవారం సాక్షుల ప్రాసిక్యూషన్ ముగిసిన తర్వాత న్యాయమూర్తి పూర్ణిమ నిందితుడు విజయరామ్‌కు యావజ్జీవ శిక్ష, రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

# ఆన్‌లైన్ పేకాట.. ఆడితే.. వేట!

ఆన్‌లైన్ రమ్మీ.. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఈ పదమే ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకుల నోట్లో ఎక్కువగా నలిగిందంటే అతిశయోక్తి కాదేమో. సామాన్యుల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ఈ ఆటకు బానిసై అప్పులపాలైన వారు ఎందరో..! ఇక రుణఒత్తిడి భరించలేక బలవన్మరణాలకు పాల్పడిన వారూ పదుల సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అనేక తర్జనభర్జనలు, విమర్శలు, ప్రతి విమర్శల తర్వాత ఎట్టకేలకూ ఆన్‌లైన్ రమ్మీ నిషేధం బిల్లుకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదం తెలిపారు. మంగళవారం ఈ మేరకు గెజిట్‌లో ప్రచురించడంతో ఇకపై ఆన్‌లైన్ పేకాట ఆడితే.. తాటతీస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.




- గెజిట్‌లో ఆన్‌లైన్ రమ్మీ నిషేధ చట్టం
- నేరం రుజువైతే కఠిన శిక్షలు
- మూడు రకాలుగా కేసుల విభజన
- ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం
- కమిషన్ చైర్మన్, సభ్యుల ఎంపికపై సీఎం స్టాలిన్ కసరత్తు

సాక్షి, చెన్నై: ఆన్‌లైన్ రమ్మీని నిషేధిస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని ప్రభుత్వ గెజిట్‌లో మంగళవారం ప్రకటించారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదంతో న్యాయశాఖ కార్యదర్శి గోపి రవికుమార్ సంతకంతో ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ, సమగ్ర వివరాలను,శిక్షలు, కమిషన్ ఏర్పాటు గురించి గెజిట్‌లో వివరించారు. దీంతో కమిషన్ చైర్మన్, సభ్యుల ఎంపిక చేసేందుకు సీఎం ఎంకే స్టాలిన్ కార్యాచరమ ప్రారంభించారు.

**నేపథ్యం ఇదీ..**

రాష్ట్రంలో ఆన్‌లైన్ రమ్మీకి బానిసై, అప్పుల పాలై బలవన్మరణాలకు పాల్పడిన వారి సంఖ్య తాజాగా 43కు చేరిన విషయం తెలిసిందే. ఈ గేమింగ్‌ను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకొచ్చిన చట్టాన్ని గవర్నర్ ఆర్‌ఎన్ రవి తిరస్కరించారు. దీంతో గత నెల మరోసారి అసెంబ్లీ వేదికగా చట్టానికి మెరుగులు దిద్ది సభ ఆమోదంతో రాజ్‌భవన్‌కు పంపించారు. దీనిని కూడా ఆమోదించేందుకు గవర్నర్ కాలయాపన చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించింది. గవర్నర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం తీసుకురావడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అదే సమయంలో ఈ చట్టాన్ని ఆమోదిస్తూ గవర్నర్ ఆర్‌ఎన్‌రవి నిర్ణయం తీసుకున్నారు.

**గెజిట్‌లో చట్టం వివరాలు..**

ఈ చట్టంలోని సమగ్ర వివరాలను 13 పేజీలలో పొందు పరిచారు. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి బెట్టింగ్ గేమింగ్‌లపై రాష్ట్రంలో నిషేధించినట్లు వివరించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన పక్షంలో మూడు కేటగిరీలుగా విభజించి శిక్ష విధించనున్నారు. గేమ్ ఆడే వారు, ప్రకటనలు చేసే వారు, నిర్వాహకులుగా విభజించి అందరికీ వివిధ రకాల శిక్షలను, జరిమానాలను విధించనున్నారు. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు కానుంది. ఈ కమిషన్‌కు చైర్మన్, సభ్యులు ఉంటారు. అలాగే ఈ గేమింగ్ వ్యవహారలపై సైబర్ క్రైం నిఘా ఉంచనుంది. తమిళనాడులో ఈ గేమింగ్ నిషేధం వివరాలను సంబంధిత సంస్థలకు తొలుత నోటీసుల ద్వారా తెలియజేయనున్నారు. అప్పటికీ ఆ యా సంస్థలు గేమింగ్‌లు నిర్వహిస్తే తొలుత సైబర్ క్రైం కొరడా ఝుళిపిస్తుంది. అలాగే సమగ్ర వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిషన్‌కు అందజేస్తుంది. ఈ కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉన్న అన్ని అధికారాలూ ఉంటాయి. తొలిసారిగా గేమ్ ఆడి పట్టుబడే వారికి 3 నెలలు జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తారు. ఫేస్‌బుక్ వంటి వ్యక్తిగత సామాజిక మాధ్యమాల పేజీల్లోకి ప్రకటనల రూపంలో నిషేధిత బెట్టింగ్ గేమింగ్ సమాచారం పంపిన పక్షంలో, ఆ ప్రకటనదారుకు, నిర్వహకులకు ఏడాది జైలు శిక్ష, రూ. 5 లక్ష వరకు జరిమానా విధించనున్నారు. మళ్లీ మళ్లీ పట్టుబడిన పక్షంలో ఐదేళ్ల వరకు జైలు, రూ. 20 లక్షల వరకు జరిమానా విధించే విధంగా కఠినంగా వ్యవహరించనున్నారు.

**కమిషన్ ఏర్పాటుకు కార్యాచరణ**

ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని మంగళవారం సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు, చట్ట నిపుణులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలతో పదవీ విరమణ పొందిన సీనియర్ ఐఏఎస్, ఐజీ స్థాయి పోలీసు అధికారులు, ఆన్‌లైన్ రంగంలోని నిపుణులను ఈ కమిషన్‌లో సభ్యులుగా నియమించనున్నారు. ఈ జాబితా బుధవారం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ కమిషన్ ఏర్పాటుతో ఆన్‌లైన్ రమ్మీ నిషేధ చట్టం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చినట్లే. గేమింగ్‌లను క్రమబద్ధీకరించే విధంగా ఈ కమిషన్ కొరడా ఝుళిపించనుంది. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించేందుకు ఆన్‌లైన్ రమ్మీ తదితర బెట్టింగ్ గేమింగ్‌ల యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

### చైనా అమ్మాయి.. తమిళ అబ్బాయి!



అన్నానగర్: కడలూరు యువకుడు చైనా యువతిని సోమవారం తమిళ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాడు. స్నేహితులు, బంధువులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. వివరాలు.. కడలూరు మంజకుప్పం పశ్చిమ వేణుగోపాలపురానికి చెందిన లక్ష్మణన్ కుమారుడు బాలచందర్. ఇతనికి న్యూజిలాండ్‌లో చైనాకు చెందిన యిజియోవుకి సోషల్ నెట్‌వర్కింగ్ యాప్ ద్వారా పరిచయమైంది. ఈ పరిచయం చివరికి ప్రేమగా మారింది. ఆ తర్వాత ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. వారిద్దరూ తమ తల్లిదండ్రులను తమ అంగీకారాన్ని కోరారు. వీరి ప్రేమకు ఇరు వర్గాల తల్లిదండ్రులు కూడా పచ్చజెండా ఊపారు. సంతోషంగా ఉన్న జంట అధికారికంగా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమిళ సంస్కృతి ప్రకారం కడలూరు ముత్తునగర్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో వీరి వివాహం సోమవారం జరిగింది. తమిళ సంప్రదాయం ప్రకారం, వరుడు సిల్క్ సూట్, చొక్కా ధరించి, వధువు పట్టుచీర, నగలు ధరించి పెళ్లి పీటలపై కూర్చున్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ వరుడు, వధువు మెడలో తాళి కట్టారు. అనంతరం బంధువులు, స్నేహితులు వారిని అభినందించారు.

### హత్య కేసులో నిందితుల లొంగుబాటు

అన్నానగర్: చెన్నైలోని పోరూర్ రామచంద్ర ఆసుపత్రి సమీపంలో ఈనెల 8వ తేదీన రౌడీ వినోద్ హత్యకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో వినోద్ హత్య కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులు మంగళవారం తూత్తుకుడి కోర్టులో లొంగిపోయారు. వారిలో కాంచీపురం అన్నై ఇందిరానగర్‌కు చెందిన అజిత్‌కుమార్( 23), నెల్లై జిల్లా తిరుకురుంకుడి కమాండ్ హౌస్‌కు చెందిన నవీన్‌కుమార్ (23), చెన్నై పట్టినంబాక్కం శ్రీనివాసపురానికి చెందిన యువీన్ కుమార్ (25), మణికంఠన్ (20) ఉన్నారు. కాగా వారిని 15 రోజుల రిమాండ్ నిమిత్తం తూత్తుకుడి జిల్లా జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## 200 మంది రెవెన్యూ అధికారుల హోదా తగ్గింపు



సాక్షి, చెన్నై: డిగ్రీ విద్యార్హత లేని కారణంగా 200 మంది ఆర్డీఓలు, తహసీల్దార్‌ల హోదాను తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఉన్న విద్యార్హతల మేరకు రెవెన్యూ శాఖలో చేరి క్రమంగా పదోన్నతులు పొందిన వారు అధిక శాతం మంది ఉన్నారు. అయితే డిగ్రీలు కూడా పూర్తి చేయని వీరు ఆర్‌డీఓలుగా, తహసీల్దార్లు కీలక పదవుల్లో ఉండడాన్ని వ్యతిరేకిస్తూ పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. అదే సమయంలో రెవెన్యూ శాఖలో పదోన్నతులకు అర్హులైన వారు డిగ్రీలు పూర్తి చేసి ఉండాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌కు 2009లో కోర్టు స్టే విధించింది. దీంతో డిగ్రీలు కూడా చదవని వారు పదోన్నతులతో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు అయ్యారు. 15 ఏళ్లుగా ఈకేసు కోర్టులో విచారణలో ఉంది. 2019లో ప్రభుత్వం జారీ చేసిన డిగ్రీ తప్పనిసరి ఉత్తర్వులకు అనుకూలంగా కోర్ట తీర్పు ఇచ్చింది. పదోన్నతులకు డిగ్రీలు అవశ్యం అని కోర్టు సైతం స్పష్టం చేసింది. కోర్టులో పిటిషన్ విచారణలో ఉన్న సమయంలో డిగ్రీలు కూడా పొందని వారు ఆర్‌డీఓలుగా, తహసీల్దారులుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరందరి హోదాను తగ్గించే విధంగా, కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 200 మందిని గుర్తించి వారి హోదాను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌డీఓలుగా ఉన్న వారు తహసీల్దార్‌లుగా, తహసీల్దార్‌లుగా ఉన్న సహాయ తహసీల్దారులుగా మారుస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## ఎంఎన్‌పీలకు మళ్లీ ఉద్యోగాలు

- సుప్రీం కోర్టు కీలక తీర్పు
- 13,500 మందిలో చిగురించిన ఆశలు
- దశాబ్ద కాలం పాటు న్యాయ పోరాటంలో గెలుపు


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు (ఫైల్)

సాక్షి, చెన్నై: మక్కల్ నల పనియాలర్గల్(ఎంఎన్‌పీ–ప్రజా సంక్షేమ కార్మికులు) మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. దీంతో 13,500 మంది కార్మికులలో ఆశలు చిగురించాయి. దశబ్ద కాలంగా జరిగిన న్యాయ పోరాటంలో తమకు గెలుపు దక్కడంతో ఈ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా 1989లో అప్పటి సీఎం ఎం. కరుణానిధి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం కింద 12,617 గ్రామ పంచాయతీలలో విద్యా వంతులైన యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రజా సంక్షేమ కార్మికులను నియమించారు. అయితే 1991లో అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఎంఎన్‌పీ విధానాన్ని రద్దు చేసింది. 1996లో మళ్లీ అధికారంలోకి వచ్చిన డీఎంకే ఈ విధానాన్ని మళ్లీ పునరుద్ధరించింది. 2001లో మళ్లీ అన్నాడీఎంకే రద్దు చేయగా, 2006లో మళ్లీ డీఎంకే అమల్లోకి తెచ్చింది. అయితే 2011లో 13,500 మంది ఎంఎన్‌పీలను తొలగిస్తూ అప్పటి సీఎం జయలలిత నిర్ణయం తీసుకున్నారు. దీంతో రోడ్డున పడ్డ కార్మికులు న్యాయ పోరాటం చేస్తూ వస్తున్నారు. 2014లో మద్రాసు హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే దీనిని అన్నాడీఎంకే పాలకులు అమలు చేయకపోగా సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్లారు. దశాబ్ద కాలానికి పైగా న్యాయ పోరాటం సాగుతూ వచ్చింది. ఎట్టకేలకు విచారణ ముగియడంతో మంగళవారం సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. ఈ కార్మికులకు మళ్లీ ఉద్యోగాలు కేటాయించాల్సిందేనని ప్రభుత్వాన్ని న్యాయమూర్తులు ఆదేశించారు. అధికారాలు మారినా, పథకం కొనసాగుతోందని పేర్కొంటూ, ఉద్యోగ కల్పన ప్రభుత్వ బాధ్యతగా న్యాయమూర్తులు సూచించారు. దీంతో ఎంఎన్‌పీలలో ఆనందం వెల్లవిరిసింది. కొత్త ఆశలు చిగురించాయి. తమకు మళ్లీ ఉద్యోగాలు దక్కుతాయన్న ఎదురు చూపుల్లో ఉన్నారు. కాగా, ఈ సారి తమకు అధిక జీతం ఇచ్చి ఉద్యోగాలను పునరుద్ధరించాలని ఎంఎన్‌పీల సంఘం నేత చెల్ల పాండియన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న తమ జీవితాలలో వెలుగు నింపాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఎంఎన్‌పీలకు అనుకూలంగా గతంలో సీఎం స్టాలిన్ ప్రకటన చేసిన నేపథ్యంలో కోర్టు తీర్పుకు అనుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

## ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి పచ్చ జెండా


ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ (ఫైల్ )

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ నిర్వహణకు సుప్రీంకోర్టు పచ్చ జెండా ఊపింది. హైకోర్టు ఇది వరకు ఇచ్చిన తీర్పును ధ్రువీకరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ అప్పీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తోసిపుచ్చారు. వివరాలు.. గత ఏడాది రాష్ట్రంలో 50 కు పైగా ప్రాంతాలలో ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో భారీ ర్యాలీలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో కోయంబత్తూరులో పేలుడుతో పాటు ముష్కరుల కుట్రలు వెలుగులోకి రావడంతో పోలీసులు అనుమతి నిరాకరించారు. చివరకు ఈ వ్యవహారం కోర్టుకు చేరింది. బహిరంగ ప్రదేశాలలోనే కాకుండా ప్రహరీతో కూడిన మైదానాల్లో ర్యాలీ నిర్వహించుకోవాలని తొలుత సింగిల్ బెంచ్ ఆదేశించింది. దీనిని ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు వ్యతిరేకించాయి. ఫిబ్రవరిలో మళ్లీ కోర్టు తలుపు తట్టారు. ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ 45 అప్పీల్ పిటిషన్లు హైకోర్టులో దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల విచారణ న్యాయమూర్తులు మహాదేవన్, మహ్మద్ సాధిక్ నేతృత్వంలోని ద్విసభ్య బెంచ్ విచారించింది. మైదానాల్లో మాత్రమే ర్యాలీ నిర్వహించుకోవాలని ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి రూట్ క్లియర్ చేస్తూ, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కఠిన నిబంధనలు, కట్టుబాట్లతో ర్యాలీ నిర్వహించేందుకు సంబంధించిన అనుమతులపై పోలీసులు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, ర్యాలీకి భద్రత కల్పించాలని కోర్టు ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవహారాలలో కోర్టు జోక్యం పెరుగుతోందని పేర్కొంటూ, హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని కోరారు. ఈ అప్పీల్ పిటిషన్‌పై గత నెలాఖరులో విచారణను సుప్రీం కోర్టు ముగించింది. మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈమేరకు తీర్పు వెలువరించారు. ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీకి పచ్చజెండా ఊపారు. తమిళనాడు ప్రభుత్వ అప్పీలు పిటిషన్‌ను కొట్టివేశారు. ఈ ర్యాలీకి పోలీసులు గట్టి భద్రత కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు రాష్ట్రంలో ఈసారి భారీ ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

## మూల్యాంకనంలో తప్పులు దొర్లితే కఠిన చర్యలు



తిరువొత్తియూరు: ప్లస్– 2, ప్లస్– 1 పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు జరిగితే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని పరీక్షల నిర్వహణ విభాగం అధికారులు మంగళవారం హెచ్చరించారు. వివరాలు.. రాష్ట్రంలో గత నెల 13, 14వ తేదీల్లో ప్రారంభమైన పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3, 5వ తేదీల్లో ముగిశాయి. మొత్తం 17 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరి జవాబు పత్రాలను 40 కేంద్రాలలో మూల్యాంకనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. 10వ తేదీ నుంచి జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఈ పనులు ఏప్రిల్ 24కి పూర్తవుతాయి. తరువాత మే 5వ తేదీన పరీక్ష ఫలితాలు వెలువడనున్నాయి. కాగా పరీక్ష విభాగానికి చెందిన ఓ ఉన్నాతాధికారి మాట్లాడుతూ.. జవాబు పత్రాలను కరెక్షన్ చేసే సమయంలో పొరపాట్లు జరిగినా, మార్కులను లెక్కించడంలో తప్పులు చోటు చేసుకున్నా.. సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### కళాక్షేత్రలో విచారణ ముమ్మరం

సాక్షి, చెన్నై: కళాక్షేత్రలో మానవ హక్కుల కమిషన్ బృందం విచారణ చేపట్టింది. మంగళవారం కొన్ని గంటల పాటు ఈ విచారణ సాగింది. మానవ హక్కుల కమిషన్ ఐజీ ఆదేశాలతో డీఎస్పీలు కుమార్, సుందరేషన్ కళాక్షేత్ర డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లను ప్రశ్నించి వివరాలు సేకరించినట్లు తెలిసింది. అలాగే కళాక్షేత్రాలోని విద్యార్థులను వేర్వేరుగా విచారించేందుకు ఈ బృందం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా, ఈ కేసులో అరెస్టయిన హరి పద్మన్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను సైదాపేట కోర్టు తోసి పుచ్చడం గమనార్హం.

## కేసులు పెరిగితే.. ఇంటింటా కరోనా పరీక్షలు

- అసెంబ్లీలో కరోనా నియంత్రణపై చర్చ
- కట్టడికి చర్యలు చేపట్టాలని పళనిస్వామి డిమాండ్
- కేసులు తీవ్రమైతేనే ఆంక్షలు
- మంత్రి సుబ్రమణియన్ స్పష్టీకరణ


అసెంబ్లీ

సాక్షి, చెన్నై: అసెంబ్లీలో మంగళవారం కరోనా నియంత్రణ అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. ఇంటింటా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేపట్టాలని ప్రధాన ప్రతి పక్ష నేత పళని స్వామి పట్టుబట్టారు. కట్టడి చర్యలు విస్తృతం చేయాలని కోరారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ సమాధానం ఇస్తూ, ఆందోళన చెందాల్సినంతగా రాష్ట్రంలో కేసులు పెరగలేదని, పరిస్థితి తీవ్రమైతే ఇంటింటా కరోనా పరీక్షలు చేపడుతామని స్పష్టం చేశారు. వివరాలు.. అసెంబ్లీ సమావేశాలలో భాగంగా మంగళవారం క్రీడలు, యువజ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖలకు నిధుల కేటాయింపులపై చర్చ జరిగింది. క్రీడాశాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్, చేనేత, జౌళి శాఖ మంత్రి గాంధీ ముందుగా సీఎం స్టాలిన్ ఆశీస్సులు అందుకుని అసెంబ్లీకి వచ్చి తమ శాఖకు కేటాయించిన నిధుల వివరాలను వెల్లడించారు. చేనేత చర్చలో అన్నాడీఎంకే, డీఎంకే సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటు చేసుకుంది. ఉచిత దోవతి, చీరల పంపిణీ విషయంపై పరస్పరం విమర్శలు చేసుకున్నారు. సభలో గందరగోళం నెలకొనడంతో సభ్యులను స్పీకర్ అప్పావు బుజ్జగించాల్సి వచ్చింది. ముందుగా ప్రశ్నోత్తరాల అనంతరం ప్రధాన ప్రతి పక్ష నేత పళనిస్వామి పెరుగుతున్న కరోనా కేసులను గుర్తు చేస్తూ, కట్టడే లక్ష్యంగా చర్చకు పట్టుబట్టారు.

**పడకేసిన పల్లెలు..**

రాష్ట్రంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఇంత వరకు కట్టడి లక్ష్యంగా ఎలాంటి చర్యలు చేపట్టక పోగా, ఆరోగ్యశాఖ మంత్రి రోజుకో వ్యాఖ్య చేస్తున్నారని పళని స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ప్రజలు తీవ్ర జ్వరాలతో బాధ పడుతున్నారని, వారికి సరైన వైద్యం అందడం లేదని ధ్వజమెత్తారు. కరోనా పెరుగుతున్నా, మరింత పెరిగినప్పుడే కట్టుబాట్లు అని మంత్రి వ్యాఖ్యలు చేయడం విచారకరంగా పేర్కొన్నారు. తక్షణం స్థానిక సంస్థల ప్రతినిధులు, వైద్య అధికారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేయాలని, ఆర్‌టీపీసీఆర్ పరిశోధనను ఇంటింటా నిర్వహించాలని కోరారు. అదే సమయంలో కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత సెల్వ పెరుంతొగై జోక్యం చేసుకుని పళణిస్వామిపై ఎదురుదాడికి దిగారు. గతంలో తమరు అధికారంలో ఉన్నప్పుడు ఇంటింటా పరిశోధనలు చేశారా? అని ప్రశ్నించారు. అలాగే గతంలో అన్నాడీఎంకే పాలకులు వ్యవహరించిన తీరును దుయ్యబట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్‌తో అన్నాడీఎంకే సభ్యులు వాగ్వాదానికి దిగారు. సెల్వ పెరుంతొగై చేసిన కొన్ని వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలను స్పీకర్ తొలగించారు. చివరకు ఆరోగ్యమంత్రి ఎం. సుబ్రమణియన్ సమాధానం ఇస్తూ, ప్రధాన ప్రతి పక్షం ఆందోళన చెందుతున్నట్టుగా రాష్ట్రంలో కరోనా కేసులు పెరగ లేదని వివరించారు. కేసులు పెరిగితే చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచామన్నారు. ప్రస్తుతం కరోనాతో ఐసీయూలో, వెంటిలేటర్‌పై చికిత్సలో ఎవరూ లేదన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలను మాస్కులు ధరించాలని హెచ్చరిస్తూనే ఉన్నామన్నారు. కేసులు మరింతగా పెరిగిన పక్షంలో ఇంటింటా కరోనా పరీక్షలు చేస్తామని, పూర్తిస్థాయిలో కట్టుబాట్లు విధిస్తామని తేల్చిచెప్పారు.

**చెన్నై సూపర్ కింగ్స్‌ను నిషేధించాలి..**

అసెంబ్లీలో మధ్యాహ్నం ఆసక్తికర అంశాన్ని పీఎంకే సభ్యుడు వెంకటేశ్వరన్ తెర మీదకు తెచ్చారు. ఐపీఎల్ మ్యాచ్‌లను గుర్తు చేస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టును తమిళనాడులో నిషేధించే విధంగా సభలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. చెన్నై సూపర్ కింగ్స్ తమిళనాడుకు చెందిన జట్టుగా పేర్కొంటూ వ్యాపార రీత్యా ఆ జట్టు యాజమాన్యం, ప్రకటనల దారులు భారీ లాభాలు గడిస్తున్నారని వివరించారు. తమిళనాడులోని క్రికెట్ అభిమానాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారేగానీ, తమిళనాడులో నిష్ణాతులైన క్రికెటర్లకు ఆ జట్టులో అవకాశం కల్పించ లేదని పేర్కొన్నారు. పేరుకే చెన్నై సూపర్ కింగ్స్ జట్టుగా పేర్కొన్నా.. అందులో తమిళనాడు క్రీడాకారుల కన్నా, ఇతర రాష్ట్రాలు, విదేశీ క్రీడాకారులే ఉన్నారని వివరించారు. తమిళనాడులో క్రికెట్‌లో రాణిస్తున్న క్రీడాకారులు ఎందరో ఉన్నారని, వారికి అవకాశం ఇవ్వక పోవడం శోచనీయమని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్షాలు స్పందించకపోవడం గమనార్హం.

## క్లుప్తంగా

### కోయంబేడుకు 120 టన్నుల పుచ్చకాయలు

– కిలో రూ.7కే విక్రయం

కొరుక్కుపేట: వేసవికాలంలో పుచ్చకాయల విక్రయాలు నగరంలో ఊపందుకున్నాయి. ఈక్రమంలో కోయంబేడు మార్కెట్‌కు రోజుకు 120 టన్నుల పుచ్చకాయలు వచ్చి చేరుతున్నాయి. ప్రసుతం వేసవి తాపం ఎక్కువైంది. శరీరంలోని వేడిని తగ్గించుకోవడానికి పండ్ల రసాలు, కీర, దోసకాయలు, పుచ్చకాయలు తీసుకుంటూ వేడితాపాన్ని తీర్చుకుంటున్నారు. వేసవిలో పుచ్చకాయలు తినేందుకు ప్రజలు ఇష్టపడుతుంటారు. దీంతో కోయంబేడు మార్కెట్‌కు టన్నుల కొద్దీ పుచ్చకాయులు వచ్చి చేరుతుండడంతోపాటు అదేస్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. మార్కెట్లో కేవలం రూ.7లకే విక్రయాలజరగ్గా, చిల్లర వ్యాపారులు కిలో రూ.10 వరకు విక్రయిస్తున్నారు.

### న్యాయం చేయాలని వితంతువు ధర్నా


ధర్నా చేస్తున్న వితంతువు

అన్నానగర్: కళ్లకురిచ్చి ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం వితంతువు ఆందోళన చేపట్టింది. కళ్లకురిచ్చి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి ఆవిన్ పాల పార్లర్ ఎదుట సోమవారం సాయంత్రం ఓ మహిళ ఏడుస్తూ కనిపించింది. ఆమెను ప్రశ్నించగా తాను వితంతువునని అధికారిక అనుమతి పొంది ఇక్కడ ఆవిన్ పార్లర్ నిర్వహిస్తున్నానని తెలిపింది. సోమవారం పబ్లిక్ వర్క్స్ అధికారులమంటూ కొందరు వచ్చి తన పార్లర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, దుకాణం మూసేశారని, పార్లర్‌ను మరొకరికి ఇవ్వడానికే ఖాళీ చేయమంటున్నారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టినట్టు తెలిపింది.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొరుక్కుపేట: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని పోలీసుల అధికారులు సూచించారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ గత ఏడాది ఆగస్టులో మత్తు రహిత తమిళనాడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా చెన్నై నగర పోలీసు కమిషనర్ శంకర్ జివాల్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలనకు ఆదేశించారు. వివిధ నేరాల నిరోధక చర్యలతో పాటు ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు సహా మొత్తం 182 ప్రాంతాల్లో పోలీస్ ఎయిడ్ యాప్ వినియోగంపై మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోలీస్ కమిషనర్, అదనపు పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఒకరోజు అవగాహన కార్యక్రమంలో చెన్నై నగరంలోని 51 పాఠశాలలు, 15 కళాశాలలు, 116 బహిరంగ సభ స్థలాలతో ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో 2,611 మంది పాఠశాల విద్యార్థులు, 578 మంది కళాశాల విద్యార్థులు, 2,485 మంది ప్రజలు సహా 5,674 మంది పాల్గొన్నారు. అలాగే పోలీస్ హెల్ప్ సెల్‌ఫోన్ యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కరపత్రాలను అందించి ఈ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో, ఎలా ఉపయోగించాలో కళాశాల ప్రొఫెసర్లు వివరించారు. దీంతో మహిళలు, విద్యార్థినులు తమ సెల్‌ఫోన్‌లో పోలీస్ హెల్ప్ యాప్ డౌన్ లోడ్ చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# రూ.18 కోట్ల వ్యయంతో కొత్త జైలు

• జైళ్ల శాఖ డీఐజీ మురుగేషన్


తిరువళ్లూరులోని సబ్‌జైలు తనిఖీ చేసి వస్తున్న డీఐజీ మురుగేషన్

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా పుదుమావిలంగై ప్రాంతంలో రూ.18 కోట్ల వ్యయంతో కొత్త జైలును నిర్మించనున్నట్టు జైళ్లశాఖ డీఐజీ మురుగేషన్ తెలిపారు. తిరువళ్లూరులోని సబ్‌జైలును జైల్లశాఖ డీఐజీ మురుగేషన్ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే ఆహారం నాణ్యతగా ఉందా లేదా అనే వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల వద్ద వారి సమస్యలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఖైదీల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆహారం నాణ్యతగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఖైదీలను చూడడానికి వచ్చే న్యాయవాదులు, విజిటర్స్ ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే రావాలని కోరారు. గాయాలతో వచ్చే ఖైదీలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరువళ్లూరు సబ్‌జైలు పనితీరు సంతృప్తినిచ్చినట్టు తెలిపారు. తిరువళ్లూరు జిల్లా పుదుమావిలంగైలో రూ.18 కోట్లతో నూతన జైలును నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లను ముమ్మరం చేసినట్టు తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. తిరువళ్లూరు సబ్‌జైలు సూపరింటెండెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# దళారులకు అప్పగిస్తే కొనుగోలు రద్దు

తిరువళ్లూరు: పొరుగు రాష్ట్రాలకు చెందిన వరిని తమిళనాడు వరి కొనుగోలు ప్రత్యక్ష కేంద్రాల్లో అమ్ముకోవడానికి జిల్లాకు చెందిన రైతులు తమ పట్టా చిట్టాలను దళారులకు అప్పగించినట్టు నిర్ధారణ అయితే సంబంధిత రైతు నుంచి రెండేళ్ల వరి కొనుగోలును రద్దు చేస్తామని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా కేఎంఎస్2022–23 రకం వరి 24,342 హెక్టార్లలో సాగులో ఉంది. ప్రస్తుతం వరి కోత ప్రారంభమైన నేపథ్యంలో హెక్టారుకు 6 మెట్రిక్ టన్నుల చొప్పున లక్షా 46వేల 52 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వీటిలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వరి ప్రత్యక్ష కొనుగోలు కేంద్రానికి 59వేల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉండడంతో ఎనిమిది యూనియన్‌లలో 48 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి కొనుగోలుకు సిద్ధంగా ఉంచినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం సన్నరకం వరికి క్వింటాల్‌కు రూ.2,160, సాధారణ రకం వరికి రూ.2,115 ప్రకటించింది. వరిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి పట్టాచిట్టా అడంగల్ తప్పనిసరిగ్గా సమర్పించాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో దళారుల ప్రమేయం పెరిగే అవకాశం ఉండడంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. దళారులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

# సభ్యత్వ నమోదుకు కృషిచేయాలి


పార్టీ శ్రేణులకు నమోదు పత్రాలు అందజేస్తున్న రమణ

పళ్లిపట్టు: అన్నాడీఎంకే యువత సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీమంత్రి బీవీ.రమణ పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శిగా ఎడపాడి పళనిస్వామి పదవి బాధ్యతలు స్వీకరించిన తరువాత పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులోభాగంగా రెండు కోట్ల మంది లక్ష్యంగా సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నారు. పళ్లిపట్టు యూనియన్ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి టీడీ.శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. ఇందులో ఆ పార్టీ తిరువళ్లూరు వెస్ట్ జిల్లా కార్యదర్శి, మాజీమంత్రి బీవీ.రమణ పాల్గొని కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదు పత్రాలు అందజేసి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాలు అన్నాడీఎంకే పాలనలోనే మెరుగుపడతాయని, సామాన్యులకోసం పరితపించే పార్టీ అన్నాడీఎంకే మాత్రమే అన్నారు. ఎంజీఆర్, అమ్మ అడుగుజాడల్లో పయనిస్తున్న ఎడపాడి పళనిస్వామి ముఖ్యమంత్రి పదవి చేపట్టి సంక్షేమ పథకాలు అందజేస్తారని అందుకోసం యువతను అధికసంఖ్యలో సభ్యులుగా చేర్పించాలన్నారు. జిల్లా కౌన్సిలర్ శాంతిప్రియ, మండల చైర్మన్ ఝాన్సి రాణి, తిరుత్తణి యూనియన్ కార్యదర్శి ఈఎస్.కండ్రిగ రవి, తిరుత్తణి పట్టణ కార్యదర్శి సౌందర్‌రాజన్, మండల కోశాధికారి చంద్రబాబు పాల్గొన్నారు.

## పోరంబోకు స్థలం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పళ్లిపట్టు: పోరంబోకు స్థలం ఆక్రమించి అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోరును మూసివేసిన వ్యక్తిపై కలెక్టర్ వద్ద గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పళ్లిపట్టు యూనియన్‌లోని తిరుమలరాజుపేట గ్రామంలో 200కు పైబడిన కుటుంబాలు ఉంటున్నాయి. అక్కడున్న అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో పోరంబోకు స్థలంలో ఆలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించారు. అయితే అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పోరంబోకు స్థలం ఆక్రమించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బోరును సైతం మూసివేసి విద్యుత్ స్తంభాలు నాటి స్థలం ఆక్రమించుకున్నట్లు, దీంతో అంగన్‌వాడీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసేందుకు వీలుగా గ్రామానికి చెందిన వంద మంది తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో తహసీల్దారు కార్యాలయంలో తనిఖీ కోసం ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరువళ్లూరు: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లడానికి జిల్లా వ్యాప్తంగా ప్రచార సమావేశాలను నిర్వహించాలని డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పిలుపు నిచ్చారు. తిరువళ్లూరులోని పెద్దకుప్పం, బజారువీధి, తేరడి ప్రాంతాల్లో డీఎంకే ఆధ్వర్యంలో ప్రచార సమావేశాలను నిర్వహించారు. సమావేశాలకు ముఖ్యఅతిథిగా డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ హాజరై ప్రసంగించారు. చంద్రన్ మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా పలు పథకాలను తీసుకొచ్చారని వివరించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాల విషయంలోనూ, లబ్ధిదారుల విషయంలోనూ రాజకీయం లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అయితే సంక్షేమ పథకాలను మరింత ప్రచారం నిర్వహించడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ నేతలు మోతీలాల్, కమలకన్నన్, పాన్‌పాండ్యన్, చిట్టిబాబు పాల్గొన్నారు.

# అత్యున్నత వైద్య సేవలకు కేంద్రంగా తమిళనాడు


రోగులు గీసిన పెయింటింగ్స్‌తో రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు పరంగా అత్యున్నత వైద్య సేవలకు కేంద్రంగా తమిళనాడు అవతరించి ఉందని సహకార, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాదర్శి జె. రాధాకృష్ణన్ తెలిపారు. రేల ఆస్పత్రిలో 20 మంది పార్కినన్స్ రోగులు తమలోని కళా నైపుణ్యాన్ని చాటే విధంగా గీసిన కాన్వాస్ పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం జె.రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్కిన్సన్స్ వ్యాధి పరిమితులను అధిగమించేందుకు రోగులకు సృజనాత్మక సాధనలు సహాయ పడుతాయని వివరించారు. ఈ వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తులకు శారీరక, భావోద్వేగ, అభిజ్ఞాన శ్రేయస్సుపై ప్రత్యేకించి కళలు సానుకూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఆ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ మహ్మద్ రేలా మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు పార్కినన్స్ రోగుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో కవితాలయ ప్రొడక్షన్స్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ పుష్పా కందస్వామి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కందస్వామి భరతన్ పాల్గొన్నారు.

# పొన్నియిన్ సెల్వన్‌కు పోటీ కాదు


యాతిసై చిత్ర యూనిట్

తమిళసినిమా: వీనస్ ఇన్ఫోటెయిన్‌మెంట్ పతాకంపై కేజీ.గణేశ్ నిర్మించిన చిత్రం యాతిసై. అందరూ కొత్త వారు నటించిన ఈ చిత్రానికి కథ, దర్శకత్వం బాధ్యతలను ధరణీ రాసేంద్రన్ నిర్వహించారు. చక్రవర్తి సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకుని ఈనెల 21న తెరపైకి రానుంది. దీని విడుదల హక్కులను శక్తి ఫిలింస్ శక్తివేల్ పొందడం విశేషం. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్‌ల్యాబ్‌లో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత కేజీ.గణేశ్ మాట్లాడుతూ దర్శకుడు కథ చెప్పగానే నచ్చడంతో ఈ చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమైనట్లు చెప్పారు. చిత్రం చాలా బాగా వచ్చిందని, ఇది సమష్టి కృషి అని అన్నారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ నిర్మాతకు కథ చెప్పగానే నచ్చిందని, మీ టీమ్ గురించి చెప్పండి అని అన్నారన్నారు. తన చిత్రానికి ప్రాణం తన టీమే అన్నారు. ఎడిటర్ మహేంద్రన్, సంగీతదర్శకుడు చక్రవర్తి లేకపోతే ఈ చిత్రం లేదన్నారు. ఆ తరువాత తనను నమ్మి ఒక్కొక్కరు తమ యూనిట్‌లోకి వచ్చారని చెప్పారు. షూటింగ్‌ను ఒక షెడ్యూల్ చేసి చూపించామని నిర్మాత చెప్పారన్నారు.ఆ తరువాతనే ఈ చిత్రం తెరకెక్కిందని చెప్పారు. ఇది 7వ శతాబ్దంలో పాండియరాజులపై పోరాడిన ఒక చిన్న గ్రామం ప్రజల ఇతివృత్తంతో తెరకెక్కించిన చిత్రం అని తెలిపారు. చిత్ర షూటింగ్‌కు ముందు రిహార్సల్ చేసినట్లు చెప్పారు. ఈ చిత్రం కోసం 25 మంది సహాయ దర్శకులు పనిచేశారని తెలిపారు. ఇది పొన్నియిన్ సెల్వన్ చిత్రానికి పోటీ కాదు కానీ ఇండియన్ సినిమాలో భారీ చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## కోలీవుడ్ టాక్స్

# భారతీరాజాతో నటించడానికి భయపడ్డా


తిరువిన్ కురల్ చిత్ర యూనిట్

తమిళసినిమా: దర్శకుడు భారతీరాజాతో కలిసి నటించడానికి భయపడ్డానని యువ నటుడు అరుళ్‌నిధి చెప్పారు. ఈయన తాజాగా కథానాయకుడిగా నటించిన చిత్రం తిరువిన్ కురల్. దర్శకుడు భారతీరాజా ప్రధాన పాత్రను పోషించిన ఇందులో నటి ఆద్మిక నాయకిగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ద్వారా హరీశ్‌ప్రభు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ నెల 14వ తేదీన విడుదలకు సిద్ధం అవుతోంది. కాగా ఇందులో నటుడు అరుళ్‌నిధి మూగ పాత్రలో నటించడం విశేషం. అంతేకాకుండా చెవులు కూడా సరిగా పని చేయవు. ఈ చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆయన తెలుపుతూ ఇది తండ్రి కొడుకుల అనుబంధాన్ని ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. దర్శకుడు భారతీరాజా తన తండ్రిగా నటించారన్నారు. ఆయన్ని తొలిసారి షూటింగ్‌లోనే చూశానని తెలిపారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించినా, ఆయనది పిల్లాడి మనస్తత్వం అని అన్నారు. భారతీరాజాతో కలిసి నటించడం మరిచిపోలేని అనుభవంగా పేర్కొన్నారు. ఇది ఎక్కువగా ఆస్పత్రిలో జరిగే సన్నివేశాలతో కూడిన కథా చిత్రమని చెప్పారు. చిత్రంలో ఈగో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. విలన్లు, పోరాటాలు అంటూ చిత్రం కుటుంబ నేపథ్యంలో భావోద్రేకాలతో సాగుతుందని తెలిపారు. తానీ చిత్రాన్ని అంగీకరించడానికి కథే కారణం అన్నారు. బృందావనం తరువాత తన కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రం ఇదేనని నటుడు అరుళ్‌నిధి పేర్కొన్నారు.

# వెండి తెరపైనా బిగ్‌బాస్ జోడీ

తమిళసినిమా: బిగ్‌బాస్‌లో పాపులర్ అయిన జంట డాన్స్‌మాస్టర్ అమీర్, నటి భవానీ. బిగ్‌బాస్ రియాలిటీ గేమ్ షోలో మంచి జోడీగా ప్రశంసలు అందుకున్న ఈ జంట ఇప్పుడు వెండితెరపై హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనికి అమీర్‌నే దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ నల్ల వీరప్పసామి ప్రొడక్షన్స్ పతాకంపై వి.బాలకృష్ణన్ నిర్మిస్తున్న ఈ చిత్రం మంగళవారం ఉదయం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. నిర్మాత ధనుంజయన్, దిండుగల్ లియోని, విజయ్ ఆదిరాజ్, నిరూప్, ప్రియాంక, షారిక్, రచిత, కిశోర్, సత్య, రియో సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. కాగా చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ వినోదభరితంగా సాగే ప్రేమకథా చిత్రంగా ఇది ఉంటుందన్నారు. ఈ తరం యువన జీవన విధానాన్ని ఆవిష్కరించే చిత్రంగా ఉంటుందన్నారు. ఇందులో నటుడు మన్సూర్ అలీఖాన్, గాయత్రి రఘురామ్, సురేశ్ చక్రవర్తి, సాధన, వీటీవీ.గణేశ్, అలీనా ముఖ్యపాత్రలను పోషిస్తున్నారని చెప్పారు. చిత్ర టైటిల్‌ను ప్రమోషన్ వీడియోను త్వరలోనే విడుదల చేయనున్నట్లు చెప్పారు.


నూతన చిత్ర ప్రారంభోత్సవం

# బాలీవుడ్‌లో హ్యాపీ


ప్రియమణి

తమిళసినిమా: బాలీవుడ్ తనను సగౌరవంగా ఆదరిస్తోందని నటి ప్రియమణి పేర్కొంది. పరుత్తివీరన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్న ఈ బ్యూటీ తమిళం, తెలుగు భాషల్లో ప్రముఖ కథానాయకిగా పేరు తెచ్చుకున్నారు. వివాహానంతరం చిన్న గ్యాప్ ఇచ్చి నటిగా రీఎంట్రీ ఇచ్చిన ఈమె నటనకు అవకాశం ఉన్న పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ది ఫ్యామిలీమెన్ వెబ్‌సీరీస్‌తో హిందీలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియమణికి ఇప్పుడు అక్కడ సినిమాల్లో మంచి అవకాశాలు వస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఒక నటిగా తనకు ఇంతకంటే ఏం కావాలని అన్నారు. నిజంగా ఇది తనకు మంచి కాలం అని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను నటిగా చాలా బిజీగా ఉన్నానని చెప్పారు. ముఖ్యంగా హిందీలో అజయ్‌దేవ్‌గన్, అర్జున్ రాంపాల్ వంటి నటుల సరసన నటించే అవకాశం కలిగిందని తెలిపారు. దక్షిణాది సాంకేతిక నిపుణులకు ప్రపంచస్థాయిలో మంచి గుర్తింపు వస్తోందని, ఇది నిజంగా సంతోషకరమైన విషయం అని ప్రియమణి పేర్కొన్నారు. కాగా ఈమె ప్రస్తుతం హిందీలో రెండు చిత్రాలు, కన్నడంలో ఒక చిత్రం, తమిళంలో రెండు చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. తమిళంలో నటిస్తున్న కొటేషన్ గ్యాంగ్ నిర్మాణంలో ఉంది. ఇక తెలుగు, తమిళంలో భాషల్లో నటించిన కస్టడీ చిత్రంలో ముఖ్య భూమికను పోషించారు.ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది.

# నయన్‌కు బదులుగా రాశీఖన్నా


రాశీఖన్నా

తమిళసినిమా: నయనతార పాత్రలో నటి రాశీఖన్నా నటించనున్నారా? కోలీవుడ్‌లో జరుగుతున్న తాజా ప్రచారం ఇదే. నయనతార పెళ్లి, సరోగసీ ద్వారా తల్లి కావడం వంటి కారణాల కారణంగా నటనకు చిన్న గ్యాప్ ఇచ్చారు. అయినప్పటికీ షారూఖ్‌ఖాన్ సరసన నటిస్తున్న జవాన్ చిత్ర షూటింగ్‌లో పాల్గొంటూనే ఉన్నారు. కాగా మళ్లీ నటిగా బిజీ అయ్యారు. ఇప్పుడు 9 చిత్రాలు చేతిలో ఉన్నాయి. అందులో వైనాట్ శశికాంత్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ఒకటి. హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రంగా తెరకెక్కనున్న ఇందులో నటుడు మాధవ్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు చిత్ర వర్గాలు ఇటీవలే ప్రకటించాయి. కాగా ఇప్పుడా చిత్రంలో అనివార్య కారణాల వల్ల నయనతార నటించడం లేదని, ఆమెకు బదులుగా రాశీఖన్నాను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. క్రికెట్ క్రీడ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ది టెస్ట్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. త్వరలోనే ఈ చిత్రం సెట్ పైకి వెళ్లనుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా రాశీఖన్నా ఇటీవల నటుడు కార్తీ సరసన నటించిన సర్దార్ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. అదేవిధంగా హిందీ వెబ్‌సీరీస్ ఫార్జీ చిత్రంలోనూ నటించింది. తరచూ గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్న రాశీఖన్నా ప్రస్తుతం తమిళంలో గీత రచయిత పా.విజయ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో కథానాయకిగా నటిస్తున్నారు. ఇందులో జీవా కథానాయకుడిగా నటిస్తుండగా అర్జున్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా వైనాట్ శశికాంత్ దర్శకత్వంలో నటించే లక్కీచాన్స్ వరించిందన్నది నిజంగా ఈ బ్యూటీకి లక్కే.

## క్లుప్తంగా

### ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

**అన్నానగర్:** ఈతమొళి సమీపంలో మంగళవారం ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. కన్యాకుమారి జిల్లా ఈతమొళి ఉత్తర సూరంగుడి వట్టక్కవిలకు చెందిన స్వయంబులింగం (38). ఓ ప్రైవేట్ టిలివిజన్ కంపెనీని నడుపుతున్నాడు. ఇతనికి భార్య లత (33), ఇద్దరు కుమారులు ఉన్నారు. లత అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమె నాగర్‌కోయిల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చింది. ఈ స్థితిలో సోమవారం లత అస్వస్థతకు గురైంది. వెంటనే భర్త స్వయంబులింగానికి ఫోన్ చేసింది. కానీ స్వయంబులింగం ఫోన్ తీయలేదని తెలుస్తోంది. కొద్దిసేపటి తర్వాత స్వయంబులింగం లతకు ఫోన్ చేయగా ఆమె తీయలేదు. ఆ తరువాత, అతను తన బంధువులలో ఒకరిని ఇంటికి వెళ్లమని అడిగాడు. వెళ్లి చూసేసరికి లోపలివైపు డోర్ లాక్ చేసి ఉంది. దీంతో అనుమానం వచ్చి ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూశారు. బెడ్ రూమ్‌లో లత ఉరి వేసుకుని ఉండడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే ఆమెని రక్షించి చికిత్స నిమిత్తం ఆచారిపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే లత మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఈతమొళి పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి లత మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కారు లోయలోపడి ఇద్దరు దుర్మరణం

**– ముగ్గురికి తీవ్రగాయాలు**

**అన్నానగర్:** కారు లోయలో పడి ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కున్నూరు పర్వత మార్గంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపం సెగుందపేట కులక్కరై వీధికి చెందిన సెంథిల్ (48). ఇతని భార్య పూంగావనం (35). సోమవారం వీరు తమ బంధువు సంపత్ (40), భార్య సత్యలక్ష్మి (35), అరుణగిరి (55)తో కలిసి నీలగిరి జిల్లా ఊటీకి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి 7 గంటలకు స్వగ్రామానికి బయలుదేరారు. కారును సెంథిల్ నడిపాడు. ఊటీ- మేట్టుపాళయం కొండ రోడ్డుపై రాత్రి 9 గంటల ప్రాంతంలో కూన్నూర్‌లోని మరపాలెం ప్రాంతంలో వెళ్తుండగా మలుపులో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న 100 అడుగుల లోయలో పడింది. ఇది చూసిన వాహనదారులు కున్నూరు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. కూనూరు ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్‌ఐ దినకరన్ నేతృత్వంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఉన్న గాయపడిన వారిని కూనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఐదుగురిని కోయంబత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సత్యలక్ష్మి, అరుణగిరి మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### భవనంపై నుంచి పడి బాలుడి మృతి

**తిరువొత్తియూరు:** చెన్నై ఆవడిలో 8వ అంతస్తు పైనుంచి కిందపడి ఓ ఉత్తరాది బాలుడు మృతి చెందాడు. వివరాలు.. ఆవడి, పరుత్తిపట్టిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల క్వాటర్స్ ఉంది. ఇక్కడ 3వ విడత బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో ఉత్తరాది కార్మికులు పెద్దసంఖ్యలో పని చేస్తున్నారు. మంగళవారం 8వ అంతస్తులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బాలుడు రాహుల్ (15) పనిచేస్తున్న సమయంలో హఠాత్తుగా అదుపు తప్పి కింద పడ్డాడు. సహచర కార్మికులు వెంటనే బాలుడిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. కానీ మార్గం మధ్యలోనే బాలుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆవడి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవ పరీక్ష కోసం కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని ..



మృతి చెందిన సోనియా (ఫైల్)

**నారాయణవనం:** నారాయణవనంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 9వ తరగతి విద్యార్థిని సోనియా(15) మృతి చెందింది. పోలీసుల కథనం.. మండలంలోని బ్రాహ్మణతాంగాళ్ దళితవాడకు చెందిన వెంకటేష్ కుమార్తె సోనియా స్థానిక బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం 7 గంటలకు నారాయణవనంలో ప్రైవేట్ ట్యూషన్ సెంటర్ నుంచి సైకిల్‌పై ఇంటికి బయలు దేరింది. జాతీయ రహదారి బైపాస్ భీమునిచెరువు రోడ్డులోకి క్రాస్ చేస్తుండగా చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోనియాకు తీవ్ర గాయాలయ్యాయి. కూడలి వద్ద ఉన్న స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే మృతిచెందింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాలిక మృతదేహానికి నివాళి అర్పించారు. బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చారు. కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# శశికళ, దినకరన్‌కు ఆహ్వానం

- వెల్లడించిన పన్నీరు సెల్వం



పన్నీరుసెల్వం

**సాక్షి, చెన్నై:** తిరుచ్చి వేదికగా జరగనున్న మహానాడుకు శశికళ, దినకరన్‌ను ఆహ్వానించనున్నట్లు అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం తెలిపారు. అన్నాడీఎంకేలో విభేదాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ పార్టీని పూర్తిగా ప్రధాన కార్యదర్శి హోదాలో పళనిస్వామి తన గుప్పెట్లో తెచ్చుకున్నారు. అయితే న్యాయ పోరాటం ద్వారా పార్టీ మళ్లీ సత్తా చాటాలని సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరుసెల్వం ప్రయత్నిస్తున్నారు. తన బలాన్ని చాటుకునే విధంగా ఈనెల 24వ తేదీన తిరుచ్చి వేదికగా భారీ మహానాడుకు సిద్ధమయ్యారు. ముప్పెరుం విళా ఈ వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహానాడు విజయవంతం కోసం తన శిబిరం తరఫున జిల్లాల కార్యదర్శులుగా ఉన్న నేతలతో సమావేశాల్లో పన్నీరు నిమగ్న మయ్యారు. మంగళవారం జరిగిన సమావేశానంతరం మీడియాతో పన్నీరు సెల్వం మాట్లాడుతూ, ముప్పెరుం విళా అన్నది అన్నాడీఎంకే కార్యకర్తలకు దివంగత నేత ఎంజీఆర్ ఇచ్చిన హక్కులను కాపాడే విధంగా ఉంటుందని వివరించారు. పదవీ వ్యామోహంతో నిబంధనలు ఉల్లంఘించి సర్వాధికారంతో విర్రవీగుతున్న ముఠాకు గుణపాఠం చెప్పే వేదిక అవుతుందన్నారు. ఈ మహానాడుకు చిన్నమ్మ శశికళ, అమ్మ మక్కల్ మున్నేత్రకళగం నేత టీటీవీ దినకరన్‌ను ఆహ్వానించనున్నట్లు ప్రకటించారు. వారు తప్పకుండా ఈ మహానాడుకు వస్తారంటూ ధీమా వ్యక్తం చేశారు. కాగా, పన్నీరు వ్యాఖ్యలపై పళని శిబిరం సీనియర్‌నేత జయకుమార్ స్పందిస్తూ, ఆ మహానాడును తాము లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. అలాంటప్పుడు ఆయన ఎవరిని ఆహ్వానిస్తే తమకేంటిని ప్రశ్నించారు.

# ముళ్ల పొదలు తొలగించాలని వినతి

**తిరువళ్లూరు:** ఊత్తుకోట నుంచి పూండి రిజర్వాయర్ వరకు ఉన్న కృష్ణకాలువకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగి కాలువ కుంగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టి ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు. తిరువళ్లూరు జిల్లా పూండిలో సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ ఉంది.

ఈ రిజర్వాయర్ నీటి మట్టం 35 అడుగులు. పూండి రిజర్వాయర్‌కు ప్రధాన నీటి ఆధారం కండలేరు నుంచి వచ్చే కృష్ణాజలాలే. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన జల ఒప్పందంలో భాగంగా ఆంధ్రప్రదేష్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం 12 టీఎంసీల నీటిని విడతల వారిగా అందజేస్తోంది. ఈ నేపథ్యంలో ఊత్తుకోట నుంచి తిరువళ్లూరు వరకు నీటిని తీసుకురావడానికి 25 కిలోమీటర్ దూరం మేరకు కాలువను నిర్మించారు. అయితే ప్రస్తుతం కాలువ పూర్తీగా దెబ్బతింది. కాలువకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలతో కాలువ కరకట్టకు పేర్చిన రాళ్లు కుంగిపోయాయి. అక్కడక్కడ మట్టి సైతం పేరుకపోయింది. దీంతో నీరు రాక తరచూ ఆలస్యంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతో పాటు కాలువల్లో పూడికతీత చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

# రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

**అన్నానగర్:** దిండివనంలో మంగళవారం రైతులు రాస్తారోకో చేశారు. దిండివనం రెగ్యులేషన్ మార్కెట్‌కు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చిన రైతులు మంగళవారం అకస్మాత్తుగా సెంజీ రోడ్డుపై బైటాయించారు. విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకుని చర్చలు జరిపారు. ఆ సమయంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు వ్యాపారులకు విక్రయించారని, ఉదయం తెచ్చిన పంటకు సాయంత్రం 6 గంటలకు తక్కువ ధర నిర్ణయించడం సబబు కాదన్నారు. వ్యాపారులు ఉత్పత్తికి వెంటనే చెల్లించలేదని వ్యాపారులపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం పంట ఉత్పత్తులకు ధర నిర్ణయించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు. ఆందోళనతో 30 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

# పరిశోధనలపై దృష్టి పెట్టాలి



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రాజగోపాలన్, గోమతి

**కొరుక్కుపేట:** రోబోటిక్స్, ఆటోమేషన్‌తో సంబంధం ఉన్న పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థులకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్-చెన్నై సీనియర్ డిజీఎం (రిటైర్డ్) రాజగోపాలన్ హితవు పలికారు. ఈమేరకు ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-వడపళని క్యాంపస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ టెక్ ఫెస్ట్-ఎక్సీయాన్ 2023 పేరుతో జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈసీఈ విభాగం హెడ్ డాక్టర్ ఏ షర్లీ ఎడ్వర్డ్, డాక్టర్ జే అనిత, డీన్ డాక్టర్ సీవీ జయకుమార్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ సి.గోమతి, రోబోటిక్స్ క్లబ్ కోఆర్డినేటర్ హరిహరన్ పాల్గొన్నారు.

# బావిలోపడి కార్మికుడు మృతి



బావిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



దిలీప్ (ఫైల్)

**తిరుత్తణి:** మద్యం మత్తులో బావిలోపడి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి సాయంత్రం చోటుచేసుకుంది. తిరువలంగాడు తొయిదావూరు దళితవాడకు చెందిన దిలీప్(38) పెయింటర్. సోమవారం సాయంత్రం గ్రామ శివార్లలోని వ్యవసాయ పొలం బావి వద్ద అతని స్నేహితులు ముగ్గురితో కలిసి మద్యం తాగారు. మత్తు ఎక్కువ కావడంతో దిలీప్ కాలు జారి బావిలో పడ్డాడు. వెంటనే అక్కడున్న అతని మిత్రులు కేకలు వేశారు. ఆ ప్రాంతంలోని ప్రజలు బావిలోపడిన వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోవడంతో పేరంబాక్కం అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు బావి వద్దకు చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మృతదేహం వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరువలంగాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా పాదటూరుపేటకు చెందిన కృష్ణన్ ఎలక్ట్రీషియన్ నెల రోజుల కిందట మోటారు మరమ్మతులు చేస్తుండగా బావిలో పడ్డారు. తీవ్ర గాయలైన కృష్ణన్‌ను చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

# ఘనంగా ముగిసిన సాహిత్య బ్రహ్మోత్సవాలు



ధ్రువపత్రాలు అందుకున్న నిర్వాహకులు

**తిరుపతి కల్చరల్:** కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో రెండు రోజులుగా చేపట్టి ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వివిధ రంగాలకు చెందిన 2,860 మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. 36 మంది రచయితలు పుస్తకాలను ఆవిష్కరించారు. ముగింపు సమావేశంలో ఇరు సంస్థల చైర్మన్లు కత్తిమండ ప్రతాప్, కింగ్ ఇంద్ర మాట్లాడుతూ తొలిసారిగా 48 గంటల పాటు నిర్వహించిన ఈ సాహిత్య, కళాప్రదర్శనల కార్యక్రమాన్ని అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్, టీఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో నమోదయినట్టు పేర్కొన్నారు. ఈమేరకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, కమిటీ నేతలు పాల్గొన్నారు.

# ఎర్రచందనం తరలిస్తున్న యువకుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

**పలమనేరు :** గంగవరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.1.54లక్షల విలువైన 10 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ నయీమ్‌అలీ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలూకా నాయకనేరికి చెందిన రాధాకృష్ణన్(25) టాటా సుమోలో దుంగలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎఫ్ఎస్ఓలు సుకుమార్ పాల్గొన్నారు.

### పార్కిన్సన్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు

**కొరుక్కుపేట:** చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటైన డీప్ బ్రెయిన్ స్టిములేషన్ (డీబీఎస్) సెంటర్ ద్వారా పార్కిన్సన్ బాధితులకు మెరుగైన చికిత్సలందిస్తున్నామని ఆ ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ అరవింద్ సుకుమారన్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు అయిన ప్రత్యేక కార్యక్రమంలో డీబీఎస్ సెంటర్ ద్వారా చికిత్సలందుకుని సంపూర్ణంగా కోలుకున్న ఇద్దరు మహిళల గురించి ఆయన వివరించారు. ముందస్తు చికిత్స ద్వారా ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చునని చెప్పారు. అపోలో ఆస్పత్రుల మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే వెంకటాచలం న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ్‌శంకర్, సీఈఓ నవీన్ పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ సస్పెన్షన్

**అన్నానగర్:** కుటుంబకలహాల కారణంగా బావమరిదిని కత్తితో నరికిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం పక్కనే ఉన్న మూరార్లపాళయం గ్రామానికి చెందిన రామచంద్రన్ కుమారుడు యువరాజ్ (32). శంకరాపురం పోలీస్‌స్టేషన్ లో కానిస్టేబుల్. ఇతను వివిధ ఫిర్యాదుల కారణంగా సాయుధ బలగాల శాఖకు బదిలీ చేశారు. ఈ స్థితిలో యువరాజ్ , భార్య కల్కి (22) సోమవారం గొడవపడ్డారు. ఆగ్రహంతో భార్య కల్కిని కత్తితో నరకడానికి యువరాజ్ ప్రయత్నించాడు. అప్పుడు అడ్డుకునేందుకు ప్రయత్నించిన కల్కి సోదరుడు శర్మను యువరాజ్ నరికేశాడు. యువరాజ్ ను అరెస్టు చేయాలని కల్కి బంధువులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. యువరాజ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని కళ్లకురిచ్చి జిల్లా ఎస్పీ మోహన్‌రాజ్ మంగళవారం ఆదేశించారు.

### అడవి పందిని ఢీకొని స్కూటరిస్టు మృతి

**చంద్రగిరి:** అడవి పందిని ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహన దారుడితోపాటు అడవి పంది కూడా మృతి చెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయరహదారి కాశిపెంట్ల సమీపంలో మంగళవారం తెల్లవారిజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు సమీపంలోని కట్టమంచికు చెందిన గజపతి(42), తిరుపతిలోని బంధువు ఇంటికి వచ్చి పనులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు బయల్దేరాడు. కాశిపెంట్ల సమీపంలో వెళ్తున్న క్రమంలో అడవి పంది రోడ్డు దాటుతుండగా గజపతి పందిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పంది కూడా అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పందిని స్వాధీనం చేసుకుని, పంచనామా నిర్వహించి అధికారుల సమక్షంలో కాల్చివేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన ఎంపీ

**రేణిగుంట:** రేణిగుంట సమీపంలోని కేంద్రీయ విద్యాలయం-2ను తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మంగళవారం సందర్శించారు. అక్కడి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. స్కూల్లో పర్మినెంట్ ఉపాధ్యాయులు లేరని, అలాగే వాష్‌రూములు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు వివరించారు. ఎంపీ స్పందిస్తూ సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు హార్టికల్చర్ బోధనలు



విద్యార్థులతో డిప్యూటీ పోలీసు కమిషనర్ మహేంద్రన్

**సాక్షి, చెన్నై:** ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు హార్టికల్చర్ పాఠ్యాంశాల బోధనపై ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ చర్యలు తీసుకుంది. తొరైపాక్కంలో ఇందుకోసం ప్రత్యేక సౌకర్యాలు, నిర్మాణాలు చేశారు. అడయార్ డిప్యూటీ పోలీసు కమిషనర్ మహేంద్రన్ ఈ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థి దశలోనే హార్టికల్చర్‌పై పూర్తిగా అవగాహన పొందేందుకు వీలుగా ఇక్కడ చేసిన ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ అభినందించారు. ఇక్కడి విద్యా బోధనలు, సౌకర్యాలను ఆర్కిడ్స్ ఉపాధ్యక్షురాలు షకీనా ఖాసిన్ జైదీ వివరిస్తూ, లిటిల్ గ్రీన్ ఫింగర్స్ పేరిట ప్రత్యేక పాఠ్యాంశంగా విద్యార్థులకు తాము వివరిస్తున్నామని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

# 182 ఎకరాల ప్రభుత్వ భూమి మోసం కేసు

- వీఏఓ సహా ఐదుగురు అరెస్ట్

**కొరుక్కుపేట:** 182 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు బదలాయించిన కేసులో సీబీసీఐడీ పోలీసులు సోమవారం రాత్రి వీఏఓ సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. తేని జిల్లాలోని వడవీర నాయకన్ పట్టి, కెంగవర్‌పట్టి, తామరైకులం రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వానికి చెందిన 182 ఎకరాల భూమిని గత అన్నాడీఎంకే హయాంలో అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు బదలాయించారు. దీనిపై గతేడాది పెరియకుళం సబ్‌కలెక్టర్‌గా ఉన్న రిషబ్ విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయింది. దీంతో సబ్ కలెక్టర్ తేని జిల్లా క్రైంబ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ప్రకారం పెరియకుళం కోటబీయార్ ఆనంది జయప్పి రాధ, పెరియకుళం తహసీల్దార్ కృష్ణకుమార్ భూ మోసానికి సంబంధించి తేని జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మంగళవారం సీబీసీఐడీ పోలీసులు వాడ వీరనాయకనపట్టి వీఏఓ సురేష్ కుమార్, వాడపుటపు పట్టి సురేష్, బాలు, ముత్తు, రమేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందులో సీబీసీఐడీ డీఎస్పీ శరవణకుమార్, ఇన్ స్పెక్టర్ చిత్ర ఆధ్వర్యంలో ఈ విచారణ అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు బదలాయించడం, ఎవరెవరికి ఎంత డబ్బు బదలాయించారనే సమాచారం కూడా బట్టబయలైంది. దీని తర్వాత, సోమవారం రాత్రి వీఏఓ సహా ఐదుగురిని సీబీసీఐడి పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ కేసులో ఇప్పటికే తహసీల్దార్ కృష్ణకుమార్, డిప్యూటీ తహసీల్దార్లు మోహన్ రామ్, సంజీవ్ గాంధీ, సర్వేయర్ పిచ్చైమణి, అసిస్టెంట్ అళగరస్వామి, ఓ.పన్నీర్ సెల్వం సహాయకుడు అన్నప్ ప్రకాష్ లను అరెస్టు చేసి జైలుకు పంపారు. అనంతరం వారిని బెయిల్‌పై విడుదల చేశారు.

# అడవిలో ఏనుగు కళేబరం గుర్తింపు



కుళ్లిన స్థితిలోని ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**అన్నానగర్:** వాల్పరై సమీపంలోని అడవిలో మంగళవారం ఓ ఏనుగు కళేబరం కనిపించింది. వివరాలు.. కోయంబత్తూరు జిల్లా వాల్పరై సమీపంలోని కడంపరైలో ఉన్న కిలిపూనాచ్చి అటవీ ప్రాంతంలో మంగళవారం వాల్పరై అటవీ శాఖ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ అప్పుడు అడవిలో దుర్వాసన రావడంతో సోదాలు చేశారు. ఓ మగ అడవి ఏనుగు శరీరం మొత్తం కుళ్లిపోయిన మృతి చెంది కనిపించింది. ఆనైమలై టైగర్ రిజర్వ్ అటవీ శాఖ వెటర్నరీ అధికారి వాల్పారై ఫారెస్టర్ వెంకటేష్ సమక్షంలో డాక్టర్ విజయరాఘవన్ ఆ ఏనుగు కళేబరానికి పోస్టమార్టం నిర్వహించారు. అలాగే 2 ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతి చెందిన ఏనుగు వయస్సు సుమారు 37 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఏనుగుల గుంపులో పోట్లాట కారణంగా గుంతలో పడి ఏనుగు మరణించి ఉండొచ్చని అధికారులు తెలిపారు.

# విద్యుదాఘాతానికి గురై ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

**అన్నానగర్:** శివగిరిలో పొలం చుట్టూ ఉన్న విద్యుత్ కంచెలో చిక్కుని మంగళవారం తెల్లవారుజామున ఓ ఏనుగు మృతి చెందింది. దీనికి సంబంధించి ఓ రైతును పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా శివగిరి బస్టాండ్ సమీపంలోని కరుంగులం వీధికి చెందిన కరుపయ్య (70) రైతు. అయిన ఇతనికి శివగిరికి పశ్చిమాన పెరియ ఔడైపేరి కన్మాయి ప్రాంతంలో పొలం ఉంది. వరి, చెరకు వంటి పంటలను సాగు చేశాడు. ఈ ప్రాంతం ఇక్కడ పశ్చిమ కనుమల దిగువన ఉండడంతో ఏనుగులతోపాటు వన్యప్రాణులు తరచూ ప్రవేశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. దీంతో అడవి జంతువుల నుంచి పంటలను కాపాడేందుకు కరుపయ్య సోమవారం రాత్రి తన పొలం చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు అటవి నుంచి కరుపయ్య పొలం వైపు ఏనుగు వచ్చింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలో ఏనుగు ఇరుక్కుపోయి మృతి చెందింది. పశువైద్యాధికారి డాక్టర్ మనోహరన్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత అక్కడ గుంత తవ్వి ఏనుగును పాతిపెట్టారు. అనంతరం కరుపయ్యను అరెస్టు చేసి శివగిరి కోర్టులో హాజరుపరిచారు.

# అల్లుడి వేధింపులు తాళలేక..

- రైలు కింద పడి కుటుంబం ఆత్మహత్యాయత్నం
- బాధితులు తమిళనాడు వాసులు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

**ఆదోని టౌన్:** అల్లుడి వేధింపులు తాళలేక ఓ కుటుంబం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం ఆదోని పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు తమిళనాడు వాసులు. తమిళనాడులోని వేలూరు జిల్లా తెరమన్‌బట్టు తాలూకా సాదాగర్ గ్రామానికి చెందిన పద్మనాభం(59), సెల్వి(52) దంపతులకు ఇద్దరు కుమార్తెలు. కరోనా సమయంలో పెద్ద కుమార్తె చనిపోగా, చిన్న కుమార్తె జీవిత ఉంది. 15 ఏళ్ల క్రితం వివాహమైన ఈమెకు ఆది నుంచి భర్త మహేష్ అదనపు కట్నం పేరుతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. పూటగడవని పరిస్థితుల్లో ఉన్న తాము ఇచ్చుకోలేమని అల్లుడిని మొరపెట్టుకున్నారు. అయినా, తీరు మారకపోవడంతో కుమార్తె తల్లిదండ్రుల వద్దకు చేరింది. చివరకు దిక్కుతోచని పరిస్థితుల్లో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం రాత్రి బెంగళూరు నుంచి ముంబయి వెళ్లే ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మార్గమధ్యంలో ట్రైన్‌లో నుంచి దూకేందుకు యత్నించారు. అయితే, వీలుకాకపోవడంతో మంగళవారం ఉదయం ఆదోనిలో దిగారు. కొద్దిసేపు ప్లాట్‌ఫాంపై నిలబడి ట్రైన్ కదిలే సమయంలో దాని కింద దూరి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అక్కడే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఖాద్రి గమనించి పట్టాలపైకి పరుగులు తీసి బయటకు లాగారు. అప్పటికే తల్లి, కుమార్తెలిద్దరి తలలకు గాయాలు కాగా, పద్మనాభం ఎడమ చేయి విరిగిపోయింది. వెంటనే వీరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

# ఘనంగా కల్చరల్ ఫియస్టా ప్రారంభం



విరించి కార్యక్రమంలో విద్యార్థినులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విరించి-2023 పేరుతో ఏర్పాటుచేసిన రెండు రోజుల జాతీయ స్థాయి కల్చరల్ ఫియస్టా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా విద్యార్థినులకు మిస్ విరించి-2కే23, బ్లైండ్ ఆర్ట్, జుగాడ్, స్ప్రింక్ల్ ఆఫ్ క్లే, టర్న్ అండ్ కోట్, ది బ్రిలియంట్ బ్రష్, నృత్య హ్యాష్‌ట్యాగ్‌లు, మెమ్ కాంటెస్ట్, ఆన్ ది హంట్, రాగా, మెహందీ, స్నాప్‌షాట్, రంగోలి, రైజ్ టు ఫేమ్ వంటి పోటీలు నిర్వహించారు.

## క్లుప్తంగా...

### కుప్పం టీడీపీ కార్యాలయంలో రగడ

- బీసీలకు ప్రాధాన్యత కల్పించలేదని నేతల వాకౌట్

**కుప్పం(చిత్తూరు జిల్లా):** టీడీపీలో బీసీలకు ప్రాధాన్యత కల్పించడం లేదని ఆ పార్టీ రజక, కుమ్మరి కులాల పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్లు స్థానిక నాయకులను ప్రశ్నించడంతో కుప్పం టీడీపీ కార్యాలయంలో మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలతో పాటు టీడీపీ బీసీ సెల్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ రజక కుల సంఘం కన్వీనర్ దయాసాగర్, శాలివాహన కుల సంఘం కన్వీనర్ ఉదయ్‌కుమార్‌ను పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన ఆ ఇద్దరు నేతలు వేదికపై ఉన్న టీడీపీ కుప్పం ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌ను నిలదీశారు. పేరుకు బీసీల పార్టీ అని చెప్పుకుని ధనవంతులు, బలిసిన వారికే విలువ ఇస్తున్నారు తప్ప నిరంతరం కష్టపడే వారి కనీస మర్యాదలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జ్యోతిరావ్ పూలేకు నివాళులర్పించే కార్యక్రమం నుంచి అర్ధాంతరంగా బయటకు వచ్చేశారు.

### రికార్డు స్థాయిలో ఏపీటీడీసీ టర్నోవర్: మంత్రి రోజా



**సాక్షి, అమరావతి:** రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా 2022–23లో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) రికార్డు స్థాయిలో రూ.163.25 కోట్ల టర్నోవర్ సాధించిందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. ఇది గతేడాది కంటే 10.82% ఎక్కువని తెలిపారు. మంగళవారం విజయవాడలోని బెరంపార్కులో పర్యాటక శాఖపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఇటీవల విశాఖలో జరిగిన జీఐఎస్‌లో రూ.21,941 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 123 ఎంఓయూలతో పర్యాటక రంగానికి నూతనోత్తేజం వచ్చిందన్నారు. వీటి ద్వారా 41,412 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఇప్పటికే 40 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు పూర్తయ్యాయని, త్వరలో క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభమవుతాయన్నారు. 2023ను ఇయర్ ఆఫ్ విజిట్ ఏపీగా సీఎం జగన్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగి.. దేశంలోనే ఏపీ మూడో స్థానంలో నిలిచిందన్నారు. శిల్పారామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతో పర్యాటకుల సంఖ్య పెరిగి తొలిసారిగా లాభాల బాటలోకి వచ్చాయని చెప్పారు. ఈ నెల 29న వరల్డ్ డ్యాన్స్ డే సందర్భంగా 'ఆంధ్ర నాట్యం'పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమీక్షలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, ఏపీటీడీసీ ఎండీ కె.కన్నబాబు పాల్గొన్నారు.

### ఏపీ ప్రభుత్వానికి బీఈఈ అభినందనలు



'ఎస్ఈఈఐ' నివేదికతో బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే

**సాక్షి, అమరావతి:** స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్ (ఎస్ఈఈఐ)లో ఫ్రంట్ రన్నర్‌గా నిలిచిన ఏపీ ప్రభుత్వాన్ని బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే అభినందించారు. ఇంధన సామర్థ్య కార్యకలాపాల కోసం అన్ని రాష్ట్రాలు నియమించిన స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ(ఎస్‌డీఏ)లతో వర్చువల్ సమావేశం మంగళవారం జరిగింది. న్యూఢిల్లీ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న బాక్రే, జాతీయ లక్ష్యాలకు సహకారం అందిస్తున్న రాష్ట్ర ఇంధన శాఖ, రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సేవలను కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల ప్రోత్సాహం, విద్యుత్ సంస్థల సమష్టి కృషితోనే ఎస్ఈఈఐలో రాష్ట్రం అత్యధిక స్కోర్ సాధించిందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని కాపాడింది నేనే

- ఇఫ్తార్ విందులో చంద్రబాబు

**సాక్షి, అమరావతి:** తాను 40 ఏళ్లుగా రంజాన్ పండుగలో భాగస్వామిని అవుతున్నానని, గతంలో సీఎంగా ఉండగా హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని కాపాడానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఉర్దూను రెండో అధికార భాషగా చేసింది తమ ప్రభుత్వమేనని, విజయవాడ, కర్నూలులో హజ్ హౌస్‌లు కట్టామని తెలిపారు. ఇమాంలకు, మౌజంలకు గౌరవ వేతనం ఇచ్చామన్నారు. దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లిం యువతులకు ఆర్థిక సాయం చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దుల్హన్ పథకంపై అనేక ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానని చెప్పిన ఈ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం వర్గంపై దాడులు పెరిగాయని ఆరోపించారు. ముస్లింలు రాష్ట్ర భవిష్యత్ కోసం అల్లాను ప్రార్థించాలన్నారు.



వైఎస్సార్ జిల్లా కలమల్ల గ్రామంలో ప్రజలతో మాట్లాడి బుక్‌లెట్‌లోని ప్రశ్నలకు జవాబులు నమోదు చేస్తున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం లింగాపురంలో ఒక ఇంటి వద్ద స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



గుంటూరులో తన సెల్‌ఫోన్‌కు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికించుకుని ఆనందం వ్యక్తంచేస్తున్న బాలింత చెన్నమ్మ



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నార్నురాజుపాలెంలో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వి.చలపతిరావు



ఏలూరు జిల్లా కోడూరులో ఓ ఇంటిగోడకు స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భట్లూరులో ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

# ఒకే మాట.. ఒకే నినాదం

## జగనన్నే మా భవిష్యత్తు' అంటున్న అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు

- ఐదో రోజూ ప్రతి ఇంటా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆత్మీయ స్వాగతం
- నాలుగు రోజుల్లో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 28 లక్షల మంది మిస్డ్ కాల్స్
- అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన

**సాక్షి, అమరావతి:** గత 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా చేస్తున్న మేలును ఇంటింటా వివరించి.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 15,004 సచివాలయాల పరిధిలో 1.65 కోట్ల కుటుంబాల్లోని ఐదు కోట్ల మందిని నేరుగా కలవడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు ప్రతి ఇంటా ఆ కుటుంబ సభ్యులు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలలను 'నాడు–నేడు' ద్వారా కార్పొరేట్ బడులకు దీటుగా అభివృద్ధి చేసి.. ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి.. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాల ద్వారా తమ పిల్లల భవితకు బంగారు బాటలు వేసిన జగనన్నే మా భవిష్యత్తు అంటూ ముక్తకంఠంతో అక్కాచెల్లెమ్మలు నినదిస్తున్నారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేస్తే.. వాటిని వడ్డీతో సహా నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా చెల్లిస్తానని ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకుంటూ ఇప్పటికే మూడు విడతలు డబ్బులను ఖాతాల్లో వేశారని అక్కచెల్లెమ్మలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 8296082960 నంబర్‌కు పోటీలు పడి మిస్డ్ కాల్ ఇచ్చిన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు.. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలంటూ ఆశీర్వదించారు.

### అడిగి మరీ తీసుకుని ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లు..

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా సర్వేకు జనం నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమం నాలుగో రోజు అంటే సోమవారం ముగిసేసరికి 39 లక్షల కుటుంబాలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు కలిశారు. ప్రజా మద్దతు పుస్తకంలో స్లిప్పుల్లోని ఐదు ప్రశ్నలను చదివి.. టీడీపీ సర్కార్‌కూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాలను వివరించారు. చంద్రబాబు సర్కార్ హయాంలో ఇంటి స్థలం కావాలన్నా.. పెన్షన్ కావాలన్నా జన్మభూమి కమిటీల్లోని టీడీపీ నేతలకు లంచాలు ఇచ్చుకున్నామని.. అయినా సరే పథకాలను తమకు మంజూరు చేయలేదని అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఎవరి దగ్గరికి వెళ్లకుండా, ఒక్క రూపాయి లంచం కూడా ఇవ్వకుండా పథకాలు అందుతున్నాయని కొనియాడారు. సోమవారం నాటికి 28 లక్షల మంది ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ రాగానే సంతోషంతో కేరింతలు కొట్టారు. సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను గృహసారథుల వద్ద అడిగి మరీ తీసుకుని.. ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్‌లకు అతికించుకుని సంబరపడిపోయారు.

### వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం..

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. నాలుగు రోజుల్లో 39 లక్షల కుటుంబాలను కలిస్తే.. అందులో 28 లక్షల మంది ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ మిస్డ్ కాల్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నారని స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు.

# ఆ పేదల ఇంట పెద్ద పండగ

## నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం సాయం



**సాక్షి, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన 4,39,068 మంది పేద అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రూ.658.60 కోట్ల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగే బహిరంగ సభలో ఆయన బటన్‌నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేయనున్నారు. ఇప్పటికే మేనిఫెస్టోలో చెప్పిన 98.44 శాతం హామీలు నెరవేర్చడంతో పాటు, మేనిఫెస్టోలో చెప్పకపోయినా ప్రతి పేద అక్కచెల్లెమ్మకు మంచి జరగాలని, వారి కుటుంబాలు బాగుండాలని, వారికి తోడుగా ఉండాలని వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న కానుకే వైఎస్సార్ ఈబీసీ నేస్తం.

**మూడేళ్లలో మొత్తం రూ.45వేలు..**

వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుండి 60 ఏళ్ల లోపు ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ వర్గాలకు చెందిన పేద అక్కచెల్లెమ్మలకు (ఈబీసీ) ఏటా రూ.15,000 చొప్పున మూడేళ్లలో మొత్తం రూ.45,000 ఆర్థిక సాయంచేస్తూ వారు సొంత వ్యాపారాలు చేసుకుని వారి కాళ్ల మీద వారు నిలబడేటట్లు వైఎస్ జగన్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఇక నేడు అందిస్తున్న రూ.658.60 కోట్లతో కలిపి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా అందించిన మొత్తం సాయం రూ.1,257.04 కోట్లు. ఒక్కో అక్కచెల్లెమ్మకు ఇప్పటివరకు అందించిన సాయం రూ.30,000. అలాగే, వివిధ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు గత 46 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన లబ్ధి రూ.2,25,991.94 కోట్లు (డీబీటీ మరియు నాన్ డీబీటీ కలిపి).

### నేడు మార్కాపురానికి సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న (బుధవారం) ప్రకాశం జిల్లా మార్కాపురంలో పర్యటించనున్నారు. అక్కడ వైఎస్సార్ ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఉ.9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి 9.55 గంటలకు మార్కాపురం చేరుకుంటారు. 10.15 గంటల నుంచి మ.12.05 వరకు ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజ్ మైదానంలో బహిరంగ సభా వేదిక వద్ద వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు నగదు జమచేస్తారు. కార్యక్రమం అనంతరం మ.12.40కు అక్కడి నుంచి తాడేపల్లికి బయల్దేరుతారు.

## విదేశాల్లో చంద్రబాబు నల్లధనం

# రూ.5 లక్షల కోట్లు

### ప్రధాని మోదీ స్పందించి ఈడీ, సీబీఐతో విచారణ చేయించాలి

- విషయ పరిజ్ఞానం లేని దద్దమ్మ లోకేశ్
- పవన్‌కళ్యాణ్‌కు ప్రజాసంక్షేమం కనిపించడంలేదు
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి

**తిరుపతి రూరల్:** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్జన చేసి దుబాయ్, స్విట్జర్లాండ్‌లో దాచిన రూ.5 లక్షల కోట్ల నల్లధనాన్ని స్వదేశానికి రప్పించాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. తిరుపతిలోని అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విదేశాల్లో లక్షల కోట్ల రూపాయలు దాచిన చంద్రబాబుపై ఈడీ, సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిపై స్పందించాలని కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాయనున్నట్లు చెప్పారు. చంద్రబాబు అక్రమార్జనలపై పోరాటం చేస్తూనే ఉంటానన్నారు. విషయ పరిజ్ఞానం లేని దద్దమ్మ, ఒక్కచోట కూడా గెలవలేని లోకేశ్.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం కామెడీగా ఉందన్నారు. ప్రజాపాలన సాగుతున్న రాష్ట్రంలో విమర్శించేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీ వారు ఫ్రస్టేషన్‌లో బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. టీడీపీ సోషల్ మీడియాలో పనికిమాలిన వెధవల్ని, పెంపుడు కుక్కల్ని పోషిస్తూ మహిళలను సైతం కించపరచడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం హామీలను అమలు చేసినందువల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఆదరించాలని కోరుతున్నారని చెప్పారు.

### బాలకృష్ణ మాట్లాడితే ఆరు నెలలకు కూడా అర్థం కాదు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఏం మాట్లాడతారో, ఎందుకు మాట్లాడుతారో ఆరునెలలకు కూడా ఎవ్వరికీ అర్థం కాదని ఎద్దేవా చేశారు. పుస్తకాలు చదువుతున్న పవన్‌కళ్యాణ్‌కు ప్రజాసంక్షేమం ఎందుకు కనపించడంలేదని ప్రశ్నించారు. కనిపించే అభివృద్ధి, సంక్షేమాన్ని సైతం విమర్శిస్తూ ఉంటే రానున్న ఎన్నికల్లో సైతం ఆయన్ని రెండు కాదు.. మూడుచోట్ల పోటీచేసినా ప్రజలు ఓడిస్తారని హెచ్చరించారు. రాష్ట్రానికి పట్టిన సైకో చంద్రబాబు అని, ఎల్లో మీడియా అండతో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తూనే ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు పాపాలు పండిపోయాయని, ఆయనకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు.

### తెలుగు అకాడమీకి పూర్వవైభవం

రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నిర్వీర్యం చేసిన తెలుగు అకాడమీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్వవైభవం తీసుకొస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ పుస్తకాలను ముద్రిస్తున్నామని, త్వరలో డిగ్రీ పుస్తకాలను, పోటీ పరీక్షలకు అవసరమయ్యే 17 రకాల పుస్తకాలను ముద్రించనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల మాండలిక పుస్తకాలు ముద్రిస్తామన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీతో కలిసి పనిచేస్తామని తెలిపారు. తెలుగు అకాడమీ పేరుతో నకిలీ వెబ్‌సైట్ తయారు చేసి, ఉద్యోగాలు ఇస్తామంటూ మోసాలు చేస్తుండటంపై విజయవాడలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నుంచి రూ.90 కోట్లు రావాల్సి ఉందని, విలువైన ఆస్తులు కూడా అక్కడ ఉన్నాయని తెలిపారు. వాటికోసం ప్రయత్నిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని, దీనిపై హైకోర్టులో పోరాడుతున్నామని ఆమె చెప్పారు.

## మచిలీపట్నం పర్యటనకు

# చంద్రబాబు వెనుకడుగు



నాడు చంద్రబాబు హయాంలో 2019 నాటికి రుద్రవరంలోని జీ+3 గృహాల నిర్మాణ పరిస్థితి ఇది



నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రుద్రవరంలో నిర్మించిన జీ+3 గృహాలు, ముమ్మరంగా సాగుతున్న రహదారి పనులు

- నేడు రోడ్ షో సందర్భంగా టిడ్కో ఇళ్ల పరిశీలన అంటూ టీడీపీ ప్రకటన
- అయితే ఇప్పటికే టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేసిన ప్రభుత్వం
- మరికొద్ది రోజుల్లో లబ్ధిదారులకు పంపిణీకి ఏర్పాట్లు
- ప్రజల చేతిలో భంగపాటు తప్పదని పర్యటన రద్దు చేసుకున్న బాబు

**మచిలీపట్నం టౌన్:** కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం పర్యటనను ప్రతిపక్ష నేత చంద్రబాబు రద్దు చేసుకున్నారు. వాస్తవానికి ఈ నెల 12న బుధవారం సాయంత్రం మచిలీపట్నంలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహిస్తామని టీడీపీ నేతలు ప్రకటించారు. రోడ్ షోలో భాగంగా చింతగుంటపాలెం గో సంఘం వద్ద ఉన్న జీ+3 టిడ్కో గృహాలను చంద్రబాబు పరిశీలిస్తారని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అక్కడ జీ+3 గృహాలు, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేసింది. స్థానిక టీడీపీ నేతలు ఈ గృహ సముదాయాల పనులను పరిశీలించారు. దీంతో చంద్రబాబును ఇక్కడకు తీసుకువస్తే ప్రజల చేతిలో భంగపాటు తప్పదని అంచనాకు వచ్చారు. నిర్మాణాలు పూర్తవడంతో చంద్రబాబు పరువుపోవడం ఖాయమని భావించిన టీడీపీ నేతలు ఆయన పర్యటనను రద్దు చేయించారు.

**చంద్రబాబు హయాంలో అసంపూర్తిగా గృహాలు**

నగరంలోని గోసంఘం, రుద్రవరం ప్రాంతాల్లో జీ+3 గృహాల నిర్మాణం పనులకు చంద్రబాబు ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టారు. గోసంఘంలో 18 బ్లాక్‌ల్లో 864 గృహాలు నిర్మించాల్సి ఉండగా 14 బ్లాక్‌లను మాత్రమే నిర్మించారు. నాలుగు బ్లాక్‌ల పనులు చేపట్టనేలేదు. ఈ గృహాల్లో ఫ్లోరింగ్, కరెంటు, నీటి సదుపాయం తదితర మౌలిక వసతుల పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిపోయిన నాలుగు బ్లాక్‌లను నిర్మించి, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసింది. గృహాల నిర్మాణ పనులకు రూ.53.93 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.13.15 కోట్లు వెచ్చించింది. మరికొద్ది రోజుల్లోనే ఈ గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

**రుద్రవరంలోనూ అంతే..**

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రుద్రవరంలో 30 బ్లాక్‌ల్లో 1,440 గృహాలు నిర్మించాల్సి ఉండగా కేవలం రెండు బ్లాక్‌ల జీ+2 పనులు మాత్రమే చేశారు. 28 బ్లాక్‌లకు సంబంధించి ఫుట్టింగ్ లెవల్ వరకు మాత్రమే పనులు చేపట్టి అలాగే వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ 30 బ్లాకులకు రివర్స్ టెండరింగ్ నిర్వహించి పనులను వేగవంతం చేసింది. ప్రస్తుతం అన్ని బ్లాక్‌ల్లో జీ+3 గృహాలను నిర్మించింది. బ్లాక్‌ల మధ్య రహదారుల నిర్మాణం, వ్యర్థాలకు సంబంధించిన సివిలేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గో సంఘం, రుద్రవరంల్లో జీ+3 గృహాలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇందుకు మచిలీపట్నంలోని వాటర్ వర్క్స్ వద్ద నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా జీ+3 గృహాలకు తాగునీరు సరఫరా కానుంది. రెండు చోట్లా తాగునీటిని నిల్వ చేసే సంపులను కూడా నిర్మించారు. గృహాల వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు.



మచిలీపట్నంలోని గో సంఘం వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న జీ+3 గృహాలు

### పంపిణీకి సిద్ధం చేశాం..



గో సంఘం వద్ద జీ+3 గృహాల నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేశాం. రుద్రవరంలో అన్ని బ్లాక్‌ల నిర్మాణం పూర్తయింది. గృహాల్లోని మెట్లు, బాత్‌రూమ్‌ల పనులు జరుగుతున్నాయి. అలాగే సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇంటర్నల్ పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేశాం.

– ఎం.గణేష్‌బాబు, ఏఈ



"డిజిటల్ యుగంలో లెక్కలు చేయడం సులువైంది.
స్మార్ట్ ఫోన్ ఉంటే చేతిలో కంప్యూటర్ ఉన్నట్లే.
ఈ విజ్ఞాన పరిణామం ఎటు దారి తీసిందో తెలుసా?
ఏడెనిమిదులు ఎంతో చెప్పలేకపోతున్న తరం తయారైంది.
అవన్నీ గుర్తు పెట్టుకోవడం తన పని కాదనుకుంటోంది మెదడు.
కాలిక్యులేటర్ ఉండగా తనకెందుకు శ్రమ అని విశ్రాంతిలోకి వెళ్తోంది.
కాలిక్యులేటర్ ఉండాల్సింది చేతిలో కాదు... తలలో. నిజమే!
కాలిక్యులేటర్ బుర్రలో ఉండాలి... ఎక్కాలు నాలుక మీద నాట్యం చేయాలి."
అని... పిల్లలకు ఎక్కాలు నేర్పించడానికి ముందుకొచ్చారు కేశిరాజు విజయ కుమారి.

● ఎక్కాల ఉద్యమం!

# 19 x 7 = ?

పశ్చిమగోదావరి జిల్లాలో ఓ చిన్న గ్రామం కవిటం. థింక్ బిగ్ అని ఏపీజే అబ్దుల్ కలామ్ చెప్పగా ఆమె వినలేదు. కానీ తనకు తానుగా పెద్ద కలనే కన్నారు. ఐఏఎస్ కావాలనే కల నెరవేరకపోవడానికి ఒకటి కాదు రెండు కాదు కుటుంబ రీత్యా అనేక కారణాలు. అడ్డంకులు ఐఏఎస్ కాకుండా ఆపగలిగాయి, కానీ సమాజానికి సేవ చేయడానికి కాదు కదా అనుకున్నారామె. తన ఎదురుగా కనిపించిన ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని వెతుకుతూ, పరిష్కరించే వరకు విశ్రమించకుండా శ్రమించారు. బాల్యంలోనే నాన్న పోవడం, పిల్లల పెంపకం బాధ్యతను మోస్తూ అమ్మ భుజాలు అరిగిపోవడం చూస్తూ పెరిగారామె. అంతేకాదు... తొలి ఉద్యోగం ఒక ఎన్‌జీవోలో టీచర్‌గా. దాంతో ఆ తర్వాత కూడా ఆమె అడుగులు సర్వీస్ వైపుగానే సాగాయి. దశాబ్దాలపాటు మహిళల కోసమే సేవలందించారామె. ఈ ప్రయాణంలో ఆమెకో కొత్త సంగతి తెలిసింది. డిగ్రీ చదువుకున్న వాళ్లకు కూడా ఎక్కాలు రావడం లేదు. నేర్చుకుని మర్చిపోయారా అంటే... అదీ కాదు. బడి గడప తొక్కని, అక్షరాలు నేర్వని బాల్యం ఉంటుంది. కానీ బడికి వెళ్లి అక్షరాలు నేర్చుకుని ఎక్కాలు నేర్వని బాల్యం ఉంటుందని ఊహించలేదామె. మరింత క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తెలిసిందేమిటంటే... నేటి బాల్యానికి ఎక్కాలు నేర్చుకోవడం టైమ్ వేస్ట్ పనిగా ఉంటోందని. కాలిక్యులేటర్ లేకుండా వందలో నాలుగోవంతు ఎంత అంటే చెప్పడం చేతకావడం లేదని. ఇన్ని తెలిసిన తర్వాత ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి ఎక్కాల పుస్తకాలు పంచుతున్నారు. ఒకటి రెండు నెలల పాటు వాళ్లకు నేర్చుకునే టైమ్ ఇచ్చి ఆ తర్వాత పోటీలు పెడుతున్నారు. ప్రతి క్లాసులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వాళ్లకు కూడా ప్రోత్సాహకాలిస్తున్నారు. రకరకాలుగా సాగిన తన సామాజిక ప్రస్థానాన్ని ఆమె సాక్షితో పంచుకున్నారు.

**ఆడపిల్ల పుట్టాలి... చదవాలి!**

''మా వారి ఉద్యోగరీత్యా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎక్కువ కాలం ఉన్నాను. పెళ్లికి ముందు చదువు చెప్పిన అలవాటు ఉండడంతో అక్కడ ఖాళీగా ఉండలేకపోయేదాన్ని. పైగా మేము నార్త్‌లో ఉన్న రోజుల్లో అక్కడి మహిళలు దాదాపుగా నిరక్షరాస్యులే. నేనిక్కడ చదివింది సెకండ్ లాంగ్వేజ్ హిందీ మాత్రమే. కానీ అక్షరాలు, వాక్యాలు నేర్పించడానికి సరిపోయేది. వాళ్లకు నేర్పిస్తూ నేను హిందీ మాట్లాడడం నేర్చుకున్నాను. భాష మీద పట్టు రావడంతో వాళ్లకు కౌన్సెలింగ్ ఇవ్వడం సులువైంది. ఘూంఘట్ చాటున, అత్తింటి నియమాల మాటున జీవించడమే వాళ్లకు తెలిసింది. కడుపులో ఉన్నది ఆడపిల్ల అయితే బిడ్డను కనకూడదని, గర్భస్రావం చేయించుకోవాలని నూరిపోసింది అక్కడి సమాజం. యువతులు కూడా అదే నిజమనే విశ్వాసంతో ఉండేవాళ్లు. స్త్రీ లేని సమాజం ఎలా మనుగడ సాగిస్తుందో చెప్పమని, దక్షిణాదిలో ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి పుట్టినట్లు భావిస్తారని వాళ్లకు నచ్చచెప్తుంటే... 'ఇద్దరు మగపిల్లలున్న తల్లి ఆమె ఏ మాటైనా చెబుతుంది. ఆడపిల్లకు కట్నాలిచ్చేది ఎవరు' అని అక్కడి మగవాళ్లలో నా మీద వ్యతిరేకత పెల్లుబుకుతుండేది. నాది నిశ్శబ్ద ఉద్యమం కాబట్టి నా మీద దాడులు జరగలేదు. ఇంటి ముందు మురుగు కాలువ ఓపెన్ డ్రైనేజ్‌లో పిల్లలు పడుతుంటారు కూడా. పరిశుభ్రత లేమిని, ఇలాంటి సమస్యలను ప్రశ్నిస్తూ, మహిళలను కలుపుకుని స్థానిక మున్సిపల్ ఆఫీసులకు వెళ్లేదాన్ని. రోడ్డు శుభ్రం చేసిన తర్వాత ఆ కాలనీలో నివసించే ఆడవాళ్ల చేత సంతకం చేయించుకునే నియమం పెట్టారు మున్సిపల్ కమిషనర్.

**నేర్చుకోవడానికి వయసు పరిమితి ఎందుకు!**

నా ఉద్దేశం ఒక్కటే. 'మహిళ కుటుంబ భారాన్ని మోయాల్సి వస్తే... ఆ క్షణంలో బెంబేలెత్తిపోకూడదు. ప్రతి ఒక్కరి చేతిలో ఏదో ఒక పని ఉండాలి. ఆర్థిక స్వావలంబన సాధించాలి'... అని. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత ఇక్కడి మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ అనేకం చేశాను. గవర్నమెంట్ ప్రోగ్రామ్స్‌లో వయోపరిమితి ఉంటుంది. అందులో ఇమడని వాళ్లు 'మాకూ నేర్చుకోవాలని ఉంది' అంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నాది. అలాంటి వాళ్ల కోసం కేవీఎస్ ఫౌండేషన్ స్థాపించి ఉచితంగా శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. శిక్షణ కార్యక్రమాలు, ఎగ్జిబిషన్‌లు 2006 నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. శిక్షణ కార్యక్రమాల నుంచి పుట్టుకు వచ్చిన అవసరమే ఈ ఎక్కాల ఉద్యమం'' అన్నారు విజయకుమారి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

## రెండవ తరగతి... ఇరవై ఎక్కాలు



టైలరింగ్ నేర్పించేటప్పుడు నడుము చుట్టు కొలతలో నాలుగో వంతు మార్క్ చేయమంటే చాలామందికి తెలిసేది కాదు. దాంతో ముందు లెక్కలు నేర్పించాల్సి వచ్చేది. ఏదో సందేహం వచ్చి హైదరాబాద్‌లోని మా అపార్ట్‌మెంట్ పిల్లలను అడిగాను. ఎక్కాలు చదవడం ఏంటన్నట్లు చూశారు. అపార్ట్‌మెంట్‌లో ఎక్కాల పోటీలు పెట్టాను. పాల్గొనడానికే సిగ్గుపడుతున్నారు కొందరు. స్కూళ్లకు వెళ్లాను. ప్రైవేట్ స్కూళ్లు పెద్దగా స్పందించలేదు. ప్రభుత్వ పాఠశాలలు స్వాగతించాయి. సిటీలో ఇప్పటికి మూడువేల ఎక్కాల పుస్తకాలు పంచాను. ఉప్పరపల్లి, ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి పిల్లాడు చాలా త్వరగా ఇరవై ఎక్కాలు నేర్చుకున్నాడు. పిల్లలకు చక్కగా నేర్పిస్తే మెరికల్లా తయారవుతారు. ప్రైవేట్ విద్యారంగం పిల్లలను మార్కుల పోటీలోకి నెట్టేస్తూ, లెక్కలకు పునాది వంటి ఎక్కాలను నిర్లక్ష్యం చేస్తోంది. మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు పిల్లలకు ఎక్కాలు నేర్పించే మరో నిశ్శబ్ద ఉద్యమాన్ని చేపట్టాను.

- కేశిరాజు విజయకుమారి,
సామాజిక కార్యకర్త, కేవీఎస్ ఫౌండేషన్



ఆల్ గర్ల్స్ బ్యాండ్

# నవ స్వరాలు

తొమ్మిది మంది అమ్మాయిలు.
త్రిపుర నుంచి బ్యాండ్‌గా ఏర్పడ్డారు.
'మేఘబాలిక' పేరుతో
నవ స్వరాలు వినిపిస్తున్నారు.
మీరూ వినండి...



త్రిపుర రాజధాని అగర్తలాలో ఈ బృందగానం మూన్ సాహాతో మొదలైంది. ఆమె గిటారిస్ట్. చదువు పూర్తి చేసి పార్ట్‌టైమ్‌లో టైలరింగ్ చేస్తూ ఆ వచ్చిన డబ్బుతో గిటార్ నేర్చుకుంది. కాని తండ్రి దానిని గోడకేసి బాది పగులగొట్టాడు. సంగీతం వద్దు ఏం వద్దు అన్నాడు. పెళ్లి చేసుకో అన్నాడు. అది 2017 సంవత్సరం. మూన్ సాహాకు అప్పుడు 26 ఏళ్లు. మూడు నెలల పాటు మూన్ సాహా కుంగిపోయింది. కాని ధైర్యం పుంజుకుంది. 'సంగీతం కోసం తెగించాల్సిందే' అనుకుంది. అయితే తాను ఒక్కతే కాదు.. ఇలా సంగీతం కోసం అడ్డంకులు ఎదుర్కొంటున్నవారు చాలా మంది ఉంటారు... వారితో కలిసి ముందుకు అడుగు వేద్దామనుకుంది. అలా మొదలైంది.

**మొదట ఐదుగురితో...**

'నేను సోషల్ మీడియాలో నాలా సంగీతం నేర్చుకున్న అమ్మాయిల కోసం వెతికాను. పాడేవాళ్లు, పాటలు రాసేవాళ్లు, వాయిద్యాలు వాయించేవారు... వీరి కోసం వెతికాను. కొందరితో సంభాషణ కుదిరింది. కొందరు భయపడ్డారు. కొందరు ముందుకొచ్చారు. మొత్తం మీద ఐదుగురితో బ్యాండ్ మొదలయ్యింది. మా బ్యాండ్‌కు మేఘబాలిక అని పేరుపెట్టాను. మేఘాలకు హద్దులు లేనట్టే మాకూ ఉండదు అని నా ఉద్దేశం. 2017లో మేము మొదటిసారి స్టేజ్ మీదకు వచ్చాం. త్రిపురలో మాది తొలి ఆల్ గర్ల్స్ బ్యాండ్' అని తెలిపింది మూన్ సాహా.

అయితే త్రిపురది చాలా సంప్రదాయిక సమాజం. మగవాళ్ల ఆధిపత్యం పూర్తిగా ఉంటుంది. స్త్రీలు ఇలా సంగీత ప్రదర్శనలు, అదీ మ్యూజిక్ బ్యాండ్‌గా మారి ఇవ్వడం అంతగా ఇష్టపడరు. 'అయినా మేము అన్నీ దాటుకుని నిలబడ్డాం' అంటుంది మూన్ సాహా.

**కాలేజీ ప్రోగ్రామ్స్**

మేఘబాలిక బ్యాండ్‌ను త్రిపురలోని కాలేజీ విద్యార్థులు మొదట ఆదరించారు. వాళ్ల కాలేజీ ఫంక్షన్‌లకు ఆహ్వానించి తృణమో పణమో అప్పజెప్పేవారు. వీళ్ల తపన గమనించిన అగర్తలాలోని ఓఎన్‌జిసి విభాగం వీరికి డ్రమ్స్ కొనిపెట్టింది. ఆ తర్వాత రేడియో, దూరదర్శన్ నుంచి ఆహ్వానాలు అందాయి. మెల్లమెల్లగా టీమ్ సభ్యులు 9 మంది అయ్యారు. 'ఇవన్నీ చూసి మా కుటుంబాలు కొంత మెత్తబడ్డాయిగాని ఇప్పటికీ బంధుమిత్రులు మా బ్యాండ్‌ను చూసి సూటిపోటి మాటలు అంటూనే ఉన్నారు. ఆడవాళ్లుగా మీరు ఇదంతా ఎలా చేస్తారు అనేదే వారి అభ్యంతరం' అంటుంది మూన్ సాహా.

**కుదిరిన స్వరాలు**

ఇప్పుడు మేఘబాలికలో 16 నుంచి 32 ఏళ్ల మధ్య వయసున్న సభ్యులు ఉన్నారు. బెంగాలి ఫోక్, రబీంద్ర సంగీతం, సొంత కంపోజిషన్‌లు పాడతారు. డిమాండ్‌ను బట్టి బాలీవుడ్ పాటలు కూడా ఉంటాయి. అనన్య శంకర్ (గాయని), మెమొన్ దేబనాథ్ (ఫ్లూట్), జ్యోతిశ్రీ (కీబోర్డ్), సోనియా (డ్రమ్స్)... ఇలా వీళ్లంతా పాడేవాళ్లు, వాద్యగత్తెలు అయితే అంకితా రాయ్ అనే అమ్మాయి పాటలు రాసి సొంత నంబర్లు కంపోజ్ చేయడానికి సహకరిస్తోంది. 'ఇప్పుడు మాకు మంచి డబ్బే వస్తోంది. మేము ఎక్కడకు వెళ్లినా ఒకే రకం బట్టలు ధరించగలుగుతున్నాం' అంది అంకిత. ఇటీవల వీరంతా ప్రోగ్రామ్ ఇవ్వడానికి బాగ్‌డోరా నుంచి కోల్‌కటా వెళుతుంటే వీరి బట్టలు చూసిన ఇండిగో ఫ్లయిట్‌లో సిబ్బంది వీరిని పాడమన్నారు. ఆకాశంలో వీరంతా పాడుతూ ఉంటే ఆ వీడియో వైరల్ అయ్యింది.

**మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్**

ఇప్పుడు మేఘబాలిక ఈశాన్య రాష్ట్రాల్లో పాపులర్ అవుతోంది. అయితే పాడటం ఒక్కటే వీరి లక్ష్యం కాదు. 'మేము అగర్తలాలో ఒక మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ తెరవాలనుకుంటున్నాం. ఎందరో స్త్రీలు డబ్బు లేక, అడ్డంకుల వల్ల సంగీతం నేర్చుకోలేకపోతున్నారు. వారికి అతి తక్కువ ఖర్చులో సంగీతం నేర్పాలని, వారితో ప్రదర్శనలు ఇవ్వాలని మా లక్ష్యం' అంది మూన్ సాహా.

# శక్తిని అనుకూలంగా మార్చుకోవాలి

రిచా వాత్సాయన్




**అత్తింటి నుంచి కట్టుబట్టలతో, చేతిలో బిడ్డతో బయటకు వచ్చిన బీహార్‌వాసి రిచా వాత్సాయన్ ఐదేళ్లలో మూడు స్టార్టప్‌లకు సీఇవో అయ్యింది. అరటి నారతో శానిటరీ ప్యాడ్స్ తయారుచేస్తుంది. స్నేహితులు ఇచ్చిన పదివేల రూపాయలతో వ్యాపారం మొదలుపెట్టిన రిచా నేడు సంవత్సరానికి యాభై లక్షల టర్నోవర్ సాధిస్తోంది. వందమందికి ఉద్యోగావకాశాలు ఇచ్చేలా కృషి చేస్తోంది. బీహార్ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ప్రశంసలు అందుకుంటోంది.**

అరటి నారతో శానిటరీ ప్యాడ్‌లను తయారు చేసే 'శానిట్రస్ట్' కంపెనీ నెలకొల్పింది. బీహార్‌లో ఇలాంటి ప్రాజెక్ట్ ఉన్నది ఇది ఒక్కటే. ఆ వివరాలను తెలుసుకుంటే తప్పకుండా ప్రతి ఒక్కరిలోనూ శక్తి ఉంటుందని అర్థమవుతుంది.

'నేను పాట్నాలో పుట్టి పెరిగాను. మా తాత పాట్నాలో చాలా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశాడు. పట్నంలో ఆడపిల్లల చదువుకు అంతగా వనరులు లేని ఆ రోజుల్లో మహిళా కాలేజీని ప్రారంభించాడు. కానీ, ఇంత జరిగినా మా ఇంట్లో ఆడపిల్లల చదువుకు సంబంధించి ఎలాంటి విలువా లేదు. కుటుంబంలో ఆడపిల్లల ఉన్నత చదువులపై ఎవరూ ఆసక్తి చూపలేదు. మేం ముగ్గురం అక్కచెల్లెళ్లం. డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే మా ముగ్గురికీ పెళ్ళి అయ్యింది.

**చెడు రోజుల నుంచి..**

పెళ్లి నా జీవితంలో దుఃఖపు రోజులనే చూపించింది. ప్రతి రోజూ ఒక సవాల్‌గా ఉండేది. ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడు పెళ్లయితే, ఆ తర్వాత చదువు అత్తమామల ఇష్టప్రకారమే జరగాలన్నారు. పెద్దలు ఇష్టపడ్డారు కదా అని పెళ్లి చేసుకున్నాను. కానీ, నా భర్త నుంచి ప్రేమను ఎప్పుడూ పొందలేకపోయాను. ఆ ఇంట్లో ఉండటమే కష్టంగా అనిపించేది. ఎనిమిదేళ్లలో నేను చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేసి, విసుగనిపించి బయటకు వచ్చేశాను. 2017లో విడాకులు తీసుకున్నాను. ఎలాంటి ఆసరా లేకుండా ఏడాదిన్నర బిడ్డతో విడిగా జీవించడం మొదలుపెట్టాను.

**సాయమిచ్చిన స్నేహితులు**

ఒంటరిగా కొన్నాళ్లు బిడ్డతో కలకత్తాలో ఉన్నాను. ఆ రోజులు అత్యంత కష్టమైనవి. ఎలా జీవించాలో అర్థం కాని రోజులవి. హోలీ సందర్భంగా మా అమ్మవాళ్లింటికి వచ్చినప్పుడు నా పూర్వపు స్నేహితులు కలిశారు. వారందరితో నా పరిస్థితి చెప్పాను. 'పెద్దగా చదువు లేదు, ఏడాదిన్నర వయసు కొడుకు. ఉద్యోగం వెతుక్కొని, పిల్లవాడిని ఎవరి దగ్గర విడిచి వెళ్లగలను' అని స్నేహితుల వద్ద బాధపడ్డాను. ఇంటి నుండి వ్యాపారం చేసుకుంటే ఎవరి సపోర్ట్ అవసరం లేదని, నన్ను అనునయించి పెట్టుబడిగా వాళ్లే పదివేల రూపాయలు ఇచ్చారు. ఆ డబ్బుతో ఆన్‌లైన్ బొటీక్ ప్రారంభించాను.

2017లో స్టార్టప్ ఇండియా అనే కాన్సెప్ట్ దేశంలోకి వచ్చింది. ఈ యాప్ గురించి పూర్తిగా తెలుసుకున్నాను. దీనికి సంబంధించిన కోర్సు చేశాను. ఆ సమయంలోనే రుతుక్రమ వ్యర్థాలపై ఒక కథనాన్ని చదివాను. అప్పుడే నాకు బయోడిగ్రేడబుల్ పీరియడ్ ప్యాడ్‌ల ఆలోచన వచ్చింది. ఇంట్లో ఉండే ఆరు నెలల్లో అరటి నారతో ప్యాడ్స్ తయారు చేయడం నేర్చుకున్నాను.

**అరటి నారతో ప్యాడ్స్**

శానిటరీ ప్యాడ్స్ కారణంగా వచ్చే సమస్యలన్నీ తెలుసుకున్నాను. వాటిని నేనూ ఎదుర్కొంటున్నాను. పరిష్కారం కోసం చాలా పరిశోధనలు చేశాను. దీంట్లో భాగంగానే అరటి నారతో ప్యాడ్ కాన్సెప్ట్ బాగా నచ్చింది. అదే సమయంలో ముగ్గురు ఎన్నారైలు కలిసి గుజరాత్‌లో అరటి నారతో 'సాథీ పీరియడ్ ప్యాడ్'ని ప్రారంభించారు. కానీ, అది చాలా ఖరీదైనది. 10 ప్యాడ్స్ ధర 300 రూపాయలు ఉండేది. దీంతో ఇంట్లోనే కూర్చొని ఆరు నెలల్లో ప్యాడ్ అబ్జర్వేషన్ కోర్స్ చేశాను. ఆ తర్వాత 'శానిట్రస్ట్' పేరుతో కంపెనీ ప్రారంభించాను. ఆన్‌లైన్ బొటీక్ ద్వారా కొద్ది కొద్దిగా కొనుగోలు చేసిన బంగారంపై లోన్ తీసుకుని, ఆ డబ్బుతో ప్యాడ్స్ స్టార్టప్ ప్రారంభించాను.

**ఏడాదికి 50 లక్షలు**

రెండేళ్ల క్రిందట వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అగ్రి స్టార్టప్ ల కోసం ఓ కార్యక్రమం చేపట్టింది. దాంట్లో 'శానిట్రస్ట్' ప్యాడ్స్ ఆలోచనను కాగితంపై పెట్టి, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రాజెక్టుకు అప్లై చేశాను. దేశవ్యాప్తం గా 40 స్టార్టప్‌లు అప్లై చేసుకోగా అందులో పదిమందివి ఎంపికయ్యాయి. నలుగురికి నిధులు మంజూరయ్యాయి. ఆ నలుగురిలో నేనొకదాన్ని. దీంట్లో 20 లక్షల నిధులు నాకు మంజూరయ్యాయి. నిధులు వచ్చిన వెంటనే పది మందితో కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, పని మొదలుపెట్టాను. కేంద్రప్రభుత్వ ప్రశంసలతో దుబాయ్ ఎక్స్‌పోలో ఇండియా పెవిలియన్ కు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. అక్కడ 193 దేశాల ప్రజల ముందు నా దేశం నుంచి ప్రాతినిధ్యం వహించాను. అక్కడి నుండి తిరిగి వచ్చినప్పుడు బీహార్ ప్రభుత్వం జీవనోపాధి కోసం తక్కువ ధర పీరియడ్ ప్యాడ్‌లను తయారు చేయమని నన్ను కోరింది. ఏడాది పాటు ప్రభుత్వానికి కన్సల్టెంట్‌గా పని చేశాను. బక్సర్‌లో మొదటిసారి లో కాస్ట్ ప్యాడ్ యూనిట్ ఏర్పడింది. పది వేల రూపాయలతో నా మొదటి వ్యాపారం ప్రారంభమయ్యింది. నాలుగున్నరేళ్లలో మూడు విజయవంతమైన వ్యాపారాలకు యజమానినయ్యాను. వందమందికి పైగా ఉద్యోగావకాశాలను ఇచ్చాను. ఈ రోజు నా ఏడాది సంపాదన యాభై లక్షలు. అందరిలోనూ శక్తి ఉంటుంది. దానిని అనుకూలంగా మార్చుకోవడంలోనే ఉంది మన కృషి'' అంటూ వివరిస్తోంది రిచా.

## ఆన్‌లైన్ వ్యాపారం

హోలీ తర్వాత కలకత్తాకు తిరిగి వెళ్లాను. ఒక మాల్‌లో కలిసిన మహిళ ద్వారా ఆన్‌లైన్ బొటీక్ నడపవచ్చని తెలిసింది. ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా బొటీక్‌ను నడిపించాను. ఏడాదిన్నరపాటు ఆ వ్యాపారం చేశాను. అక్కడ నుంచి నా జీవితం మెల్లగా మారడం ప్రారంభమైంది. నేను బిజీగా, సంతోషంగా ఉండటం కూడా తెలిసింది. ఒక ఫ్రెండ్ హెర్మెటిక్ టెక్నాలజీ గురించి చెప్పాడు. పురుగు మందులు లేకుండా ధాన్యాలు నిల్వ ఉంచిన సంచి అది.

యూత్ పల్స్

# అ ఆ

● అలవోకగా ఆట

వీడియో గేమ్స్ అనే మాట వినబడగానే 'ఇది అబ్బాయిల ఆట మాత్రమే' అనేది ఒకప్పటి మాట.

అయితే గేమింగ్ అనేది 'బాయ్స్ క్లబ్'కు మాత్రమే పరిమితం కాలేదు.

మన దేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా యంగ్ ఉమెన్ గేమర్స్ సంఖ్య పెరుగుతోంది.

మరో విశేషం ఏమిటంటే గేమింగ్‌ను కెరీర్ ఆప్షన్‌గా చూస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది...

కజిన్ బ్రదర్స్ వీడియోగేమ్స్‌లో తలమునకలవ్వడం చూసి...

'నేను కూడా ఆడతాను. నేర్పించరా' అని అడిగింది పాయల్.

పక్కనే ఏదో బాంబు బ్లాస్ట్ అయినట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చిన ఆ బ్రదర్స్ 'మీ నాన్నకు తెలిస్తే మమ్మల్ని తిడతాడు. ఆడపిల్లలు గేమ్స్ ఆడవద్దనే విషయం నీకు తెలియదా!' అని అరిచారు. వారు నేర్పించరు అనే విషయం అర్థమై తనకు తానే నేర్చుకుంది పాయల్.

మధ్యప్రదేశ్‌లోని చింద్వార పట్టణానికి చెందిన పాయల్ ధారే, ఇండియన్ యంగ్ ఉమెన్ గేమింగ్ స్టార్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకుంది. కంటెంట్ క్రియేటర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది.

'గేమ్స్ ఆడుతున్నప్పటికీ నా దృష్టి కంటెంట్ క్రియేషన్‌పై ఉండేది. యూట్యూబ్‌లో నా ఫస్ట్ వీడియోకు మంచి స్పందన లభించింది. అది నా ఉత్సాహాన్ని రెట్టింపు చేసి ఎంతో శక్తిని ఇచ్చింది' అంటున్న పాయల్‌కు ఫన్‌ప్లేయింగ్ గేమ్స్ అంటే ఇష్టం. ఆ ప్రపంచంలోకి మరింత మందిని తీసుకురావడం అనేది లక్ష్యం.

కౌంటర్ స్ట్రైక్స్ గేమ్స్‌తో ఆట మొదలు పెట్టింది ముంబైకి చెందిన కృతికా వోహ్రా. ఆట మొదలుపెట్టిన కొత్తలోనే ప్రొఫెషనల్స్‌తో ఆడింది. ఎన్నో మెలకువలు అలవోకగా నేర్చుకుంది.

'గేమింగ్ అనేది నీ ప్యాషన్‌గా మాత్రమే ఉండాలి' అని పెద్దలు సలహా ఇచ్చారు. గేమింగ్‌లో పడి కృతిక చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. అయితే ఆమె ప్యాషనే ప్రొఫెషన్‌గా మారింది.

'ఎన్నో రంగాలలో మహిళలు తమను తాము నిరూపించుకుంటున్నారు. గేమింగ్ ఇండస్ట్రీ దీనికి అతీతమేమీ కాదు. అంకితభావం, ధైర్యం ఉన్న అమ్మాయిలు గేమింగ్ ఇండస్ట్రీలో కచ్చితంగా రాణిస్తారు' అని ధైర్యం ఇస్తోంది కృతిక.

వీడియో గేమింగ్‌కు సంబంధించిన ప్రాథమిక విషయాలను చిన్నప్పుడు సోదరుడి దగ్గర నేర్చుకుంది ముంబైకి చెందిన ఖుష్బీ హిరందానీ. కోవిడ్ సమయంలో స్ట్రీమింగ్‌ను కెరీర్‌గా ఎంచుకొంది. స్ట్రీమింగ్ గురించి చెబుతూ 'మన గురించి మనం నాన్‌స్టాప్‌గా చెప్పుకోవడం కాదు. తక్కువ మాటలతోనైనా ప్రేక్షకులతో ఎక్కువ కనెక్ట్ కావాలి' అంటుంది.

ఫుల్‌టైమ్ గేమింగ్ క్రియేటర్‌గా మారడానికి సింగపూర్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుంది.

ప్రొఫెషనల్ ఈస్పోర్ట్స్ అథ్లెట్‌గా మంచి పేరు తెచ్చుకుంది.

'అమ్మాయిలకు ఆడడం రాదు అని బలంగా నమ్మే వాళ్లను చూశాను. గెలిస్తే... అమ్మాయి గెలవడం ఏమిటీ! అని ఆశ్చర్యపడే వాళ్లను చూశాను. అయితే నేను వాటిని ఎప్పుడూ పట్టించుకోలేదు' అంటుంది ఖుష్బీ హిరందానీ.

సెలబ్రిటీల సంగతి సరే, ఔత్సాహిక గేమర్స్ పరిస్థితి ఏమిటి?

పాయల్ మాటల్లో చెప్పాలంటే... 'తొలి అడుగు పడగానే అమ్మాయిలకు గేమ్స్ ఏమిటి! అనే ఆశ్చర్యం కనిపించవచ్చు. ఆటలో గెలిస్తే అమ్మాయిలు గెలవడం ఏమిటి! అని వెక్కిరింపు వినిపించవచ్చు. అంతమాత్రాన అడుగు పడకుండా ఉండదు. ప్రయాణం జరగకుండా ఉండదు. గెలుపు జెండా ఎగరవేయకుండా వెనక్కి తిరిగి చూడడం అంటూ ఉండదు!'



పాయల్



కృతిక

## కొత్త గేమ్స్ అండ్ రూల్స్

ఆన్‌లైన్ గేమింగ్‌లో హానికరమైన కంటెంట్ నిరోధానికి భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ కొత్త నియమావళిని జారీ చేసింది. సెల్ఫ్-రెగ్యులేటరీ ఆర్గనైజేషన్ (ఎస్ఆర్‌వో)లు అభ్యంతర పెడితే సంబంధిత గేమ్‌లు ఆగిపోతాయి. గ్యాంబ్లింగ్(యాడ్స్‌తో సహా), హానికరమైన కంటెంట్‌కు 'ఎస్ఆర్‌వో'లు అడ్డుకట్ట వేస్తాయి. ఇందులో విద్యావేత్తలు, మానసిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. కొత్త మార్గదర్శకాలను గేమింగ్ కంపెనీలు, గేమింగ్ ఇండస్ట్రీ అసోసియేషన్‌లు స్వాగతించాయి.

'కొత్త మార్గదర్శకాలు క్రియేట్ ఇన్ ఇండియా, బ్రాండ్ ఇన్ ఇండియా గేమ్స్‌ను ప్రమోట్ చేస్తాయి. పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. చట్టవిరుద్ధమైన ఆఫ్ షోర్ గ్యాంబ్లింగ్ సైట్ల విస్తరణ ఆగిపోతుంది' అంటున్నారు 'ఇన్‌మోబి' గ్రూప్ చీఫ్ కార్పోరేట్ ఎఫైర్స్ అండ్ పబ్లిక్ పాలసీ ఆఫీసర్ డా. సుబి చతుర్వేది. గేమింగ్ పరిశ్రమ ప్రతినిధులతో పాటు యూత్‌లో అత్యధికులు గేమింగ్ ఇండస్ట్రీకి ఇది పాజిటివ్ టర్నింగ్ పాయింట్ అంటున్నారు.



ఖుష్బీ హిరందానీ



## ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసిస్‌పై రూ. 12 లక్షల జరిమానా

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్‌పై ఐపీఎల్ నిర్వాహకులు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ జట్టు నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు ఈ చర్య తీసుకున్నారు. తదుపరి మ్యాచ్‌ల్లో స్లో ఓవర్ రేట్ పునరావృతమైతే జరిమానా మొత్తాన్ని రెట్టింపు చేస్తారు. ఇదే మ్యాచ్‌లో విజయానంతరం ఆనందంలో తన హెల్మెట్‌ను నేలకేసి కొట్టిన లక్నో ప్లేయర్ అవేశ్ ఖాన్‌ను మ్యాచ్ రిఫరీ మందలించి వదిలేశారు.



## తొలి రౌండ్‌లోనే ఓడిన మనిక బత్రా

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. చైనాలోని జిన్‌జియాంగ్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 4-11, 9-11, 1-11తో ప్రపంచ 24వ ర్యాంకర్ జియోనా షాన్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. కేవలం సింగిల్స్ విభాగాల్లో మాత్రమే నిర్వహిస్తున్న ఈ టోర్నీలో భారత్ నుంచి మనిక మాత్రమే పోటీపడింది.

# రజతం నెగ్గిన నిషా

### ప్రియా ఖాతాలో కాంస్యం



నిషా

**అస్తానా (కజకిస్తాన్):** ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం మొదలైన మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. నిషా (68 కేజీలు) రజత పతకం... ప్రియా (76 కేజీలు) కాంస్య పతకం సాధించారు. నీలమ్ (50 కేజీలు) కాంస్య పతక బౌట్‌లో ఓడిపోగా... సీతో (55 కేజీలు), సరిత మోర్ (59 కేజీలు) నిరాశపరిచారు. 68 కేజీల విభాగంలో ఫైనల్లో నిషా 0-10తో గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన అమీ ఇషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. ప్రియా 2-1తో మిజుకి నాగషిమ (జపాన్)పై గెలుపొంది కాంస్య పతకాన్ని దక్కించుకుంది. నీలమ్ 0-10తో జికి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూసింది.

## 11వ ర్యాంక్‌లో పీవీ సింధు



**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు మళ్లీ టాప్-10లో చోటు కోల్పోయింది. తాజా ర్యాంకింగ్స్‌లో సింధు రెండు స్థానాలు పడిపోయి తొమ్మిది నుంచి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. గత నెలలో 2016 తర్వాత తొలిసారి టాప్-10లో స్థానం కోల్పోయిన సింధు ఈనెల తొలి వారంలో తొమ్మిదో స్థానానికి చేరుకొని మళ్లీ టాప్-10లోకి వచ్చింది. అయితే వారం వ్యవధిలో సింధు ర్యాంక్ మారిపోయింది. భారత్‌కే చెందిన సైనా 31వ ర్యాంక్‌లో, ఆకర్షి 40వ ర్యాంక్‌లో, మాళవిక 42వ ర్యాంక్‌లో, అష్మిత 48వ ర్యాంక్‌లో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. గతవారం ఫ్రాన్స్‌లో జరిగిన ఓర్లియాన్స్ మాస్టర్స్ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రియాన్షు విజేతగా నిలిచాడు. దాంతో ప్రియాన్షు 20 స్థానాలు ఎగబాకి 38వ ర్యాంక్‌లో నిలిచాడు.

# ముంబై బోణీ...

'సీనియర్లు మరింత బాధ్యత తీసుకోవాలి... అది నాతోనే మొదలు కావాలి... గత మ్యాచ్‌లో ఓటమి తర్వాత ముంబై కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్య ఇది. దానికి తగినట్లుగానే బ్యాటింగ్‌లో సత్తా చాటిన రోహిత్... అంతకుముందు సారథిగా మైదానంలో ప్రణాళికలు సరిగ్గా అమలు చేసి చూపించాడు. బౌలింగ్‌లో పీయూష్ చావ్లా, బెహ్రెన్‌డార్ఫ్... బ్యాటింగ్‌లో రోహిత్, తిలక్ వర్మ కీలకపాత్ర పోషించడంతో మాజీ చాంపియన్‌కు రెండు ఓటముల తర్వాత తొలి విజయం దక్కింది. మరోవైపు అక్షర్ పటేల్, వార్నర్ ఆటతో పడుతూ లేస్తూ కాస్త గౌరవప్రదమైన స్కోరు చేసినా... సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. వరుసగా నాలుగు పరాజయాలతో ఆ జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

- సీజన్‌లో తొలి విజయం
- 6 వికెట్లతో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్
- రాణించిన రోహిత్, చావ్లా



చావ్లా

**న్యూఢిల్లీ:** ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ ఐపీఎల్ తాజా సీజన్‌లో గెలుపు బోణీ చేసింది. మంగళవారం చివరి బంతి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.4 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. అక్షర్ పటేల్ (25 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), డేవిడ్ వార్నర్ (47 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. స్పిన్నర్ పీయూష్ చావ్లా, పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ (45 బంతుల్లో 65; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 41; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

**అక్షర్ మెరుపులు...**

వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఢిల్లీ పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. పృథ్వీ షా (15) ఈసారి రెండంకెల స్కోరు చేసినా పెద్దగా ప్రభావం చూపలేదు. మూడో స్థానంలో వచ్చిన మనీశ్ పాండే (18 బంతుల్లో 26; 5 ఫోర్లు) కాస్త ధాటిగా ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే 22 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. సీనియర్ స్పిన్నర్ చావ్లా వరుసగా తన మూడు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున పాండే, రావ్‌మన్ పావెల్ (4), లలిత్ యాదవ్ (2)లను వెనక్కి పంపించాడు. ఈ దశలో వార్నర్, అక్షర్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. 98/5 వద్ద బరిలోకి దిగిన అక్షర్ జోరుతో ఢిల్లీ కోలుకుంది. అయితే చివర్లో ఢిల్లీ పూర్తిగా కుప్పకూలింది. 18 ఓవర్లలో స్కోరు 165/5 కాగా... తర్వాతి 10 బంతుల్లో 5 వికెట్లు కోల్పోయిన టీమ్ మరో 7 పరుగులు మాత్రమే చేసింది! బెహ్రెన్‌డార్ఫ్ వేసిన 19వ ఓవర్లోనే ఒక రనౌట్ సహా మొత్తం 4 వికెట్లు పడ్డాయి.

**రాణించిన తిలక్...**

ఛేదనలో ముంబైకి ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. రోహిత్, ఇషాన్ కిషన్ (26 బంతుల్లో 31; 6 ఫోర్లు) ధాటికి ముంబై పవర్‌ప్లేలో 68 పరుగులకు చేసింది. సమన్వయలోపంతో ఇషాన్ రనౌట్ కాగా, మూడో స్థానంలో బరిలోకి దిగిన తిలక్ కూడా అదే జోరును కొనసాగించడంతో ముంబై వేగంగా గెలుపు దిశగా సాగింది. కుల్దీప్ బౌలింగ్‌లో 2 సిక్సర్లు కొట్టిన తిలక్... ముకేశ్ ఓవర్లో వరుసగా 4, 6, 6 బాదాడు. అయితే ఈ ఓవర్లోనే తిలక్‌తో పాటు సూర్యకుమార్ (0)ను కూడా ముకేశ్ అవుట్ చేశాడు. విజయానికి మరో 30 పరుగుల దూరంలో రోహిత్ వెనుదిరిగినా... కామెరాన్ గ్రీన్ (17 నాటౌట్), టిమ్ డేవిడ్ (13 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు. నోర్జే వేసిన చివరి ఓవర్లో 5 పరుగులు అవసరం రాగా, తొలి ఐదు బంతుల్లో 3 పరుగులే వచ్చాయి. దాంతో కాస్త ఉత్కంఠ పెరిగింది. అయితే ఆఖరి బంతికి బ్యాటర్లు 2 పరుగులు రాబట్టగలగడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది.

### స్కోరు వివరాలు

**ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** వార్నర్ (సి) మెరిడిత్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 51; పృథ్వీ షా (సి) గ్రీన్ (బి) హృతిక్ షోకీన్ 15; మనీశ్ పాండే (సి) బెహ్రెన్‌డార్ఫ్ (బి) చావ్లా 26; యశ్ ధుల్ (సి) నేహల్ వధేరా (బి) మెరిడిత్ 2; పావెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చావ్లా 4; లలిత్ (బి) చావ్లా 2; అక్షర్ పటేల్ (సి) అర్షద్ ఖాన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 54; అభిషేక్ (సి) గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 1; కుల్దీప్ (రనౌట్) 0; నోర్జే (బి) మెరిడిత్ 5; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం:** 1-33, 2-76, 3-81, 4-86, 5-98, 6-165, 7-166, 8-166, 9-166, 10-172. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3-0-23-3, అర్షద్ ఖాన్ 1-0-12-0, గ్రీన్ 3-0-30-0, హృతిక్ షోకీన్ 4-0-43-1, మెరిడిత్ 3.4-0-34-2, పీయూష్ చావ్లా 4-0-22-3, తిలక్ వర్మ 1-0-7-0.

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) అభిషేక్ (బి) ముస్తఫిజుర్ 65, ఇషాన్ కిషన్ (రనౌట్) 31; తిలక్ వర్మ (సి) మనీశ్ పాండే (బి) ముకేశ్ 41; సూర్యకుమార్ (సి) కుల్దీప్ (బి) ముకేశ్ 0; టిమ్ డేవిడ్ (నాటౌట్) 13, గ్రీన్ (నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-71, 2-139, 3-139, 4-143. **బౌలింగ్:** ముకేశ్ 2-0-30-2, ముస్తఫిజుర్ 4-0-38-1, నోర్జే 4-0-35-0, లలిత్ 4-0-23-0, అక్షర్ 4-0-20-0, కుల్దీప్ 2-0-23-0.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|
| లక్నో | 4 | 3 | 1 | 6 | 1.048 |
| రాజస్తాన్ | 3 | 2 | 1 | 4 | 2.067 |
| కోల్‌కతా | 3 | 2 | 1 | 4 | 1.375 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 4 | 0.431 |
| చెన్నై | 3 | 2 | 1 | 4 | 0.356 |
| పంజాబ్ | 3 | 2 | 1 | 4 | -0.281 |
| బెంగళూరు | 3 | 1 | 2 | 2 | -0.800 |
| ముంబై | 3 | 1 | 2 | 2 | -0.879 |
| హైదరాబాద్ | 3 | 1 | 2 | 2 | -1.502 |
| ఢిల్లీ | 4 | 0 | 4 | 0 | -1.576 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

చెన్నై × రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

# ఉప్పల్ స్టేడియానికి మెరుగులు!

### రూ. 117 కోట్లు కేటాయించనున్న బీసీసీఐ



**న్యూఢిల్లీ:** వచ్చే అక్టోబర్-నవంబర్‌లో వన్డే వరల్డ్‌కప్ నిర్వహణ కోసం సన్నద్ధమవుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రాథమిక ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దేశంలో ఐదు స్టేడియాలను ఆధునీకరించి వసతులు మెరుగుపర్చాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు అయినా... ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో బీసీసీఐ విఫలమైందంటూ ఇటీవల భారత్-ఆస్ట్రేలియా సిరీస్ టెస్టు సిరీస్ సందర్భంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ స్టేడియాల్లో పలు మార్పులు చేసేందుకు సంకల్పించింది. ఈ జాబితాలో ఐదు స్టేడియాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంతోపాటు ఢిల్లీ, కోల్‌కతా, వాంఖెడే, మొహాలి మైదానాల ఆధునీకరణకు బోర్డు ప్రతిపాదిస్తూ నిధులు కేటాయించింది. ఉప్పల్ స్టేడియం కోసం రూ. 117 కోట్ల 17 లక్షలు ఖర్చును ప్రతిపాదించారు. వరల్డ్‌కప్ కోసం షార్ట్ లిస్ట్ చేసిన 12 స్టేడియాల్లో మొహాలి లేకపోయినా... అది బాగా పాతబడిపోవడంతో ఈ జాబితాలో చేర్చారు.

**కోల్‌కతా, చెన్నైలలో...**

మరోవైపు వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ రెండు వేదికల్లోనే తమ అన్ని మ్యాచ్‌లు ఆడాలని భావిస్తోంది. తమ జట్టుకు కోల్‌కతా, చెన్నైలలోనే అన్ని మ్యాచ్‌లు కేటాయించాల్సిందిగా పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కోరనున్నట్లు సమాచారం. 2016 టి20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను పాక్ కోల్‌కతాలోనే ఆడింది. చెన్నై కూడా తమకు అచ్చి వచ్చిన మైదానంగా ఆ జట్టు భావిస్తోంది. అన్నింటికి మించి ప్రస్తుతం ఇరు దేశాల మధ్య నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ముంబై, ధర్మశాల తదితర వేదికల్లో ఆ జట్టు ఆడే అవకాశాలు కనిపించడం లేదు. పాక్ విజ్ఞప్తిపై ఐసీసీ ఎలా స్పందిస్తుందనేది చూడాలి.

# భారత్‌ను గెలిపించిన అంకిత రైనా

### తొలి మ్యాచ్‌లో 2-1తో థాయ్‌లాండ్‌పై విజయం



**తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్):** బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. థాయ్‌లాండ్ జట్టుతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1తో విజయం సాధించింది. భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలుత సింగిల్స్ మ్యాచ్‌లో, అనంతరం డబుల్స్ మ్యాచ్‌లో గెలుపొంది టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించింది. 'బెస్ట్ ఆఫ్ త్రీ' పద్ధతిలో జరిగిన ఈ పోటీలో తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 2-6, 1-6తో లుక్సికా కుమ్‌కుమ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. దాంతో భారత్ 0-1తో వెనుకబడింది. రెండో సింగిల్స్‌లో అంకిత 5-7, 6-1, 6-3తో పీంగ్‌టార్న్ ప్లిపుయెచ్‌పై గెలిచి స్కోరును 1-1తో సమం చేసింది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-రుతుజా జోడీ 4-6, 6-3, 6-2తో లుక్సికా కుమ్‌కుమ్-పీంగ్‌టార్న్ ప్లిపుయెచ్ జంటను ఓడించడంతో భారత్ 2-1తో విజయాన్ని ఖాయం చేసుకుంది.

## జొకోవిచ్ శుభారంభం



**మోంటెకార్లో (మొనాకో):** ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన ఈ సెర్బియా స్టార్ రెండో రౌండ్‌లో 7-6 (7/5), 6-2తో ఇవాన్ గఖోవ్ (రష్యా)పై గెలుపొందాడు. గంటా 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

# సినిమా


వెంకటేశ్

## యాక్షన్ సైంధవ్


వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సైంధవ్'. 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. ఈ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లు, ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు వెంకటేశ్ పాల్గొనగా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు చిత్ర యూనిట్ మంగళవారం వెల్లడించింది. ఓ పాట చిత్రీకరణ కోసం భారీ సెట్‌ను కూడా వేశారు. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ తెలుగుకి పరిచయం అవుతున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాత: కిషోర్ తాళ్లూరు.


బాపినీడు, జీవీఎస్ఎన్ ప్రసాద్, 'దిల్' రాజు, సాయిధరమ్ తేజ్, అల్లు అరవింద్

## ట్రైలర్‌లో విషయం కనిపిస్తోంది - 'దిల్' రాజు

''ఈ మధ్య ట్రైలర్‌ని బట్టి సినిమాలకు ఓపెనింగ్స్ వస్తున్నాయి. 'విరూపాక్ష' ట్రైలర్ చూస్తుంటే ఫుల్ ఓపెనింగ్స్ వస్తాయని వంద శాతం అనిపిస్తోంది. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్న సాయిధరమ్ 'విరూపాక్ష'లో యాక్టింగ్ పరంగా చింపేశాడని అందరూ అంటుంటే వినటానికి సంతోషంగా ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా కార్తీక్ దండు దర్శకత్వం వహించిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు బి. సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అల్లు అరవింద్, 'దిల్' రాజు ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం 'దిల్' రాజు మాట్లాడుతూ– ''విరూపాక్ష' ట్రైలర్‌లో సినిమా కంటెంట్ (విషయం) కనిపిస్తోంది. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుంది'' అన్నారు. ''బాపినీడు ఆధ్వర్యంలో చేసిన ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ– ''ఎంతో ప్రేమించి, కష్టపడి చేసిన సినిమా 'విరూపాక్ష'. 'అమ్మా ఈ చిత్రం నీకోసం. ఐ లవ్ యు అమ్మా. నన్ను సపోర్ట్ చేయటానికి వచ్చిన నా తొలి సినిమా నిర్మాతలు 'దిల్' రాజు, అరవింద్‌గార్లకు థ్యాంక్స్'' అన్నారు. సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్ పాల్గొన్నారు.

## నిజమేనా?


రజనీకాంత్

ఇటీవల తమిళ హీరో విజయ్‌తో 'వారిసు '(తెలుగులో 'వారసుడు') సినిమా నిర్మించారు 'దిల్' రాజు. తాజాగా సూపర్ స్టార్ రజనీకాంత్‌తో 'దిల్' రాజు ఓ సినిమాను పట్టాలెక్కించాలనే ప్రయత్నాల్లో ఉన్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. పూర్తి స్క్రిప్ట్ పూర్తయ్యాక రజనీకాంత్‌ను కలిసి కథ వినిపించాలని 'దిల్' రాజు భావిస్తున్నారట. ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పనులను దర్శకుడు వంశీ పైడిపల్లికి 'దిల్' రాజు అప్పజెప్పారని, ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నది వంశీయే అనే టాక్ వినిపిస్తోంది. మరి.. రజనీకాంత్, 'దిల్' రాజు, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లోని సినిమా నిజమేనా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ప్రస్తుతం 'జైలర్' సినిమాలో నటిస్తున్నారు రజనీకాంత్. అలాగే 'లాల్ సలామ్'లో ఓ గెస్ట్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాలు కాకుండా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ డైరెక్షన్‌లో రజనీ ఓ సినిమా కమిట్ అయిన సంగతి తెలిసిందే.

## జీవితంలోనూ హీరోగా ఉండాలన్నారు - రాఘవా లారెన్స్



'ఠాగూర్' మధు, లారెన్స్, ప్రియా భవానీ

''స్క్రీన్‌పైనే కాదు.. నిజజీవితంలోనూ హీరోగా ఉండాలి అని మా అమ్మగారు చెబుతుంటారు. చదువు, వైద్యం విషయంలో ఎవరికైనా సాయం కావాలంటే లారెన్స్ చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించండి. సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఆ దేవుడే నా చేత సేవా కార్యక్రమాలు చేయిస్తున్నాడని భావిస్తున్నాను. సేవ చేయడానికి నన్నే ఎంచుకున్న ఆ రాఘవేంద్రస్వామికి ధన్యవాదాలు'' అన్నారు కొరియోగ్రాఫర్ దర్శక- నిర్మాత, నటుడు రాఘవా లారెన్స్. ఆయన టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'రుద్రుడు'. ఇందులో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. స్వీయ దర్శకత్వంలో కదిరేశన్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 14న విడుదల కానుంది. పిక్సెల్ స్టూడియోస్ నిర్మాత 'ఠాగూర్' మధు 'రుద్రుడు' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాఘవా లారెన్స్ మాట్లాడుతూ –''రుద్రుడు'లో మాస్, యాక్షన్, ఫ్యామిలీ, డ్యాన్స్ అన్నీ ఉన్నాయి. మదర్ సెంటిమెంట్ కూడా ఉంది. ఈ సినిమాను మధు గారు తెలుగులో రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉంది. నా ప్రతి సినిమాలో మాస్, యాక్షన్ మిస్ కాకుండా కుటుంబపరమైన అంశాలు ఉండేలా చూసుకుంటాను'' అన్నారు.


నయనతార

## మాస్ స్టెప్పులు

'జవాన్'తో అదిరిపోయే మాస్ స్టెప్పులేస్తున్నారు నయనతార. షారుక్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ సినిమా 'జవాన్'. ఇందులో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, కీలక పాత్రలో ప్రియమణి, ప్రత్యేక పాత్రలో దీపికా పదుకోన్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. షారుక్, నయనతారలపై ఓ పెప్పీ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఫరా ఖాన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట చిత్రీకరణ పూర్తయిన తర్వాత షారుక్, దీపికాలపై మరో సాంగ్ చిత్రీకరణ జరుగుతుందని, ఆ తర్వాత జరిగే ఓ చిన్న ప్యాచ్ వర్క్‌తో 'జవాన్' షూటింగ్ మొత్తం పూర్తవుతుందని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది.

## ఆ సామెతకు విడుదల కరెక్ట్ - అల్లు అరవింద్


వెట్రిమారన్, అల్లు అరవింద్, సూరి, భవానీ శ్రీ

''వెట్రిమారన్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. తను జాతీయ అవార్డు సినిమాలు తీసినా సింపుల్‌గా ఉంటాడు. ఆయన తీసిన 'విడుదల' చాలా గొప్ప సినిమా. తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. హాస్య నటుడు సూరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'విడుదలై: పార్ట్1'. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, భవానీ శ్రీ కీలక పాత్రలు చేశారు. ఎల్‌రెడ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా మార్చి 31న తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని 'విడుదల: పార్ట్ 1' పేరుతో గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్‌పై అల్లు అరవింద్ ఈ నెల 15న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''లోకల్ ఈజ్ గ్లోబల్' అంటూ ఇండస్ట్రీలో ఈ మధ్య కొత్త సామెత వచ్చింది.. దానికి కరెక్టుగా సరిపోయే సినిమానే 'విడుదల'' అన్నారు. వెట్రిమారన్ మాట్లాడుతూ– ''విడుదల' రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి కనెక్ట్ అవుతారు. లాక్‌డౌన్ అనంతరం ఎన్టీఆర్‌ని కలిసి ఓ మూవీపై చర్చించాను. ఆయనతో ఓ స్ట్రయిట్ తెలుగు సినిమా ఉంటుంది. అందుకు సమయం పడుతుంది'' అన్నారు.

## అంబాజీపేట బ్యాండు


సుహాస్

'కలర్ ఫోటో', రైటర్ పద్మభూషణ్' వంటి హిట్ చిత్రాల ఫేమ్ సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. ఈ చిత్రంతో దుశ్యంత్ కటికనేని దర్శకునిగా పరిచయమవుతున్నారు. 'బన్నీ' వాసు, వెంకటేశ్ మహా సమర్పణలో జీఏ2 పిక్చర్స్, స్వేచ్ఛ క్రియేషన్స్‌పై ధీరజ్ మొగిలినేని నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' చిత్రంలో మ్యారేజ్ బ్యాండ్‌లో పని చేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ నటించారు. త్వరలో మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


నదియా, హరీశ్ కల్యాణ్, ఇవానా

ప్రముఖ భారత క్రికెటర్ ఎంఎస్ ధోని, ఆయన సతీమణి సాక్షి ధోని నిర్మాణ సంస్థ ధోని ఎంటర్‌టైన్‌మెంట్‌పై ప్రారంభమైన తొలి చిత్రం 'ఎల్‌జీఎం'. హరీశ్ కల్యాణ్, నదియా, ఇవానా టైటిల్ రోల్స్ పోషిస్తున్నారు. రమేష్ తమిళ్ మణి దర్శకత్వంలో వికాస్ హసిజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని ధోని సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. వికాస్ హసిజా మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఎల్‌జీఎం'. చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాం'' అన్నారు. ''ఎల్‌జీఎం'లో ఆశ్చర్యానికి గురి చేసే అంశాలు చాలా ఉంటాయి. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతోంది'' అన్నారు క్రియేటివ్ ప్రొడ్యూసర్ ప్రియాంషు చోప్రా.

## మా టైమింగ్ అదిరిపోయింది - సప్తగిరి


వీజే సన్నీ, సప్తగిరి

'బిగ్ బాస్' ఫేమ్ వీజే సన్నీ, సప్తగిరి, నక్షత్ర, అక్సాఖాన్ హీరో హీరోయిన్లుగా డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. రజిత్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'బేబీ బేబీ' సాంగ్‌ను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించిన ఈ పాటను ఇంద్రావతి చౌహాన్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వీజే సన్నీ మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని ప్రతి సీన్ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు. ''సినిమాలో నా, వీజే సన్నీ టైమింగ్ అదిరిపోతుంది'' అన్నారు సప్తగిరి. ''రిలీజ్ తర్వాత చిన్న సినిమాల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అందుకే చిన్న సినిమాలు తీస్తున్న ప్రతి నిర్మాత నాకు ఓ హీరోయే. ఈ సినిమా తర్వాత నన్ను 'అన్‌స్టాపబుల్' డైరెక్టర్ డైమండ్ రత్నబాబు అని పిలుస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''మంచి సినిమాలు తీయాలని ఇండస్ట్రీకి వచ్చాను. 'అన్‌స్టాపబుల్' చిన్న సినిమా కాదు. అన్నీ ఉన్న సినిమా'' అన్నారు రజిత్ రావు.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 311 | 60,152 |
| నిఫ్టీ ▲ | 98 | 17,722 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,064 | ▽ | 20 |
| డోజోన్స్ | 33,729 | ▲ | 142 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,786 | ▲ | 44 |
| డాక్స్ | 15,655 | ▲ | 57 |
| షాంఘై | 3,314 | ▽ | 1 |
| నికాయ్ | 27,923 | ▲ | 290 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (24 క్యారట్) | 60,390 | ▲ | 35 |
| బంగారం (22 క్యారట్) | 60,148 | ▲ | 33 |
| వెండి (కిలో) | 74,416 | ▽ | 140 |



## యాపిల్ స్టోర్లను ప్రారంభించనున్న టిమ్ కుక్!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ఈ నెల 18న అధికారిక విక్రయ శాలను ముంబైలో ప్రారంభిస్తోంది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఔట్‌లెట్ ఈ నెల 20న తెరుచుకోనుంది. ఈ రెండు కేంద్రాల ప్రారంభోత్సవానికి సంస్థ సీఈవో టిమ్ కుక్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశమూ ఉంది. టిమ్ కుక్ 2016లో తొలిసారిగా భారత్‌లో పర్యటించారు. కంపెనీ భారత్‌లో 2020లో ఆన్‌లైన్ స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రిటైల్‌లో ఎక్స్‌క్లూజివ్ యాపిల్ ప్రీమియం రీసెల్లర్ స్టోర్స్ (ఏపీఆర్), రిలయన్స్ డిజిటల్, క్రోమా వంటి భారీ చైన్స్, మల్టీ బ్రాండ్ రిటైల్ కేంద్రాలతోపాటు ఈ–కామర్స్ వేదికల ద్వారా యాపిల్ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది. దేశవ్యాప్తంగా 100కుపైగా ఏపీఆర్ ఔట్‌లెట్లు ఉన్నాయి. భారత స్మార్ట్‌ఫోన్ విపణిలో 2022లో కంపెనీ 17 శాతం వృద్ధితో 4 శాతం వాటాను చేజిక్కించుకుంది. రూ.49,200 కోట్ల విలువైన అమ్మకాలను సాధించింది. దేశంలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల విభాగం రెండంకెల వృద్ధి నమోదు చేస్తోంది. చైనా వెలుపల భారత్ సహా ఇతర దేశాల్లో ఉత్పత్తిని పెంచడానికి యాపిల్ స్థిర ప్రయత్నాలు చేసింది. యాపిల్ ప్రొడక్టులను సరఫరా చేస్తున్న ఫాక్స్‌కాన్, పెగట్రాన్, విస్ట్రన్ కంపెనీలు ఐఫోన్ల తయారీని భారత్‌లో అధికం చేశాయి. భారత ప్రభుత్వం స్థానికంగా తయారీని ప్రోత్సహించడం, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, చౌకగా కార్మికుల లభ్యత ఇందుకు దోహదం చేశాయి.

## జీ20తో డిజిటల్ కృషిని ప్రపంచానికి చాటి చెప్తాం

జీ20 షెర్పా అమితాబ్ కాంత్



న్యూఢిల్లీ: డిజిటల్ పరివర్తనలో భారత్ చేస్తున్న కృషిని జీ20 కార్యక్రమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పనున్నట్లు నీతి ఆయోగ్ మాజీ సీఈవో, జీ20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు. తద్వారా గ్లోబల్ సౌత్ (లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా, ఓషియానియా దేశాలు) ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తోడ్పాటు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 8వ జాతీయ నాయకత్వ సదస్సులో పాల్గొన్న సందర్భంగా కాంత్ ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా 400 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు లేదని, 250 కోట్ల మంది కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదని కాంత్ చెప్పారు. 133 దేశాల్లో వేగవంతమైన డిజిటల్ చెల్లింపుల విధానాలు లేవని పేర్కొన్నారు. అలాంటిది, డిజిటైజేషన్ ద్వారా భారత్ ప్రజల జీవితాల్లో మార్పులు తేగలిగిందని, ఉత్పాదకత పెంచుకుని సమర్థమంతమైన ఆర్థిక వ్యవస్థగా ముందుకెడుతోందని కాంత్ చెప్పారు. డిజిటైజేషన్ డిజిటల్ చెల్లింపులు తదితర విభాగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని వివరించారు. 'భారత్ పాటిస్తున్న ఈ మోడల్‌ను మిగతా ప్రపంచం ముందుకు ఎలా తీసుకెళ్లాలన్నది ఒక సవాలు. భారత డిజిటల్ పరివర్తన గాథను ప్రపంచానికి పరిచయం చేసేందుకు జీ20 వేదికను ఉపయోగించుకుందాం. ఆ విధంగా గ్లోబల్ సౌత్ దేశాల పౌరుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకుందాం' అని కాంత్ పేర్కొన్నారు.

## ప్రపంచీకరణలో మరింత పారదర్శకత అవసరం

- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- భారత్‌లో పెట్టుబడులకు అమెరికన్ వ్యాపారవేత్తలకు ఆహ్వానం



యూఎస్ ఆర్థిక మంత్రి జానెట్ ఎలెన్‌తో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

వాషింగ్టన్: గ్లోబలైజేషన్ ప్రయోజనాలను తక్కువ చేసి చూపాలని భారత్ కోరుకోవడం లేదని కేంద్ర లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అయితే దానిని మరింత పారదర్శకంగా మార్చాలని కోరుతోందని పేర్కొన్నారు. ప్రముఖ అమెరికన్ పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ మేరకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) మరింత ప్రగతిశీలంగా ఉండాలని, ఇతర దేశాల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని భారత్ కోరుతోందన్నారు. ''వినడానికి మాత్రమే కాకుండా చెప్పడానికి భిన్నమైన దేశాలకు డబ్ల్యూటీఓ మరింత వెసులుబాటు ఇవ్వాల్సిన అవసరం ఉందని'' ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**పరస్పర ప్రయోజనాలు లక్ష్యంగా..**

భారత్ చాలా కాలంలో తన తయారీ రంగం వృద్ధి చెందేలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. తను ఉత్పత్తి చేయగల వినియోగ వస్తువులను కూడా దిగుమతి చేసుకోవడం లేదని తెలిపారు. అయితే ధర వ్యత్యాసాలు, పోటీతత్వం వంటి అంశాలు అంతర్జాతీయంగా కొనుగోలు నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యల విషయంలో ఆయా దేశాల మధ్య పరస్పర ప్రయోజనకర అవగాహనలు అవసరమని అన్నారు.

**పెట్టుబడులకు గమ్యస్థానం**

ఇక అంతర్జాతీయ పెట్టుబడులకు భారత్ తగిన ప్రాంతమని ఆమె ఉద్ఘాటించారు. నైపుణ్యం, డిజిటలైజేషన్‌పై భారత్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు సీతారామన్ స్పష్టం చేశారు.

**క్రిప్టో 'జీ 20' ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్!**

క్రిప్టో రిస్కులను ఎదుర్కోవడానికి ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడమే ఇండియా జీ20 ప్రెసిడెన్సీ లక్ష్యమని కూడా ఆర్థికమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో క్రిప్టోకరెన్సీలతో సంబంధం ఉన్న నష్టాలను ఎదుర్కోవడానికి అన్ని దేశాలకు ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్ అవసరమన్నారు.

**భారత్ పారదర్శక ఎకానమీ**

భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆమె అమెరికన్ వ్యాపారవేత్తలను అభ్యర్థించారు. తద్వారా పారదర్శక ఎకానమీ నుంచి లభించే ప్రయోజనాలు పొందాలని అమెరికా ఇండియా బిజినెస్ కౌన్సిల్ నిర్వహించిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో సూచించారు. ప్రస్తుత భారత్ ప్రభుత్వం దేశ వృద్ధికి సంబంధించి అంతర్జాతీయ పరిశ్రమ భాగస్వామ్యం కోసం తగిన వ్యూహ రచన చేస్తున్నట్లు వివరించారు. మహమ్మారి వంటి సవాళ్ల సమయంలోనూ దేశాభివృద్ధే లక్ష్యంగా సంస్కరణల బాటన నడిచిందన్నారు.

## ఆడి క్యూ3 మోడళ్ల ధర పెంపు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ సంస్థ ఆడి క్యూ3, క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ మోడళ్ల ధరను 1.6 శాతం వరకు పెంచుతోంది. మే 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి వస్తాయని కంపెనీ మంగళవారం ప్రకటించింది. దిగుమతి సుంకం, తయారీ ఖర్చుల పెరుగుదల ప్రభావాన్ని భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కంపెనీ ఇప్పటికే ఏప్రిల్ 1 నుంచి క్యూ8 సెలబ్రేషన్, ఆర్ఎస్5, ఎస్5 మోడళ్ల ధరను 2.4 శాతం వరకు అధికం చేసింది. వివిధ స్థాయిలలో వ్యయ భారాన్ని గ్రహించడానికి ప్రయత్నించినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెరుగుదల తప్పనిసరి అయిందని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 12-4-2023 | |
|---|---|
| విశాఖ | 420–00 |
| చిత్తూరు | 428–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 385–00 |
| విజయవాడ | 385–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **11-4-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 360–00 |
| వరంగల్ | 362–00 |
| రిటైల్ ధర | 4.20 |

# ఏడో రోజూ ఆగని దూకుడు

- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లకు డిమాండ్
- నెలరోజుల గరిష్టానికి సూచీలు
- 60 వేల పైకి సెన్సెక్స్
- 17,700 ఎగువకు నిఫ్టీ



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో ఏడోరోజూ బుల్ దూకుడు కొనసాగింది. నాలుగో క్వార్టర్ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు మెరుగ్గా నమోదు కావచ్చనే విశ్వాసం, విదేశీ పెట్టుబడులు వెల్లువలా కొనసాగడం సెంటిమెంట్‌ను బలపరిచాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఈ పరిణామాలతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు నెలరోజుల గరిష్టం వద్ద ముగిశాయి. గడిచిన నాలుగు నెలలో సూచీలు వరుసగా ఏడు రోజుల ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా.., ఐటీ, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లోనూ చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.62%, 0.50శాతం చొప్పున పెరిగాయి. మొత్తం రూ. 343 కోట్ల షేర్లను కొని విదేశీ ఇన్వెస్టర్లు ఎనిమిదో రోజూ నికర కొనుగోలుదారులుగా నిలిచారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.264 కోట్ల షేర్లు కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ పదమూడు పైసలు స్వల్పంగా బలహీనపడి 82.12 వద్ద స్థిరపడింది. కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు సైకిల్‌ను ఆపేయొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. ఆసియాలో చైనా మినహా అన్ని మార్కెట్లు ఒకటిన్నర శాతం పెరిగాయి. యూరప్ మార్కెట్లు ఒకశాతం ర్యాలీ చేశాయి.

**లాభ, నష్టాల మధ్య ట్రేడింగ్...**

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 183 పాయింట్ల లాభంతో 60వేల స్థాయిపైన 60,029 వద్ద మొదలైంది. నిఫ్టీ 17వేల స్థాయిపైన 17,705 వద్ద ప్రారంభమైంది. వరుస అయిదు రోజుల ర్యాలీ నేపథ్యంలో గరిష్టాల వద్ద లాభాల స్వీకరణతో మిడ్‌సెషన్ కల్లా సూచీలు ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. అయితే మిడ్‌సెషన్‌లో యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది.ఫైనాన్స్, బ్యాంకింగ్, మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొనడంతో సూచీలు జోరు చివరి దాకా కొనసాగింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,268 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్ల లాభంతో 60,152 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,749 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని చేరింది. ఆఖరికి 98 పాయింట్లు బలపడి 17,722 వద్ద నిలిచింది.

**ఏడురోజులు @ రూ.12.56 లక్షల కోట్లు**

గడచిన ఏడు రోజుల్లో సెన్సెక్స్ 2,544(4.42%) ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో మొత్తం రూ. 12.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఎక్ఛ్సేంజీలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.265 కోట్లకు చేరింది. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూలతలు సెన్సెక్స్ సూచీని 60వేల స్థాయిపైకి చేరేందుకు తోడ్పడ్డాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం, జీఎస్‌టీ వసూళ్లు గణనీయంగా పెరగడం, స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడం తదితర అంశాలు సూచీల వరుసగా ర్యాలీకి అండగా నిలిచాయి'' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి(బుధవారం)కి ముందు టీసీఎస్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.3214 వద్ద ముగిసింది.
- అడ్వాన్సులు 19% వృద్ధితో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 3% బలపడి రూ.170.85 వద్ద స్థిరపడింది
- భారత్‌లో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి జపాన్‌కు చెందిన దిగ్గజ సంస్థ ఎయూ ఐయానిక్ సెల్యూషన్‌తో డీల్ కుదరడంతో నియోజెన్ కెమికల్స్ 15% బలపడి రూ.1619 వద్ద ముగిసింది.

## ఏపీలో టెక్నో పెయింట్స్ ప్లాంట్లు



ఆకూరి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ తయారీలో ఉన్న టెక్నో పెయింట్స్ రూ.46 కోట్లతో కొత్తగా మూడు ప్లాంట్లను ఈ ఏడాదే నెలకొల్పుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, చిత్తూరుతోపాటు మధ్యప్రదేశ్‌లోని కట్నీ వద్ద ఇవి రానున్నాయి. ఈ కేంద్రాల్లో డ్రై సిమెంట్ పుట్టీ, టెక్చర్స్, ప్రైమర్స్, ఎమల్షన్స్ తయారు చేస్తారు. తొలి దశలో ఒక్కొక్క ప్లాంటు వార్షిక సామర్థ్యం 30,000 మెట్రిక్ టన్నులని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'తెలంగాణ ప్రభుత్వం నుంచి మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా 26,065 పాఠశాలలకు రంగులు వేసే ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టాం. 2023లో దేశవ్యాప్తంగా రిటైల్‌లో విస్తరిస్తాం. విక్రయ కేంద్రాల్లో కలర్ బ్యాంక్స్ పరిచయం చేస్తాం. వీటితో వినియోగదారు కోరుకున్న రంగును వెంటనే అందించవచ్చు. 2022–23లో 100 శాతం వృద్ధి సాధించాం' అని వివరించారు.

---

**భవిత**



## జాబ్ పాయింట్

### జీజీహెచ్ గుంటూరులో వివిధ ఉద్యోగాలు

గుంటూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్.. ఆల్కహాల్ అండ్ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4

» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్ (సైకియాట్రిస్ట్/ఎంబీబీఎస్ డాక్టర్)–01, కౌన్సిలర్–02,అకౌంటెంట్ కమ్ క్లర్క్–01.

» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్టర్ పోస్టు లేదా వ్యక్తిగతంగా సూపరింటెండెంట్ కార్యాలయం, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, గుంటూరు చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.

» **వెబ్‌సైట్:** www.guntur.ap.gov.in

### మేడ్చల్ జిల్లా డీహెచ్‌ఈడబ్ల్యూలో వివిధ పోస్టులు

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా మహిళ, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (డీహెచ్‌ఈడబ్ల్యూ) డొమెస్టిక్ వయోలెన్స్ సెల్(మేడ్చల్)లో వివిధ ఉద్యోగాల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05

» **పోస్టుల వివరాలు:** ఎక్స్‌పర్ట్(ఫైనాన్షియల్ లిటరసీ)–01, అకౌంట్స్ అసిస్టెంట్–01, ఎంటీఎస్–01, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్–01, జెండర్ స్పెషలిస్ట్–01.

» **అర్హత:**పదో తరగతి,సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, కలెక్టరేట్ కాంప్లెక్స్, రూమ్ నెం.జీ1, అంతాయిపల్లి గ్రామం, శామీర్‌పేట్ మండలం, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 20.04.2023.

» **వెబ్‌సైట్:** www.wdcw.tg.nic.in

### డీఎంహెచ్‌వో, ఖమ్మం జిల్లాలో సపోర్ట్ ఇంజనీర్ పోస్టులు

ఖమ్మం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం .. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05

» **అర్హత:** బీఈ, బీటెక్(సీఎస్ఈ,ఐటీ,ఈసీఈ)లేదా ఎంసీఏతోపాటు నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:**18నుంచి 44ఏళ్ల మధ్య ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఖమ్మంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.

» **వెబ్‌సైట్:**www.khammam.telangana.gov.in

### సంగారెడ్డి జిల్లా ఈఎస్ఐలో 16 పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్..ఒప్పంద ప్రాతిపదికన సంగారెడ్డి జిల్లాలోని ఈఎస్ఐ హాస్పిటల్/ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16

» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్–08, డెంటల్ అసిస్టెంట్ సర్జన్–01, ఫార్మాసిస్ట్–07.

» **అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్, డీఫార్మసీ.

» **వేతనం:** నెలకు సీఏఎస్/డీఏఎస్ రూ.58,850, ఫార్మాసిస్ట్ పోస్టులకు రూ.31,040.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ డైరెక్టర్ ( మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఐదో అంతస్తు, హాస్టల్‌బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్ నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 13.04.2023

» **వెబ్‌సైట్:** https://sangareddy.telangana.gov.in

### విజయనగరం జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్‌లో 20 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

విజయనగరం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్(డీసీసీబీ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 65శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ(ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్), కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.26,080 నుంచి రూ.57,860 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తు, రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 15.04.2023.

» **వెబ్‌సైట్:**www.dccbvizianagaram.com

# ఎంపీసీతో.. కొలువులు ఇవిగో!

ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు అనేకం అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే సీహెచ్‌ఎస్ఎల్, రైల్వేలో గ్రూప్ సీ ఉద్యోగాలు, యూపీఎస్సీ ఎన్‌డీఏ ద్వారా త్రివిధ దళాల్లో ఆఫీసర్ కొలువులు, ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్, కోస్ట్ గార్డులో జాబ్స్, రాష్ట్రాల స్థాయిలో పోలీస్ కానిస్టేబుల్ తదితర కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం ఎంపీసీతో ఉద్యోగాల వివరాలు..




- వివరాలకు వెబ్‌సైట్: www.ssc.nic.in

### ఎస్ఎస్‌సీ.. సీహెచ్‌ఎస్ఎల్

- ఇంటర్మీడియెట్ అర్హతతో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్(సీహెచ్‌ఎస్ఎల్) ఎగ్జామ్‌కు పోటీపడొచ్చు. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో ఎల్‌డీసీ, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్ వంటి పలు ఉద్యోగాలకు నియామకాలు చేపడతారు. టైర్–1, టైర్–2 పేరుతో రెండు దశల్లో పరీక్ష ఉంటుంది.
- టైర్–1 దశలో..200 మార్కులకు నిర్వహించే పరీక్షలో..ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్‌ల్లో ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం వంద ప్రశ్నలు ఉంటాయి.
- టైర్–1లో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి టైర్–2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షను రెండు సెషన్‌లు, మూడు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ విధానంలో నిర్వహిస్తారు. సెషన్–1లో సెక్షన్–1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్ (30 ప్రశ్నలు–90 మార్కులు), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(30 ప్రశ్నలు–90 మార్కులు), సెక్షన్–2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్(40 ప్రశ్నలు–120 మార్కులు), జనరల్ అవేర్ నెస్(20 ప్రశ్నలు–60 మార్కులు), సెక్షన్–3లో మాడ్యూల్–1లో కంప్యూటర్ నాలెడ్జ్ (15 ప్రశ్నలు–45 మార్కులు), సెషన్–2లో సెక్షన్–3లో మాడ్యూల్–2లో స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

### ఆర్ఆర్‌బీ..టెక్నికల్ ఉద్యోగాలు

ఇంటర్ అర్హతతో ఇండియన్ రైల్వేలోని గ్రూప్–సి ఉద్యోగాలను దక్కించుకోవచ్చు. ఇందుకోసం సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కేవలం ఇంటర్‌తోనే కాకుండా పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా అర్హతతోనూ గ్రూప్–సి ఉద్యోగాల భర్తీ చేపడతారు. అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ గ్రేడ్–3 పేరుతో పలు టెక్నికల్ విభాగాల్లో సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగాలు గ్రూప్–సి పరిధిలోకి వస్తాయి. ఇంటర్మీడియెట్ అర్హతతో ట్రాఫిక్ అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ టైమ్ కీపర్ వంటి నాన్ టెక్నికల్ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు.

- అసిస్టెంట్ లోకోపైలెట్, టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడిగా రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుంది.
- మొదటి దశలో జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(30 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (30 ప్రశ్నలు) విభాగాల్లో మొత్తం వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుంది.
- మొదటి దశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశకు ఎంపిక చేస్తారు. రెండో దశలో జనరల్ అవేర్‌నెస్(50 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(35 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(35 ప్రశ్నలు) విభాగాల్లో 120 ప్రశ్నలు ఉంటాయి.
- వివరాలకు వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

### త్రివిధ దళాల్లో కొలువులు వయా ఎన్‌డీఏ

- ఇంటర్మీడియెట్ అర్హతతో త్రివిధ దళాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. దీనికి మార్గం.. యూపీఎస్సీ నిర్వహించే నేషన్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో విజయం ద్వారా ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవల్ అకాడమీల్లో శిక్షణకు ఎంపికైతే.. కొలువుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. ఆర్మీ కేడెట్స్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బీఎస్సీ/బీఏ; నేవల్, ఎయిర్‌ఫోర్స్ కేడెట్‌గా శిక్షణ పొందిన వారికి బీటెక్‌తోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభమవుతుంది.
- ఎన్‌డీఏ నియామక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. తొలిదశలో 900 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన వారికి తదుపరి దశలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల ఆధ్వర్యంలోని సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు మరో 900 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. వీటిలో విజయం సాధించిన వారికి ఆయా అకాడమీల్లో క్యాడెట్ ట్రెనీలుగా అవకాశం కల్పిస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

### ఆర్మీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

- ఇంటర్ అర్హతతో అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం.. ఇండియన్ ఆర్మీలోని 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌తో ఉత్తీర్ణత సాధించి.. జేఈఈ–మెయిన్‌లో ర్యాంకు పొందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వీరికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు త్రివిధ దళాలలకు చెందిన మిలటరీ అకాడమీలలో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ పూర్తి చేసుకుంటే..ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, మెకానికల్, నావల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో బీటెక్ డిగ్రీతోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కెరీర్ ప్రారంభించొచ్చు. వీటికోసం ఇండియన్ ఆర్మీ, నేవీలు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి.

### త్రివిధ దళాల్లో అగ్నివీర్

- ఇంటర్మీడియెట్ అర్హతతో త్రివిధ దళాల్లో అగ్నిపథ్ స్కీమ్ ద్వారా చేపడుతున్న అగ్నివీర్ నియామకాలకు పోటీపడొచ్చు. అగ్నివీర్ టెక్నికల్ పోస్టులను ఇంటర్ ఎంపీసీ ఉత్తీర్ణులతో భర్తీ చేస్తున్నారు. ఇందుకోసం రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- నేవీలో.. అగ్నివీర్ ఎస్ఎస్ఆర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్) పేరుతో.. ఇంటర్మీడియెట్ (ఎంపీసీ/బైపీసీ) తత్సమాన కోర్సు అర్హతగా నేవీలోని పలు విభాగాల్లో నియామకాలను ఖరారు చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూప్ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలిదశలో రాత పరీక్ష, మలిదశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. రాత పరీక్ష.. నాలుగు విభాగాల్లో(ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్) వంద మార్కులకు ఉంటుంది. ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు.
- ఎయిర్‌ఫోర్స్‌లోనూ అగ్నివీర్ వాయు పేరిట టెక్నికల్ విభాగాల్లో ఎంపీసీ అర్హతతో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు.

### ఇండియన్ కోస్ట్ గార్డ్


- ఇంటర్మీడియెట్, పదో తరగతి అర్హతతో సుస్థిర కొలువు అందించే వేదిక.. ఇండియన్ కోస్ట్ గార్డ్. తీరగస్తీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో ఇంటర్మీడియెట్ అర్హతతో నావిక్ జనరల్ డ్యూటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లలో నైపుణ్యం ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఐఎన్ఎస్ చిల్కాలో ప్రాథమికంగా శిక్షణ ఇస్తారు. ఇది విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి నియామకాలు ఖరారు చేస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: https://joinindiancoastguard.gov.in

### రాష్ట్ర స్థాయిలో.. పోలీస్ కానిస్టేబుల్స్

రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్ అర్హతతో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు అందుబాటులో ఉంటాయి. కానిస్టేబుల్ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో ప్రిలిమినరీ రాత పరీక్ష, రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మూడో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

తొలిదశ ప్రిలిమినరీ రాత పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందిన వారికి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. వీటిలో సత్తా చాటిన వారికి చివరగా మెయిన్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఈ మూడు దశల్లోనూ విజేతలుగా నిలిచిన వారికి కానిస్టేబుల్‌గా కొలువు సొంతమవుతుంది.

# కరోనా.. కంగారొద్దు



## పూర్తి అప్రమత్తంగా ప్రభుత్వం

- గ్రామస్థాయిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పరీక్షలు, మందులు
- ఆస్పత్రుల్లో అందుబాటులో 12 వేల సాధారణ, 34 వేల ఆక్సిజన్ పడకలు
- పుష్కలంగా మందుల నిల్వాలు

**సాక్షి, అమరావతి:** దేశవ్యాప్తంగా కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. కేంద్ర వైద్యశాఖ ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే తొలి నుంచి కరోనా వైరస్ నియంత్రణ పట్ల పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. ఒకవేళ మన వద్ద కేసుల నమోదు పెరిగినా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామస్థాయిలోనే అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలతో పాటు, పాజిటివ్ రోగులకు వైద్యసేవలను అందుబాటులో ఉంచుతోంది.

### విలేజ్ క్లినిక్స్‌లో ర్యాపిడ్ కిట్‌లు

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను చేరువ చేయడానికి 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో కరోనా పరీక్షతో పాటు 14 రకాల రోగ నిర్ధారణకు ర్యాపిడ్ కిట్‌లతో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి విలేజ్ క్లినిక్‌లో కనీసం 10 కరోనా పరీక్షల ర్యాపిడ్ కిట్‌లను వైద్యశాఖ నిరంతరం అందుబాటులో ఉంచుతోంది. ర్యాపిడ్ టెస్టుల్లో పాజిటివ్‌గా తేలినవారి నమూనాలను ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లకు పంపి పరీక్షించనున్నారు. రాష్ట్రంలో 13 ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి.

### ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కేసులు అధికం

కొత్త వేరియంట్ కేసుల నమోదుపైనా వైద్యశాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. పాజిటివ్ రోగుల నమూనాలను విజయవాడలోని జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు తేలింది. గత నెల ఒకటో తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ మధ్య పాజిటివ్ రోగుల 167 నమూనాలను సీక్వెన్సింగ్ చేశారు. వీటిలో అత్యధికంగా 84 కేసులు ఎక్స్‌బీబీ.1.16 రకం ఉన్నాయి. ఎక్స్‌బీబీ.1 రకం కేసులు 13, ఎక్స్‌బీబీ.2.3. వేరియంట్ కేసులు 17, మిగిలినవి ఇతర వేరియంట్‌లుగా తేలింది.

### ఎనీటైమ్ అందుబాటులో పడకలు, మందులు

కరోనా తొలి వేవ్ నుంచి వైరస్ వ్యాప్తి తగ్గినప్పటికీ.. ఆస్పత్రుల్లో పడకలు, మందులు, ఆక్సిజన్ నిల్వలు, ఇతర చికిత్స వనరులను ప్రభుత్వం నిరంతరం అందుబాటులో ఉంచుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో 12,292 సాధారణ, 34,763 ఆక్సిజన్, 8,594 ఐసీయూ, 1,092 పీడియాట్రిక్ ఐసీయూ పడకలు అందుబాటులో ఉన్నాయి. 5,813 వెంటిలేటర్లు, 5,610 పీడియాట్రిక్ వెంటిలేటర్లు, 297 నియోనాటల్ వెంటిలేటర్లు, 3,902 డీటైప్ సిలిండర్లు, 15,565 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 170 పీఎస్ఏ ప్లాంట్‌లు ఉన్నాయి. వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయడానికి 2,64,109 ర్యాపిడ్ కిట్‌లు, 4,88,962 వీటీఎం-ఆర్టీపీసీఆర్ కిట్‌లు ఉన్నాయి. చికిత్సలో వాడే రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు 1.39 లక్షలు, ఇతర మందుల నిల్వలు సరిపడా ఉన్నాయి.

### వందశాతం రెండుడోసుల వ్యాక్సినేషన్

రాష్ట్రంలో 18 ఏళ్లుపైబడిన 3.95 కోట్ల మందికి కరోనా వ్యాక్సిన్ వేయాల్సిందిగా లక్ష్యం ఉంది. ఈ క్రమంలో లక్ష్యానికి మించి 4.35 కోట్ల మందికి ఇప్పటికే రెండుడోసుల వ్యాక్సినేషన్ పూర్తయింది. 12 నుంచి 17 ఏళ్ల పిల్లలందరికీ రెండుడోసుల వ్యాక్సిన్ వేశారు. 18–59 మధ్య వయసుగల 2.30 కోట్ల మందికి ప్రికాషన్ డోసు టీకాను వైద్యశాఖ వేసింది.

### ఆందోళనకర పరిస్థితి లేదు



రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి పూర్తి నియంత్రణలో ఉంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒకవేళ కేసులు పెరిగినా సమర్థంగా నియంత్రించడానికి అన్ని వనరులు సిద్ధంగా ఉన్నాయి. ఫీవర్ సర్వేను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం 49వ రౌండ్ ఫీవర్ సర్వే చేపడుతున్నాం. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి అవసరం మేరకు వైరస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైరస్ బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. సాధారణ ప్రజలు సైతం సమూహాల్లో ఉన్నప్పుడు మాస్క్ ధరించాలి.

– ఎం.టి.కృష్ణబాబు, ముఖ్యకార్యదర్శి వైద్య, ఆరోగ్యశాఖ

# వలంటీర్‌పై టీడీపీ నేత కుటుంబం దాడి

- ఇంటి పన్ను వసూలుకు వెళ్లినందుకు ఆగ్రహం
- రెండోసారి దౌర్జన్యం చేయడంతో తిరగబడ్డ వలంటీర్ కుటుంబ సభ్యులు
- ఇరు వర్గాల పరస్పర ఫిర్యాదులు.. 12 మందిపై కేసు

**బుచ్చెయ్యపేట (అనకాపల్లి జిల్లా):** ఇంటి పన్ను వసూలుకు సచివాలయ సెక్రటరీతో కలిసి వెళ్లిన గ్రామ వలంటీర్‌పై టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురంలో జరిగింది. గ్రామ సచివాలయ పంచాయతీ సెక్రటరీ వసంతతో కలిసి గ్రామ వలంటీర్ పడాల శివ మంగళవారం గ్రామంలో ఇంటి పన్ను వసూలు చేపట్టారు. అందరి ఇళ్లకు వెళ్లినట్లే మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ ఇంటికి వెళ్లి మూడు సంవత్సరాల ఇంటి పన్ను కట్టవలసి ఉందని డిమాండ్ నోటీసు ఇచ్చారు. దీనిపై మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ కుటుంబానికి ఏమీ రాలేదని వలంటీర్‌పై ఎదురు ప్రశ్నలు వేశారు. 'ఈ ఏడాదిలోనే మీ కుటుంబానికి రైతు భరోసా, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ ఇతర పథకాల ద్వారా రూ.85 వేలు అందించింద'ని వలంటీర్ వివరించారు. తమ కుటుంబానికి మరికొన్ని పథకాలు రాలేదని వలంటీర్‌తో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు గొడవపడ్డారు. మాటామాటా పెరిగి వలంటీర్‌పై దాడి చేశారు. దీంతో ఘర్షణ విషయం తెలుసుకున్న వలంటీర్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం పోలీసు కేసు పెట్టేందుకు వెళుతుండగా రాజాం వెదళ్లగెడ్డ బ్రిడ్జి వద్ద వలంటీర్ కుటుంబ సభ్యులపై మాజీ సర్పంచ్ తదితరులు మరోమారు దౌర్జన్యానికి దిగారు. దాంతో వలంటీర్ కుటుంబ సభ్యులు తిరగబడ్డారు. ఈ ఘటనలో వలంటీర్ చెయ్యి దెబ్బతినగా అతని తాత ప్రగడ రామస్వామికి గాయాలయ్యాయి. మాజీ సర్పంచ్ సత్యనారాయణకు గాయాలవగా ఇరువర్గాలవారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడ్డ ఇరువర్గాలవారు అనకాపల్లి ఏరియా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ కుమారస్వామిని వివరణ కోరగా గ్రామ వలంటీర్ ఆరుగురిపైన, మాజీ సర్పంచ్ వర్గీయులు ఆరుగురిపైన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

# పూలే ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

### స్పీకర్ తమ్మినేని సీతారాం

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. గత ప్రభుత్వాలన్నీ బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాయని, వారి అభ్యున్నతికి ఎలాంటి పనులు చేయలేదన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదని... బ్యాక్‌బోన్ అని సీఎం వైఎస్ జగన్ నిరూపించారని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళంలోని పాన్నాడ వంతెన వద్ద ఉన్న పూలే పార్కులో మంగళవారం నిర్వహించారు.

# పేదలందరూ బీమా పరిధిలోకి..!

- అతి తక్కువ ప్రీమియంతో జీవిత, ప్రమాద బీమా సదుపాయం
- ఉపాధి కూలీలు, పొదుపు మహిళలకు బీమా కల్పించాలని కేంద్రం లక్ష్యం
- వీధి విక్రయదారులు, పారిశుధ్య కార్మికులకు కూడా...
- జూన్ నెలాఖరు వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచారం
- తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం లేఖ

**సాక్షి, అమరావతి:** పేదలందరినీ బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద జీవిత, ప్రమాద బీమా సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. జూన్ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. బ్యాంక్ ఖాతా ఉన్నవారు ఏడాదికి రూ.330లు చెల్లిస్తే పీఎంజేజేబీవై కింద రూ.2లక్షలు జీవిత బీమా, ఏటా కేవలం రూ.12లు ప్రీమియం చెల్లిస్తే పీఎంఎస్‌బీవై కింద రూ.రెండు లక్షలు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు, పొదుపు సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికులు, వీధివిక్రయదారులతోపాటు అంగన్‌వాడీ వర్కర్లు అందరినీ ఈ బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ జితేంద్ర అసతి రెండురోజుల కిందట అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాశారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని అర్హులందరూ బీమా ప్రీమియం చెల్లించేలా విస్తృత ప్రచారం నిర్వహించడంతోపాటు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి కేంద్ర ఆర్థికశాఖ అధికారులు వివిధ రాష్ట్రాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. కాగా, మన రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండగా.. ఉపాధి హామీ పథకంలోనూ 93.81 లక్షల మంది క్రియాశీలక కూలీలుగా కొనసాగుతున్నారు.



# 'పూలే ఆశయాలను అమలుచేస్తున్న ప్రభుత్వం'

**సాక్షి, అమరావతి:** బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన అలుపెరగని కృషిని ఆదర్శంగా తీసుకుని రైతులకు ఉచితంగా, పేదలకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయడం ద్వారా ఆ మహనీయుని ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఏపీ జెన్కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ చక్రధర్‌బాబు అన్నారు. విద్యుత్ సౌధలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటం వద్ద చక్రధర్‌బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. చక్రధర్‌బాబు మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అణగారినవర్గాల సంక్షేమం కోసం విద్యుత్ రంగంలోనూ నవరత్నాలను అమలు చేస్తోందని తెలిపారు.

# అటకాయించడమే కాక.. ఎదురుదాడా!?

**హనుమాన్ జంక్షన్ రూరల్ :** దొంగే దొంగా.. దొంగా అన్నట్లుగా ఉంది ఈనాడు పైత్యం చూస్తుంటే. చట్ట ప్రకారం.. నిబంధనల ప్రకారం కృష్ణాజిల్లా గన్నవరం పోలీసులు విధులు నిర్వర్తించినప్పటికీ వారి విధులకు ఆటంకం కలిగించడమే కాక వారిపై ఎదురుదాడికి దిగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పడక గదిలోకి చొరబడి దౌర్జన్యం' అంటూ ఆ పత్రిక మంగళవారం సంచికలో అచ్చేసిన తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిజానికి.. తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణిని అరెస్టుచేయటానికి వచ్చిన గన్నవరం పోలీసులపై నిందితురాలి కుటుంబ సభ్యులు దురుసుగా ప్రవర్తించి, వారి విధులకు ఆటంకం కలిగించారు. ఆమెను అరెస్టుచేసేందుకు వచ్చినట్లు ఎస్ఐ జి. రమేష్‌బాబు వారికి చెప్పారు. కానీ, ఈ సమయంలో సాయికల్యాణి కుటుంబ సభ్యులు ఎస్ఐతో పాటుగా వచ్చిన మహిళా కానిస్టేబుళ్లపై దురుసుగా వ్యవహరిస్తూ నానా దుర్భాషలాడారు. అరెస్టుకు సహకరించాల్సిందిగా ఎస్ఐ రమేష్‌బాబు పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ పోలీసులపై ఆమె కుటుంబ సభ్యులు ఎదురుదాడికి దిగారు. దీంతో సాయికల్యాణిని అరెస్ట్‌చేసి తీసుకువెళ్లేందుకు యత్నించిన పోలీసులకు ఆమె కుటుంబ సభ్యులు అడ్డుపడి ఆటంకాలు సృష్టించారు. ఇలా దాదాపు గంటసేపు అరెస్టుచేయటానికి వచ్చిన గన్నవరం పోలీసులకు చుక్కలు చూపించారు. అయినప్పటికీ ఎంతో ఓర్పుతో, సంయమనంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించిన పోలీసులు ఆమె దుస్తులు మార్చుకుని, బ్రష్ చేసుకునేందుకు తగిన సమయం ఇచ్చిన తర్వాతే అరెస్టుచేసి తీసుకువెళ్లారు. కానీ, ఈనాడు పత్రిక ఈ వివరాలేమీ ప్రస్తావించకుండా ఏకపక్షంగా పోలీసుల తీరును అభ్యంతరకర రీతిలో విమర్శించడం శోచనీయం .అయినా, తప్పు చేసిన వారి కోసం పోలీసులు ఎక్కడైనా వెతుకుతారు. ఇందులో తప్పేముంది?.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.